## సుప్రీంను రాష్ట్రపతి ప్రశ్నించడాన్ని వ్యతిరేకించండి: స్టాలిన్

చెన్నై: బిల్లుల ఆమోదం విషయంలో తనకు, గవర్నర్లకు గడువు విధించడంపై సుప్రీంకోర్టుకు ప్రశ్నలు సంధిస్తూ రాష్ట్రపతి న్యాయ సలహా కోరడాన్ని వ్యతిరేకించాలని బీజేపీ యేతర రాష్ట్రాల సీఎంలను తమిళనాడు సీఎం స్టాలిన్ కోరారు. దీనిపై సమన్వయ, వ్యూహాత్మక న్యాయపోరాటం సాగించాలని 8 రాష్ట్రాల సీఎంలకు లేఖ రాశారు. తమ రాష్ట్ర గవర్నర్ బిల్లుల ఆమోదంపై జాప్యం చేసిన కేసులో సుప్రీంకోర్ట్ ఇచ్చిన తీర్పు ప్రకారం అత్యున్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు రాజ్యాంగ నైతికతతో వ్యవహరించాలన్నారు. ఈ తీర్పును అస్థిరపరచడానికి బీజేపీ ప్రయత్నిస్తున్నదని, ఇందులో భాగంగానే రాష్ట్రపతి ద్వారా సుప్రీంకోర్టుకు ప్రశ్నలు సంధించిందన్నారు.

### గుల్జార్ హౌస్ మృతుల కుటుంబాలకు
## నష్ట పరిహారం ప్రకటించిన ప్రభుత్వం

హైదరాబాద్: హైదరాబాద్ పాతబస్తీలోని గుల్జార్‌హౌజ్ ప్రాంతంలో సంభవించిన ఘోర అగ్నిప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.5 లక్షల చొప్పున తక్షణ ఆర్థిక సహాయం (ఎక్స్‌గ్రేషియా) ప్రకటించారు. ఈ దురదృష్టకర సంఘటనలో 17 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆయన తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాద వార్త తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హుటాహుటిన స్పందించారు. అగ్నిమాపక, పోలీసు ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి, సహాయక చర్యల పురోగతిని ఎప్పటికప్పుడు ఆరా తీశారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలను వేగవంతం చేయాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ దుర్ఘటనపై సమగ్ర విచారణ జరిపి, ప్రమాదానికి గల కారణాలను లోతుగా దర్యాప్తు చేయాలని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన నివారణ చర్యలు చేపట్టాలని, ప్రజల్లో భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. క్షతగాత్రులకు అందుతున్న వైద్య సహాయంపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. అందుబాటులో ఉన్న మంత్రులు, ఉన్నతాధికారులు తక్షణమే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించాలని, బాధితులకు అన్ని విధాలా అండగా నిలవాలని సూచించారు. కొందరు బాధితుల కుటుంబ సభ్యులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడిన ముఖ్యమంత్రి, వారికి ధైర్యం చెప్పి, ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఈ ప్రమాదంలో అగ్నిమాపక సిబ్బంది చూపిన ధైర్యసాహసాలను ముఖ్యమంత్రి ప్రశంసించారు. ప్రాణాలకు తెగించి మంటల్లో చిక్కుకున్న సుమారు 40 మందిని వారు సురక్షితంగా కాపాడగలిగారని తెలిపారు. వారి సకాల స్పందన వల్ల మరిన్ని ప్రాణ నష్టం జరగకుండా నివారించగలిగామని అన్నారు. ప్రభుత్వం బాధితులందరికీ అండగా ఉంటుందని, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు.

### ఉక్రెయిన్ తో యుద్ధం వేళ...
## రష్యా గోల్ ఏంటో చెప్పిన పుతిన్

రష్యా : రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఉక్రెయిన్ యుద్ధంపై కీలక వ్యాఖ్యలు చేశారు. తమ గోల్ ఏంటో చెప్పారు. యుద్ధానికి దారితీసిన మూల కారణాలను పూర్తిగా తొలగించి, రష్యా భద్రతకు భరోసా కల్పించడమే తమ దేశ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. అయితే, ఈ ప్రకటన వెలువడిన తరుణంలోనే రష్యా ఉక్రెయిన్‌పై రికార్డు స్థాయిలో డ్రోన్లతో విరుచుకుపడటం, ఈ దాడిలో ఒకరు మరణించడం ప్రస్తుత పరిస్థితికి అద్దం పడుతోంది. రష్యా ప్రభుత్వ టెలివిజన్‌కు ఆదివారం ఇచ్చిన ఇంటర్వ్యూలో అధ్యక్షుడు పుతిన్ మాట్లాడుతూ, ప్రస్తుత సంక్షోభానికి దారితీసిన మూలకారణాలను నిర్మూలించడం, శాశ్వత శాంతికి అనువైన పరిస్థితులు సృష్టించడం, అలాగే రష్యా భద్రతకు హామీ ఇవ్వడం మాస్కో యొక్క ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఉక్రెయిన్‌లోని సుమారు 20 శాతం భూభాగాన్ని తమ నియంత్రణలో ఉంచుకున్న రష్యా బలగాలకు, ఈ లక్ష్యాలను సాధించడానికి అవసరమైన అన్ని వనరులు ఉన్నాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అయితే, పుతిన్ ఈ వ్యాఖ్యలు చేసిన సమయంలోనే, రష్యా శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఉక్రెయిన్‌పై భారీ ఎత్తున డ్రోన్ల దాడికి పాల్పడింది. ఈ దాడిలో ఒక మహిళ మృతి చెందిందని కీవ్ ప్రాంతీయ గవర్నర్ మైకోలా కలాష్నిక్ ధ్రువీకరించారు. ఉక్రెయిన్ వాయు రక్షణ విభాగం వెల్లడించిన వివరాల ప్రకారం, రష్యా “273 షాహెద్ అటాక్ డ్రోన్లు, వివిధ రకాల ఇమిటేటర్ డ్రోన్లను” ప్రయోగించింది. వీటిలో 88 డ్రోన్లను విజయవంతంగా అడ్డుకోగా, 128 డ్రోన్లు ఎలాంటి నష్టం కలిగించకుండానే లక్ష్యాలను చేరుకోలేకపోయాయని పేర్కొంది. ఇది మునుపెన్నడూ చూడని స్థాయిలో జరిగిన డ్రోన్ల దాడి అని, రష్యా ఉద్దేశపూర్వకంగా పౌరులనే లక్ష్యంగా చేసుకుంటోందని ఉక్రెయిన్ ఉప ప్రధాని యులియా స్విరిడెంకో ఆరోపించారు. మరోవైపు, రష్యా సైనిక అధికారులు మాత్రం ఆదివారం రాత్రి, ఉదయం సమయంలో తమ భూభాగంపైకి దూసుకొచ్చిన 25 ఉక్రెయిన్ డ్రోన్లను అడ్డగించినట్లు ప్రకటించారు.

## గుల్జార్‌హౌస్ ప్రమాద ఘటనపై స్పందించిన ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు

ఢిల్లీ: ఆదివారం ఉదయం చార్మినార్ పరిధిలోని గుల్జార్‌హౌస్‌లో సంభవించిన అగ్నిప్రమాదంపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో పలువురి కలిచివేసిందని తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన ప్రధాని... క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు రూ. 2లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. అలాగే గాయపడిన వారికి రూ. 50వేల పరిహారం ఇస్తామని తెలిపారు. కాగా, గుల్జార్‌హౌస్‌లో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో ఇప్పటివరకు 17 మంది మృతిచెందారు. మృతుల్లో ఎనిమిది మంది చిన్నారులు ఉన్నారు. ఉదయం భవనం మొదటి అంతస్తులో ఒక్కసారిగా భారీగా అగ్నికీలలు ఎగసిపడ్డాయి. దీంతో భారీగా ప్రాణనష్టం సంభవించింది. మంటల్లో చిక్కుకున్న కొందరిని అగ్నిమాపక సిబ్బంది కాపాడి యశోద (మలక్‌పేట), ఉస్మానియా, డీఆర్‌డీఓ అపోలో ఆసుపత్రులకు తరలించారు.

సీఎం చంద్రబాబు సంతాపం

గుల్జార్‌హౌస్ అగ్నిప్రమాద ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సంతాపం తెలిపిన ముఖ్యమంత్రి... మృతుల కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. క్షతగ్రాతులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## గుల్జార్‌హౌస్ అగ్నిప్రమాద ఘటన అత్యంత బాధాకరం

హైదరాబాద్: చార్మినార్ పరిధిలోని గుల్జార్‌హౌస్‌లో అగ్నిప్రమాద ఘటనపై కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అగ్నిప్రమాదంలో పలువురు మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

సీఎం రేవంత్ రెడ్డికి మల్లికార్జున ఖర్గే ఫోన్

సీఎం రేవంత్‌రెడ్డికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఫోన్ చేశారు. గుల్జార్‌హౌస్ అగ్నిప్రమాద ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును సీఎం ఆయనకు వివరించారు. ఎప్పటికప్పుడు సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఘటనాస్థలికి మంత్రులు వెళ్లినట్లు చెప్పారు. గుల్జార్‌హౌస్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో 17 మంది మృతి చెందారు. మృతుల్లో ఎనిమిది మంది చిన్నారులున్నారు. ఆదివారం ఉదయం భవనం మొదటి అంతస్తులో మంటలు చెలరేగాయి. మంటల్లో చిక్కుకున్న కొందరిని అగ్నిమాపక సిబ్బంది రక్షించి ఉస్మానియా, యశోద (మలక్‌పేట), డీఆర్డీవో అపోలో ఆసుపత్రులకు తరలించారు. విద్యుదాఘాతం వల్లే భవనంలో మంటలు చెలరేగినట్లు అధికారులు తెలిపారు.

### తిరుపతిలో దళిత విద్యార్థి జేమ్స్‌పై
## దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను: జగన్

అమరావతి: తిరుపతిలో ఇంజినీరింగ్ విద్యార్థి జేమ్స్‌పై జరిగిన దాడిని వైసీపీ అధినేత జగన్ తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, దళితులు, బలహీన వర్గాలపై దాడులు నిత్యకృత్యంగా మారాయని మండిపడ్డారు. ఈ మేరకు సోషల్ మీడియాలో స్పందించారు. “తిరుపతిలో ఇంజినీరింగ్ దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. రాష్ట్రంలో దిగజారిపోయిన శాంతి భద్రతలకు, దళితులపై తీవ్రమవుతున్న దాడులకు ఈ ఘటన ఒక ఉదాహరణ. దళితులు, తమ గొంతు గట్టిగా వినిపించలేని వర్గాల వారికి ఈ రాష్ట్రంలో రక్షణ లేకుండా పోయింది. చంద్రబాబు, అధికారపార్టీ నాయకుల డైరెక్షన్‌లో కక్ష సాధింపు చర్యల్లో మునిగితేలుతున్న పోలీసు యంత్రాంగం పౌరులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యతను పూర్తిగా విస్మరించడంవల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట దళితులపైన దాడులు జరుగుతూనే ఉన్నాయి. పోలీస్‌స్టేషన్లకు వెళితే న్యాయం జరుగుతుందన్న నమ్మకం పోవడమేకాదు, ఫిర్యాదుదారులమీదే ఎదురు కేసులు పెట్టడం పరిపాటిగా మారింది. జేమ్స్‌పై దాడి ఘటనలో పోలీసు యంత్రాంగం వైఫల్యమే కాదు, రాజకీయ జోక్యంతో కనీసం ఫిర్యాదునుకూడా స్వీకరించలేని పరిస్థితి. తిరుపతి ఘటనకు కారకులైన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాను” అంటూ జగన్ ట్వీట్ చేశారు.

### విజయనగరంలో విషాదం..
## కారులో ఊపిరి ఆడక నలుగురు చిన్నారుల మృతి
### సరదాగా ఆడుకునేందుకు కారులోపలికి వెళ్లిన తర్వాత..
### లాక్ పడటంతో ఊపిరి ఆడక మృతి

విజయనగరం రూరల్: విజయనగరం కంటోన్మెంట్ పరిధిలోని ద్వారపూడి గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. కారు లాక్ పడటంలో అందులో చిక్కుకున్న నలుగురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం నలుగురు చిన్నారులు ఆడుకునేందుకు బయటకు వెళ్లారు. ఎంతసేపైనా తిరిగి రాలేదు. వారి తల్లిదండ్రులు వెతికినా కనిపించలేదు. చివరికి స్థానిక మహిళా మండలి కార్యాలయం వద్ద ఆగి ఉన్న కారులో నలుగురు చిన్నారుల మృతదేహాలను అక్కడున్నవారు గుర్తించారు. సరదాగా ఆడుకునేందుకు కారులోపలికి వెళ్లిన తర్వాత.. లాక్ పడటంతో ఊపిరి ఆడక మృతి చెందినట్లు తెలుస్తోంది. మృతులను ఉదయ్ (8), చారుమతి (8), చరిష్మా (6), మనస్విగా గుర్తించారు.వీరిలో చారుమతి, చరిష్మా అక్కాచెల్లెళ్లు. ఒకేసారి నలుగురు పిల్లలు కన్నుమూయడంతో ద్వారపూడిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. చిన్నారుల మృతదేహాలను పట్టుకుని తల్లిదండ్రులు, బంధువులు రోధించడం ప్రతి ఒక్కరి హృదయాన్ని ద్రవింపజేస్తోంది.

# ఎన్ని జన్మలెత్తినా తెలుగుజాతిలోనే పుట్టాలని కోరుకుంటా

మొదటి పేజి తరువాయి



నేను విజన్ రూపొందిస్తే దానికి సమానంగా ఆయన కూడా ఛానల్ అభివృద్ధిలో విజన్ రూపొందించుకుని ముందుకెళ్తున్నారు. ఒకప్పుడు ఆకాశవాణి తప్ప ఏమీ ఉండేవి కాదు. తర్వాత వార్తా పత్రికలు వచ్చాయి. తర్వాత సమాజంలోకి ఎలక్ట్రానిక్ మీడియా వచ్చింది. 2003లో అలిపిరిలో నాపై మావోయిస్టులు దాడి చేశారు. అప్పుడు ఒక్క జెమినీ మాత్రమే ఉంది... కానీ ఇప్పుడు అనేకం ఉన్నాయి. రవిశంకర్ లాంటి వ్యక్తులు అనేక ఛానల్స్ తీసుకొచ్చారు. ప్రస్తుతం ఇంట్లోనే కూర్చుని ఛానల్ పెట్టుకునే ఆదాయాన్ని కూడా పొందే అవకాశం వచ్చింది. న్యూస్ పేపర్‌కు సర్క్యులేషన్, శాటిలైట్ ఛానల్‌కు టీఆర్పీ, యూట్యూబ్ ఛానల్‌కు వ్యూస్, సబ్‌స్క్రైబ్స్ ఉంటాయి. తెలుగు వన్ ఛానల్ ఇప్పటి వరకు 55 బిలియన్ వ్యూస్, 120 మిలియన్ల సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. 16 లక్షల వీడియాలను, 15 వందలకు పైగా సినిమాలు ఉన్నాయి. తిరుగులేని శక్తిగా తెలుగువన్ తయారైంది. కంఠంనేని రవిశంకర్ అమరావతి రాజధానిపైనా సినిమా కూడా తీశారు. నాడు భయపెట్టే పరిస్థితులు ఉన్నా వెనక్కి తగ్గకుండా న్యాయం, ధర్మం అమరావతికి అన్యాయం జరిగిందని చెప్పి సినిమా తీశారు. సెన్సార్ పేరుతో విడుదల కానివ్వకుండా చేస్తే యూట్యూబ్‌లో వదిలారు. 2000 మంది పేదలకు ఉచితంగా ఆపరేషన్లు చేయించారు. ఆయన సేవా కార్యక్రమాల పట్ల అభినందనలు తెలుపుతున్నాను. తెలుగు వన్ స్ఫూర్తి పురస్కార గ్రహీతలకు అభినందనలు తెలుపుతున్నాను. నేను అరెస్టైన సమయంలో హైదరాబాద్‌లో మీరు పోరాడిన విధానం నా జీవితంలో మర్చిపోలేను. మనం మంచిపని చేస్తే ప్రజలు మర్చిపోతారు అని అంటుంటారు... కానీ ఏ విధంగా ప్రజలు స్పందిస్తారనేది అరెస్టు సమయంలో చూశాను. ఆగస్టు సంక్షోభం వచ్చినప్పుడు ఎన్టీఆర్‌కు మెజారిటీ ఎమ్మెల్యేలు ఉన్నా సీఎం పదవి నుంచి దించేశారు. ఆ సమయంలో ఈనాడు దినపత్రిక చూపిన చొరవతో 30 రోజుల్లోనే తిరిగి ఎన్టీఆర్ మళ్లీ సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు. పేదరికాన్ని నిర్మూలించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. పీ4 ద్వారా అత్యున్నత స్థాయిలో ఉన్నవారు కింద స్థాయిలో ఉన్నవారిని దత్తత తీసుకుంటే మనతో సమానంగా పైకి వస్తారు. ఎన్టీఆర్ కూడా సాధారణ కుటుంబంలో పుట్టి అచెంచలమైన ఆత్మవిశ్వాసంతో పైకొచ్చారు. మళ్లీ ఎన్టీఆర్ లాంటి వ్యక్తులు రారు..ఆయనతో పోల్చుకోవాలంటే మళ్లీ ఆయనే జన్మించాలి.

అగ్రభాగాన తెలుగువారే ఉంటారు

1995-96లో తెలుగు ప్రజలు ఎక్కువగా వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్ మాత్రమే ఉండేవి. మన తెలుగువారి భవిష్యత్ మారే పరిస్థితి రావాలంటే ఐటీని అందిపుచ్చుకోవాలని నిర్ణయించుకున్నాను. ఐటీని ప్రమోట్ చేయాలనే హైటెక్ సిటీ నిర్మించా. మన వారికి పెద్ద ఎత్తున అవకాశాలు కల్పించాం. ఇప్పుడు ప్రపంచంలో ఏ దేశానికి వెళ్లినా ఇండియన్స్ ఉంటారు, అందులో అగ్రభాగాన తెలుగువారు ఉన్నారు. హైటెక్ సిటీ నిర్మిస్తుంటే అందరూ నవ్వారు..కానీ తర్వాత దాని ఫలాలు అందుతున్నాయి. ప్రస్తుత సమయంలో కష్టపడాల్సిన అవసరం లేదు...స్మార్ట్‌గా చేయాలి. నాలెడ్జ్ ఎకానమీలో హిస్టారికల్ సమాచారం ఉంది. ఏ రంగం తీసుకున్నా ఇప్పుడు ఏఐ వచ్చింది. రియల్ టైంలో డేటా సేకరించే అవకాశం వచ్చింది. నాడు హైటెక్ సిటీ, ఐటీ గురించి మాట్లాడాను...ఇప్పుడు ఏఐతో క్వాంటమ్ వ్యాలీ అని చెప్తున్నాను. 2047 నాటికి ప్రపంచలో ఇండియన్స్ ముందుంటే అందులో తెలుగువారు అగ్రభాగాన ఉండాలనేది నా నా ఆశయం..ఇది సాధ్యమవుతుంది. భారతీయులతో పోటీ పడేవారు ప్రపంచంలో ఎక్కడా లేరు.

అమరావతి నిర్మించే అదృష్టం దక్కింది

క్రియేట్ ఎకానమీలో రెండు సిటీలు రూపొందిస్తున్నారు..ఒకటి ముంబై, రెండోది అమరావతి. అమరావతి క్రియేట్ ఎకానమీకి చిరునామాగా ఉంటుంది. అత్యంత నివాసయోగ్యమైన సిటీగా హైదరాబాద్ అవతరించింది. 1995 నుంచి 2000 వరకు బ్లూ ప్రింట్ రెడీ చేసి ఔటర్ రింగ్ రోడ్, ఎయిర్ పోర్టు, జీనోమ్ వ్యాలీ, గచ్చిబౌలి స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు చేశాం. మీ అందరి ఆశీర్వాదాలతో నాకు మరో అవకాశం దక్కింది. హైదరాబాద్‌ను అప్పట్లో అభివృద్ధి చేసే అవకాశం కల్పించారు. ఇప్పుడు మరోనగరం అమరావతిని తెలుగుజాతికి అందించే అదృష్టం దక్కింది. భవిష్యత్తులో అమరావతి, హైదరాబాద్ మొదటి, రెండవ స్థానాల్లో ఉంటాయి.

వ్యక్తిత్వ హననంతో సమాజానికి హాని

ఏది చేయాలన్నా విశ్వసనీయత అవసరం. ఎన్జీవో, మీడియాకు విశ్వసనీయత ఉండాలి. స్వాతంత్ర్యోద్యమ సమయంలో పత్రికలు, జర్నలిస్టులు కీలకపాత్ర పోషించారు. కానీ ఇప్పుడు పోటీ ప్రపంచంలో విలువలు పడిపోతున్నాయి. సోషల్ మీడియాతో ఎంత లాభం ఉందో..అంతనష్టం ఉంది. సోషల్ మీడియాను వేదికగా తీసుకని వ్యక్తిత్వ హననం, తప్పుడు సమాచారానికి పాల్పడుతున్నారు. దీనిపై నియంత్రణ అవసరం. ఇళ్లలో ఉండే ఆడబిడ్డల వ్యక్తిత్వాన్ని హననం చేస్తే సమాజానికి హాని కలుగుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిష్పక్షపాత మీడియాను ప్రోత్సహించే అంశంపై ఆలోచిస్తాయి. దుర్మార్గపు ఆలోచన చేసే వారిని నియంత్రించాల్సి ఉంది” అని సీఎం చంద్రబాబు అన్నారు.




మొదటి పేజి తరువాయి

### అగ్నిమాపక సిబ్బందికి సరైన శిక్షణ అందించాలి: కిషన్‌రెడ్డి

అగ్నిప్రమాదం జరిగిన భవనాన్ని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పరిశీలించారు. అధికారులతో మాట్లాడి పరిస్థితి తెలుసుకున్నారు. ఆదివారం ఉదయం 6 గంటలకు ప్రమాదం జరిగిందని చెప్పారు. సహాయక చర్యల్లో అగ్నిమాపక సిబ్బంది ఆలస్యం చేశారని బాధితులు ఆరోపిస్తున్నారని తెలిపారు. చిన్న ప్రమాదమే అయినా.. ప్రాణ నష్టం ఎక్కువగా ఉందన్నారు. అగ్నిమాపక సిబ్బందికి ప్రభుత్వం సరైన పరికరాలు, శిక్షణ అందించాల్సి ఉందని చెప్పారు. అగ్నిమాపక శాఖ సాంకేతికతను మెరుగుపరుచుకోవాలని అభిప్రాయపడ్డారు. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబాలకు కేంద్రం తరఫున సాయం అందిస్తామని తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

### పాతబస్తీ అగ్నిప్రమాదంపై వైఎస్ జగన్ దిగ్భ్రాంతి

పాతబస్తీ అగ్నిప్రమాదంపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఇలాంటి దుర్ఘటన అత్యంత బాధాకారం. ప్రమాదంలో గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని, మృతుల కుటుంబాలను ఆదుకోవాలని వైఎస్ జగన్ తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. చార్మినార్ గుల్జార్‌హౌస్‌లో ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. ఆదివారం ఉదయం 6.15గంటలకు షార్ట్ సర్క్యూట్ జరిగింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఎనిమిది మంది చిన్నారులతో సహా మొత్తం 17 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో పలువురు వేసవి సెలవుల కోసం ఇక్కడికి వచ్చినట్లు సమాచారం మరోవైపు, ప్రమాదంపై అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి మీడియాతో మాట్లాడారు. ప్రమాదానికి గల కారణాల్ని వివరించారు. ప్రమాదం జరిగిన బిల్డింగ్ ఎంట్రన్స్‌లో షార్ట్ సర్క్యూట్ ఏర్పడింది. ఇటీవల ఇంటిని చెక్క ప్యానెళ్లను ఏర్పాటు చేశారు. షార్ట్‌సర్క్యూట్ వల్ల చెలరేగిన మంటలకు చెక్క మొత్తం కాలి మంటలు వ్యాపించాయి. భారీ ఎత్తున ప్రాణ నష్టం జరిగిందని నాగిరెడ్డి తెలిపారు.

### భారత సైన్యానికి కీలక అధికారాలు
## అప్పగించిన కేంద్ర ప్రభుత్వం

మొదటి పేజి తరువాయి



కొద్ది రోజుల క్రితమే ఆమోదముద్ర వేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ తాజా నిర్ణయం (ఈపీ-6) ద్వారా ఆర్మీ, వైమానిక దళం (ఐఏఎఫ్), నౌకాదళం తమ ఆయుధ నిల్వలను మరింత బలోపేతం చేసుకోవడంతో పాటు, ఖాళీ అయిన వాటిని తిరిగి భర్తీ చేసుకోనున్నాయి. గతంలో తూర్పు లఢఖ్‌లో చైనాతో సైనిక ఘర్షణల సమయంలో తొలి నాలుగు దఫాలుగా, ఉగ్రవాద నిరోధక కార్యకలాపాల కోసం ఐదో దఫా అత్యవసర కొనుగోలు అధికారాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ ఆరో విడత అధికారాల కింద, సాయుధ దళాలు సాధారణంగా అనుసరించే సుదీర్ఘమైన సేకరణ ప్రక్రియలకు బదులుగా, వేగవంతమైన పద్ధతిలో ఒక్కొక్కటి రూ.300 కోట్ల విలువైన బహుళ ఒప్పందాలను ఖరారు చేసుకోవచ్చు. ఈ కొనుగోళ్లను మూలధన, రెవెన్యూ పద్దుల కింద చేపట్టే వెసులుబాటు కల్పించారు. “ఒప్పందాలను 40 రోజుల్లోగా ఖరారు చేయాల్సి ఉంటుంది, ఏడాదిలోగా ఆయుధాల డెలివరీ పూర్తి కావాలి. ఈ అధికారాలను త్రివిధ దళాల వైస్ చీఫ్‌లు వినియోగిస్తారు” అని ఓ అధికారి తెలిపారు.

ఈ అత్యవసర అధికారాలతో క్షిపణులు, సుదూర లక్ష్యాలను ఛేదించే ఆయుధాలు, నిఘా మరియు కచ్చితత్వంతో దాడులు చేయగల మందుగుండు సామగ్రి, కమికాజే డ్రోన్లు, డ్రోన్ వ్యతిరేక వ్యవస్థలు వంటి అధునాతన ఆయుధాలను, ఇతర మందుగుండు సామాగ్రిని సాయుధ దళాలు వేగంగా సమకూర్చుకోనున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన మొత్తం రక్షణ బడ్జెట్‌లో మూలధన, రెవెన్యూ సేకరణలపై ఒక్కొక్కదానిపై 15% పరిమితి ఉంటుందని తెలుస్తోంది. ఇటీవల పాక్ తో ఘర్షణల సమయంలో భారత వైమానిక దళ విమానాలు కచ్చితమైన దాడుల కోసం రష్యాతో కలిసి భారత్‌లో ఉత్పత్తి చేస్తున్న బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణులు, ఇజ్రాయెల్ తయారీ ఎయిర్-టు-గ్రౌండ్ క్రిస్టల్ మేజ్-2, రాంపేజ్ క్షిపణులు, స్పైస్-2000 ప్రెసిషన్ గైడెడ్ బాంబులు, ఫ్రెంచ్ తయారీ స్కాల్ప్ క్రూయిజ్ క్షిపణులు, హామర్ ఎయిర్-టు-గ్రౌండ్ ప్రెసిషన్ గైడెడ్ మందుగుండు సామగ్రిని ఉపయోగించాయి. అలాగే, ఇజ్రాయెల్ తయారీ హారోప్, హార్పీ కమికాజే డ్రోన్లను కూడా ఐఏఎఫ్ ప్రయోగించింది. ఇదే రీతిలో, ఆర్మీ విభాగాలు స్కైస్ట్రైకర్ వంటి లాంచింగ్ మందుగుండు సామగ్రితో పాటు, ఎక్సాలిబర్ వంటి ‘స్మార్ట్’ ఎక్స్‌టెండెడ్ రేంజ్ ఆర్టిలరీ షెల్స్‌ను నిర్దిష్ట లక్ష్యాలపై ప్రయోగించాయి. బహుళస్థాయి గగనతల రక్షణ వ్యవస్థలో భాగంగా, ఇజ్రాయెల్‌తో కలిసి అభివృద్ధి చేసిన బరాక్-8 మధ్యశ్రేణి ఉపరితలం నుంచి గగనతలానికి ప్రయోగించే క్షిపణులు, స్వదేశీ ఆకాశ్ క్షిపణులతో సహా అనేక రకాల ఆయుధాలను సాయుధ దళాలు వినియోగించాయని సమాచారం.

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ



హైదరాబాద్: హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ నేడు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా, త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న తన ఆత్మకథ తెలుగు అనువాదం ‘ప్రజల కథే నా ఆత్మకథ’ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా దత్తాత్రేయ ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. సీనియర్ రాజకీయ నాయకుడైన బండారు దత్తాత్రేయ తన రాజకీయ, వ్యక్తిగత జీవితంలోని ముఖ్య ఘట్టాలను వివరిస్తూ ఈ ఆత్మకథను రచించారు. ఈ పుస్తకం ఇప్పటికే హిందీలో ‘జనతా కీ కహానీ, మేరీ ఆత్మకథా’ పేరుతో విడుదలైంది. ఇటీవల దేశ రాజధాని ఢిల్లీలో ఈ హిందీ పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఇప్పుడు తెలుగు పాఠకుల కోసం ‘ప్రజల కథే నా ఆత్మకథ’ పేరుతో దీనిని తీసుకువస్తున్నారు. హైదరాబాద్‌లో జరగబోయే ఈ తెలుగు పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని దత్తాత్రేయ స్వయంగా కలిసి ఆహ్వానించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

## మంత్రివర్గ విస్తరణ ముహూర్తం ప్రకటన..!!

మొదటి పేజి తరువాయి



టీపీసీసీ చీఫ్ వెల్లడి

మంత్రివర్గ విస్తరణపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ నెలాఖరులో లేదా జూన్ మొదటి వారంలో మంత్రివర్గ విస్తరణ ఉండే అవకాశం ఉందని అన్నారు. వివిధ సమీకరణాల వల్లే మంత్రివర్గ విస్తరణలో కొంతమేర జాప్యం జరుగుతోందని చెప్పారు. తమ ప్రభుత్వంలో మంత్రులు అందరూ కలిసే ఉన్నారని కావాలనే కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు ఉన్న అవసరాలు తీర్చడమే తమ ప్రభుత్వం ముందున్న లక్ష్యమని స్పష్టం చేసారు. మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను కావాలనే వక్రీకరించారని ఆగ్రహం వ్యక్తం చేసారు.

టీపీసీసీ కొత్త కార్యవర్గం

సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన వారిపై సైబర్ క్రైమ్‌లో కేసు పెడతామని హెచ్చరిం చారు. ఈనెల 26, 27 తేదీల్లో టీపీసీసీ కార్యవర్గం ఖరారయ్యే అవకాశం ఉందని అన్నారు. తెలంగాణలో సీఎం మార్పు ప్రతిపక్షాల తప్పుడు ప్రచారమేనని విమర్శించారు. బీఆర్ఎస్‌లో మూడు ముక్కలాట నడుస్తోందని ఆరోపించారు. మహిళా కాంగ్రెస్ ఆందోళన సర్వ సాధారణం, మహిళలకు కాంగ్రెస్‌లో ఉన్న ప్రాధాన్యం మరే పార్టీలో లేదని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఇక, మంత్రివర్గ విస్తరణ పైన హైకమాండ్ వద్ద ఇప్పటికే చర్చలు జరిగాయి. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేరు పైన రాహుల్ గాంధీ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. కాగా, రాజగోపాల్ తో పాటుగా వివేక్ కు పార్టీలో చేరే సమయంలోనే హామీ ఇచ్చిన విషయాన్నినేతలు గుర్తు చేసారు.

వారికి చాన్స్

నిజామాబాద్ నుంచి సుదర్శన్ రెడ్డి పేరు ఖాయంగా కనిపిస్తోంది.అదిలాబాద్ నుంచి గడ్డం వినోద్ కు మంత్రి పదవి ఇస్తారనే ప్రచారం సాగుతోంది. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు సైతం మంత్రి పదవి పైన ఆశలు పెట్టుకున్నారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంత్రిగా ఉండటంతో.. రాజ గోపాల్ కు ఇప్పడే ఛాన్స్ ఇస్తారా లేదా అనేది చూడాలి. రంగారెడ్డి నుంచి మల్ రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్ రెడ్డిలో ఒకరికి మంత్రి పదవి ఖాయమని చెబుతున్నారు. ముదిరాజ్ వర్గానికి మంత్ రివర్గంలో అవకాశం ఇస్తే మహబూబ్ నగర్ కు చెందిన శ్రీహరి పేరు రేసులో ఉంది. ఇక..సీఎం వద్ద పలు కీలక శాఖలు ఉన్నాయి. విద్య, హోం, గనులు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వంటి కీలక శాఖలు ఉన్నాయి. దీంతో..కొత్తగా వచ్చే వారికి ఈ శాఖలు కేటాయిస్తారనే అంచనాలు ఉన్నా...ప్రస్తుతం ఉన్న మంత్రుల్లో కొందరి శాఖల సర్దుబాటు ఉంటుందనే వాదన కాంగ్రెస్ నేతల్లో వినిపిస్తోంది.

### దేశానికి ప్రాతినిధ్యం వహించే
## అరుదైన అవకాశం దక్కింది

దేశానికి ప్రాతినిధ్యం వహించడానికి వచ్చిన అరుదైన అవకాశంగా, గౌరవంగా భావిస్తున్నా

రాజమహేంద్రవరం: ఉగ్రవాదులకు అండగా నిలబడుతూ భారత్‌పై విషం చిమ్ముతున్న పాకిస్థాన్ కుతంత్రాలను అంతర్జాతీయ వేదికపై ఎండగట్టేందుకు కేంద్రం ఏర్పాటు చేసిన బృందాల్లో ఏపీ భాజపా అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరికి చోటు కల్పించారు. పహల్గామ్ ఘటన నేపథ్యంలో భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ గురించి ప్రపంచదేశాలకు వివరించడానికి భారత్ దౌత్య యుద్ధం ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా 33 దేశాల రాజధానులకు వెళ్లేందుకు వివిధ పార్టీలకు చెందిన మొత్తం 59 మందితో ఏడు అఖిలపక్ష బృందాలను కేంద్రం ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా యుకే, ఫ్రాన్స్, జర్మనీ, ఈయూ, ఇటలీ, డెన్మార్క్ దేశాల్లో పర్యటించే ఎనిమిది మంది సభ్యుల బృందంలో ఎంపీ పురందేశ్వరి ఉన్నారు. ఈ బృందానికి భాజపా సీనియర్ నేత, ఎంపీ రవిశంకర్ ప్రసాద్ నాయకత్వం వహిస్తారు. పహల్గామ్ ఉగ్రదాడిలో 26 మంది సామాన్యులు ప్రాణాలు కోల్పోవడం, అందుకు ప్రతిగా భారత్ చేపట్టిన ‘ఆపరేషన్ సిందూర్’, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉగ్రవాదం గురించి వారు వివరిస్తారు. అనేక సంవత్సరాలుగా భారతదేశాన్ని దెబ్బతీసేందుకు ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోన్న పాకిస్థాన్ బుద్ధిని ప్రపంచం ముందు బయటపెట్టడానికి, మనదేశంపై పాకిస్థాన్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎండగట్టడానికి ఏర్పాటుచేసిన అఖిలపక్ష బృందంలో తనకు చోటు దక్కడం ఆనందంగా ఉందని ఎంపీ పురందేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఉగ్రవాదులను ఎదుర్కొని ప్రాణాలు కోల్పోయిన వీర జవాన్లకు, పౌరులకు నివాళులు అర్పించడానికి ఇదొక చిన్న మార్గమని ఆమె పేర్కొన్నారు. దేశానికి ప్రాతినిధ్యం వహించడానికి వచ్చిన అరుదైన అవకాశంగా, గౌరవంగా భావిస్తున్నానని ఆమె చెప్పారు.

## వైయస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన వారాహిమాత ఉత్సవములు




ప్రొద్దుటూరు ( జనం రిపోర్టర్ ): వైయస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులో ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో శ్రీ శక్తి పీఠం పీఠాధిస్వరి, మంత్ర మహేశ్వరి పూజ మాతృశ్రీ శ్రీ రమ్యానంద భారతి స్వామిని ఆధ్వర్యంలో వారాహి మాత హెూమములు మే 18 ఆదివారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అత్యంత వైభవముగా నిర్వహించారు, 102 హెూమగుండములు ఏర్పాటు చేసి 102 మంది సుహాసినిలచే హెూమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షులు బుశెట్టి రామ్మోహన్ రావు, ఉపాధ్యక్షులు జొన్నలగడ్డ రవి, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి మురికి సుబ్రమణ్యం, కోశాధికారి మిట్టా శంకర్, ఆర్యవైశ్య పఠణాలయ కార్యదర్శి మేడా మధుసూదన్ మరియు ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## నిరుపేదల హృదయాల్లో పుట్టినరోజు షేక్ కొత్తపాలెం అబ్బాస్ అలీ బాబు



పొదిలి ( జనం రిపోర్టర్ ) : ఈ రోజు పుట్టినరోజు వేడుకలను సందడిగా కాక, సేవామార్గంలో జరుపుకుంటూ ఓ అపూర్వ ఉదాహరణగా నిలిచిన వ్యక్తి షేక్ కొత్తపాలెం అబ్బాస్ అలీ బాబు. ఈ పుణ్యదినాన్ని నిరుపేదల మధ్య జరుపుకోవాలని సంకల్పించిన బాబుకు, కుటుంబ సభ్యుల ఆశీస్సులు అద్భుతంగా తోడయ్యాయి.

### కుటుంబ సభ్యుల భాగస్వామ్యం:

నానమ్మ : కరిమూన్ తాతయ్య : ఖాదర్ మస్తాన్ అత్తయ్య : గౌసియ నాన్న : మహబూబ్ జానీ అమ్మ : సమ్రీన్ అన్నయ్యలు : అబ్దుల్ ఖలీద్, అజ్మల్ కరిమ్ లాలాఈ పవిత్ర కార్యక్రమంలో దివ్యాంగ్ రక్షక్ ఫౌండేషన్ సాయంతో భోజనాలను పంపిణీ చేశారు. ఈ భోజనాలు పొదిలి పరిసర ప్రాంతాల్లో తిరుగుతున్న నిరుపేదలకు, యాచకులకు, నవ్యాంధ్ర దివ్యాంగుల సేవాసమితి వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు, అలాగే మల్లవరం గ్రామంలో నివసిస్తున్న పేద కుటుంబాలకు అందించడం జరిగింది. ఈ సేవా కార్యక్రమం మానవత్వాన్ని ప్రతిబింబిస్తూ, పుట్టినరోజు వేడుకలు ఎలా ఆదర్శంగా జరుపుకోవాలో తెలియజేస్తోంది. మానవతా విలువలను ముందుంచే ఈ కుటుంబానికి హృదయపూర్వక అభినందనలు. అబ్బాస్ అలీ బాబుకు జన్మదిన శుభాకాంక్షలు. ఆయన ఆయురారోగ్యాలతో, ప్రేమతో, ధైర్యంతో, ఇంకా ఎన్నో మంచి కార్యాలతో ప్రజలకు స్ఫూర్తిగా నిలవాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నాం."మీ సంతోషం అనేక మంది ముఖాల్లో చిరునవ్వులు తెప్పించింది ఇది నిజంగా దేవుని ఆశీస్సుల ఫలితం!"

## భారత సైనికులకు మద్దతుగా తిరంగా ర్యాలీ




శింగనమల ( జనం రిపోర్టర్ ) : ఆపరేషన్ సింధూర్ తో భారతదేశం యొక్క త్రివిధ దళాల శక్తిని, యుద్ధనీతిని మన సర్వమత ధర్మాన్ని ప్రపంచ దేశాలకు పరిచయం చేసిన శ్రీ నరేంద్ర మోదీ కి త్రివిధ దళాల సైనికులకు ధన్యవాదాలు తెలుపుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో శింగనమల మండల కేంద్రంలో ఆదివారం పార్టీలకతీతంగా తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని మండల రామాలయం నుండి ఆర్టీసీ బస్టాండ్ వరకు నిర్వహించగా, ర్యాలీలో ఆద్యంతం అమరవీరులకు జోహార్లు, భారత్ మాతాకీ జై, వందేమాతరం అను నినాదాలతో ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు ఓబిరెడ్డి, జనసేన పార్టీ మండల అధ్యక్షులు తోట ఓబులేసు, టిడిపి నాయకులు ఆదినారాయణ, అంజన్ రెడ్డి, ఆర్ఎస్ఎస్ నాయకులు శంకర్ రెడ్డి, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చైతన్య కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం.



ఎన్టీఆర్ జిల్లా,నందిగామ, మే 18 : ( జనం రిపోర్టర్ ) : నందిగామ, రైతుపేట లో గల చైతన్య కళాశాల లో ఆదివారం 1997 – 1999 బ్యాచ్ చైతన్య కళాశాల ఇంటర్మీడియట్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చైతన్య కళాశాల చైర్మన్ దంపతులు అమరనేని రమేష్, జ్యోతి వారిని పూర్వ విద్యార్థులు అందరూ కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులందరు తమ కాలేజీ రోజుల లో జరిగిన మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకొని సందడి చేశారు. పూర్వ విద్యార్థులు తాము ఏ ప్రాంతాలలో నివసిస్తున్నారు, ఏ ఉద్యోగం చేస్తున్నారు, ఎలా ఉంటున్నారు, వారి కుటుంబం లో పిల్లలు ఏ క్లాస్ చదువుతున్నారు తదితర విషయాల గురించి ఒకరినొకరు తమ అనుభవాలను తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమం లో లెక్చరర్ తాటి రామకృష్ణ , క్లర్క్ రామకృష్ణ , పూర్వ విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం....



రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 18. విశ్వకళ హై స్కూల్ లో విద్యనభ్యాసించిన 2001-2002 10వ. తరగతి బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం... గోదావరిఖని పట్టణంలోని ఒక ఫంక్షన్ హాల్ లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా హాజరైన విద్యార్థినీ, విద్యార్థులు నాటి స్మృతులను నెమరు వేసుకొని ఒకరికొకరు అభినందనలు తెలియజేసుకున్నారు.



ఈ సందర్భంగా విద్యార్థులు ప్రసంగిస్తూ విశ్వకళ హై స్కూల్ లోని నాటి అధ్యాపకులు తమకు బోధించిన విద్య విలువలతో కూడుకున్నదని, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు తమకు నేర్పిన క్రమశిక్షణ, సూచనలు, సలహాలతో నేడు మా భవిష్యత్తును తీర్చిదిద్దుకున్నామన్నారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. అధ్యాపకుల మార్గదర్శకాలను పాటించిన విద్యార్థులు ఎల్లప్పుడు తమకు తాము తీర్చిదిద్దుకోగలిగి, ఇతరులకు ఆదర్శంగా నిలుస్తారు అన్నారు. ఈ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా హాజరైన విశ్వకళ హైస్కూల్ కరస్పాండెంట్ పిల్లి రాజమౌళి తో పాటు పలువురు ఉపాధ్యాయులు మోహన్, నర్సింగరావు, శ్రీనివాస్, వెంకట్, శ్రీధర్, రహీం లను విద్యార్థులు శాలువాలు, జ్ఞాపకాలతో ఘనంగా సన్మానించారు.

# రాష్ట్ర గవర్నర్ కి ఎమ్మార్పీఎస్ లీగల్ కన్వీనర్ బహిరంగ లేఖ



పెదకాకాని దుగ్గిరాల ( జనం రిపోర్టర్ ) : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రాంజాంగాధిపతి ( గవర్నర్ )కిఎమ్మార్పీఎస్ ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ న్యాయవాది చిలువూరు నాగరాజు మాదిగ బహిరంగ లేఖ రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై జరుగుతున్న సాంస్కృతిక/ సామాజిక/ లైంగిక దాడులను అరికట్టండి నిందితులను కఠినంగా శిక్షించండి అంబేద్కర్ రాజ్యాంగం దళితులకు కల్పించిన జీవించే ( మనుగడ) హక్కులను కాపాడండి సామాజిక భద్రతను కల్పించండి సాక్షాత్తూ డిప్యూటీ సిఎం ఇలాకా(నియోజకవర్గం)లో దళితులపై సామాజిక బహిష్కరణ !కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై పెరుగుతున్న టీడీపీ / జనసేన దాష్టీకం ! ఓట్లేసి గెలిపించిన దళితులకు అంబేద్కర్ రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కులను కాలరాస్తున్న టీడీపీ/ జనసేన ఆధునిక అగ్రవర్ణ మనువాదులు. ఇప్పటికీ స్పందించని / ఖండించని సిఎం %uc% డెప్యూటీ సిఎం!ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములో కూటమి ప్రభుత్వం



గద్దెనెక్కాక రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై హింస / దాడులు/ సాంఘిక బహిష్కరణలు జరుగుతున్నాయని తెలియజేయుటకు బహుగా చింతిస్తున్నాము గర్హిస్తున్నాము. దళితుల ఓట్లతో గద్దెనెక్కాక టీడీపీ జనసేనా స్థానిక నాయకులు దళితులపై పదే పదే సాంస్కృతిక దాడులు కొనసాగిస్తూ సమాజంలో వారిని తీవ్రమైన భయాందోళనలకు గురిచేయడమే కాకుండా అభద్రతా భావంలోకి నెట్టివేయడం దారుణం. తద్వారా భారత దేశ మూలవాసులైన దళితులకు అంబేద్కర్ రాజ్యాంగం కల్పించిన జీవించే ( మనుగడ) హక్కులకు భంగం కలిగిస్తూ అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కల్గిస్తున్నారు.ఏప్రిల్ 20, 2025 సాక్షాత్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గం (కాకినాడ జిల్లా) , పిఠాపురం మండలం మల్లాం గ్రామంలో జనసేన పార్టీకి చెందిన శెట్టి బలిజ పెత్తందార్లు దళితులను సాంఘిక బహిష్కరణ చేసారు. దళితులను పనులకు పిలవొద్దని హెూటళ్లలో టీ, టిఫిన్ %uc% పాలకేంద్రాలలో పాలు కిరాణా దుకాణాల్లో సరుకులు విక్రయించొద్దని సదరు పెత్తందార్లు నిర్ణయించారు. ఇటీవల శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా , కందుకూరు నియోజకవర్గం , గుడ్లూరు మండలం దప్పలంపాడు గ్రామంలో దళితులపై అధికార టీడీపీ పెత్తందార్లు విచక్షణారహితంగా దాడి చేయడమే కాకుండా దళితులు గ్రామంలోకి రాకుండా తాగునీరు , వ్యవసాయం , ఉపాధి పనులు లేకుండా చివరికి పాలకేంద్రాల్లో పాలు పోయనీయకుండా సాంఘిక బహిష్కరణ చేసారు. ఈ మేరకు గ్రామంలో మైకులో బహిరంగంగా ప్రకటన చేసారు. గ్రామంలో కొన్ని రోజులుగా దళితులు అల్లాడిపోతున్నారు. అంతేకాకుండా దళితులను చంపేస్తామని పెత్తందార్లు బెదిరిస్తున్నారు. చిత్తూరు జిల్లా. నగరి మండలం, తడుకుపేట గ్రామంలో జనవరి 2 వ తేదీ రాత్రి చోటు చేసుకున్న ఘటనలో ...దళితులు వీధుల్లో తిరగరాదని ..వారి ముందు చెప్పులు వేసుకుని నడవ అసలు దళితులు ఊర్లోనే ఉండరాదని ఖాళీ చేసి వెళ్లిపోవాలని అధికార టీడీపీ నేతలు దళితులపై విరుచుకు పడ్డారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణం దళిత సామాజిక వర్గానికి చెందిన అంగన్వాడీ కార్యకర్తపై స్థానిక అధికార టీడీపీ నాయకులు లైంగిక సాంస్కృతిక దాడి చేసారు. "మేము కమ్మోళ్ళం నువ్వు మాలదానివి" ప్రభుత్వం మాది మమ్మల్ని ఏమీ చేయలేవు. తన కోరిక తీర్చమని లేకపోతే ఇటీవల కొన్ని నెలల క్రితం ఒంగోలు జిల్లా , పుల్లలచెరువు మండలం మానేపల్లె గ్రామంలో అగ్రవర్ణ రెడ్డి సామాజిక వర్గానికి చెందిన గ్యాంగ్ దళిత యువకుడిపై మూకుమ్మడి దాడి చేసి తీవ్రంగా గాయపర్చడం జరిగింది. కావున రాశ్ర వ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులపై సమగ్రమైన విచారణ చేసి , నిందితులను కఠినంగా శిక్షించడంతో పాటు బాధితులకు సామాజిక రక్షణ కల్పించవలసినదిగా తమ ఘనమునే మిక్కిలి శ్లాఘించుచున్నాము. దివ్య చిత్తమునకు తేవలయిను చిలువూరు నాగ రాజు మాదిగఈ కార్యక్రమంలో ఎమ్మార్పీయస్ జిల్లా అధ్యక్షుడు కిన్నెర నాగ రాజు మాదిగ, ఎస్టీ నాయకుడు కట్టా అశోక్, రావూరి కృష్ణ, కారుమూరి సురేష్, దూరు మదన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఏరియాలో ఘనంగా "మెగా జాబ్ మేళా.....

## అధిక సంఖ్యలో పాల్గొన్న నిరుద్యోగ యువతకు చక్కటి ఉద్యోగ అవకాశాలు...





రామగుండం: ( జనం రిపోర్టర్ ): రామగుండం:మే 18. గోదావరిఖని, పరిసర ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశములు కల్పించుటకు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో "మెగా జాబ్ మేళా" కార్యక్రమం జవహర్ లాల్ నెహ్రు స్టేడియం నందు భారి ఎత్తున నిర్వహించటం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రామగుండం శాసనసభలు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, హర్కర వేణుగోపాల్ రావు ప్రభుత్వ సలహా దారు, సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరాం ఐఆర్ఎస్, డి.సత్యనారాయణ రావు డైరెక్టర్ (ఇ.అండ్.యం), డైరెక్టర్ (ప్లానింగ్, ప్రాజెక్ట్), (పా) కె.వెంకటేశ్వర్లు, కే.రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి, ఐయన్టియుసి, ఆర్జీ.1 ఏరియా ఉపాధ్యక్షులు సదానందం, పెద్ది నర్సింహులు సియంఓఏఐ జనరల్ సెక్రటరి, రఘుపతి జియం హెచ్.ఆర్.డి, ఆర్జీ.1,2,3 జియంలు డి.లలిత్ కుమార్, సుధాకర్ రావు, బండి వెంకటయ్య హాజరై జ్యోతిప్రజ్వలన చేసి మెగా జాబ్ మేళాను ప్రారంభించటం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి రామగుండం శాసనసభలు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ... నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనలో భాగంగా తెలంగాణా రాష్ట్ర డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశానుసారం సింగరేణి సంస్థ సి%uc%ఎం.డి ఎన్.బలరాం ఐఆర్ఎస్ సూచనల మేరకు రామగుండం ఏరియా 1,2,3 ఆధ్వర్యంలో "మెగా జాబ్ మేళా" కార్యక్రమాన్ని ఈ రోజు ఎంతో ఘనంగా నిర్వహించటం జరిగిందని తెలిపారు. హైదరాబాదుకు చెందిన సుమారు 100 ప్రైవేటు కంపెనీలు పాల్గొనగా సుమారు 8000 వేల పై చిలుకు నిరుద్యోగులు పాల్గొనగా ఇందులో 3000 మందిని ఎంపిక చేసి ఉద్యోగ ఉత్తర్వులను అందజేయడం జరిగిందని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఇదోక చక్కటి అవకాశం అని దూర ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగాల కోసం తిరిగే అవసరం లేకుండా ఉన్న ఊరిలో చదువుకు తగిన అవకాశాలు దొరకటం ఒక అదృష్టం అని తెలిపారు. ఈ జాబ్ మేళాకు యువత ఎంతో ఉత్సాహంగా ఉదయం 6 గంటల నుండే ఇంటర్వ్యులకు హాజరైనారు అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా కూలర్లు, మాజ్జిగా, చల్లటి నీరు, స్నాక్స్, టి తోపాటు మధ్యాహ్న భోజనం ఏర్పాట్లు చేసినందుకు సింగరేణి యాజామన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు. తదనతరం ఇంటర్వ్యు ఆధారంగా సెలక్ట్ అయిన వారికి ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఉద్యోగ ఉత్తర్వులను అందజేయడం జరిగింది. ఉద్యోగ ఉత్తర్వులను అందుకున్న వారి కుటుంబాలు కుడా ఎంతో సంతోశానికి గురయ్యారు, ఈ అవకాశం కల్పించిన సింగరేణి సంస్థకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరాం ఐఆర్ఎస్ మాట్లాడుతూ... సింగరేణి సంస్థ ద్వారా మొదటిసారిగా నిరుద్యోగులకు ఉపాది కల్పన కోసం తిలక్ నగర్ నందు స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ ద్వారా వివిధ కోర్సులను నిర్వహించి, 100 మందికి పైగా ఉద్యోగ ఉపాది అవకాశాలు కుడా ఇదివరకే కల్పించటం జరిగిందని తేలిపారు. ఆలాగే వోల్వో ఆపరేటర్ శిక్షణ ఇచ్చి మరో 150 మంది అభ్యర్థులకు ఉపాది కల్పించడం జరిగినది, దీనివలన సంస్థలో పని చేసే ఉద్యోగులకే కాక పరిసర ప్రాంత, ప్రాభావిత గ్రామాల నిరుద్యోగులకు ఇది వారికి జీవోనోపాది అవుతుందని, ఉద్యోగాలు చేస్తున్న అభ్యర్థులను అభినందిచారు. ఈ కార్యక్రమంలో యస్.ఓ.టు జిఎం గోపాల్ సింగ్, డిజియం పర్సనల్ కిరణ్ బాబు, నోబెల్ ఎడ్యుకేషన్ ఎంపవర్మెంట్ సురేష్, ఏఐటియుసి బ్రాంచి సెక్రటరీ అరెల్లి పోశం, ఇతర అధికారులు, నాయకులు, వివిధ యూనియన్ ప్రతినిధులు, భారి ఎత్తున అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## గిరిజన ప్రాంత టీచర్ పోస్టులు ఆదివాసీలతోనే భర్తీ చేయాలి

**20 న జరిగే క్యాబినెట్ సమావేశంలో మెగా ఏజెన్సీ డీఎస్సీ నుండి ఏజెన్సీ ప్రాంత టీచర్స్ పోస్టులు మినహించాలి.ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ సమావేశంలో రాష్ట్ర సలహా దారులు పి. అప్పల నర్స డిమాండ్.ఉద్యమం ఉధృతం కోసం నూతన కమిటీ ఎన్నిక.**



రాజవొమ్మంగి,మే 18 జనం రిపోర్టర్ ఏజన్సీ మెగా డీఎస్సీ లో ఏజెన్సీ ప్రాంత టీచర్స్ పోస్ట్ ల్లో స్థానిక ఆదివాసీ లతోనే భర్తీ చేయాలని, 20 న జరిగే క్యాబినెట్ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం చేయాలని ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ ఆదివారం ప్రభుత్వానికి డిమాండ్ చేసింది. స్థానిక ఆర్అండ్ బి అతిథి గృహం వద్ద ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ సంఘాల సమావేశం ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామా రావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స మాట్లాడుతూ.ఏజెన్సీ ప్రాంతాల్లో ఉద్యోగాలు స్థానిక ఆదివాసీలతోనే భర్తీ చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ ఉద్యమం ద్వారా సాధ్యమైందని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంత టీచర్ పోస్టులు అన్నిటిలోనూ స్థానిక ఆదివాసులతోనే భర్తీ చేసే విధంగా మే 20 నిర్వహించే క్యాబినెట్ సమావేశంలో ఆదివాసులకు అనుకూలంగా నిర్ణయం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ విజ్ఞప్తి చేస్తుందన్నారు. అడ్వకేట్ జనరల్ ఫైనల్ లీగల్ ఒపినీయన్ ఇచ్చినప్పటికీ నూరు శాతం టీచర్స్ పోస్టుల్లో ఎస్టీ లకు రిజర్వేషన్ పై ఉత్తర్వులు జారీ చేయకుండా జాప్యం చేయడం సరికాదన్నారు. 2025 మెగా డిఎస్సీలో ఏజెన్సీ ఆదివాసీలకు నూరుశాతం టీచర్ పోస్టులు కేటాయిస్తూ ఉత్తర్వులు మే 15 నాటికి జారీచేయాలాని కోరిన రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం అన్యాయమన్నారు. మెగా డిఎస్సీ నుండి ఏజెన్సీ ప్రాంత టీచర్ పోస్టులు మినహాయింపు ఇచ్చి స్పెషల్ డిఎస్సీ నిర్వహిండానికి ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం చేయాలని కోరారు. ఇన్ సర్వీస్ వున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రమోషన్స్ రాక తీవ్రమైన మనోవేధనకు గురయ్యారని తెలిపారు. ఆదివాసీ చైతన్య జిల్లా వెదుల్లా లచ్చిరెడ్డి, మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వ వైఖరి వల్ల మెగా డీఎస్సీ లో అదివాసీలకు తీవ్రమైన అన్యాయం జరిగేలా వుందన్నారు. నోటిఫికేషన్ ప్రకారం రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం 6 శాతం అమలైతే కేవలం 980 టీచర్ పోస్టులు రాష్ట్రవ్యాప్తంగా వున్న ఎస్టీలు పొందుతారని ఇందులో 5వ షెడ్యూల్డ్ ఏరియాలో ఏజెన్సీ ఎస్టీలకు కేటాయించవలసిన 3 వేల టీచర్స్ పోస్టులు స్థానిక నిరుద్యోగులు,ఉద్యోగాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు,వంతు బాలకృష్ణ,కొండ్ల సూరిబాబు,గంపా నాగరాజు,ఎంపీపీ గోము వెంకటలక్ష్మి,వజ్రపు అప్పారావు,తాము సూరిబాబు,వెంకటరమణ,సింగిరెడ్డి అచ్చరావు, కానెం శ్రీను,ఎల్లెం లక్ష్మణ్ రెడ్డి,ఈక శ్రీను,కంచెం శ్యామల్ సర్పంచ్ లు దాసరి నాగేశ్వరరావు, ఎస్ చంద్రుడు,భూసరి సత్తిబాబు,కుంజం జగన్నాథం,బీర బోయిన రామకృష్ణ, పెద్ద సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

## కీ:శే:రామిల్ల రవీంద్ర కుమార్ నాలుగవ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబసభ్యులు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం...



రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 18. కీ:శే:రామిల్ల రవీంద్ర కుమార్ నాలుగవ వర్ధంతిని పురస్కరించుకొని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ గోదావరిఖని అమ్మ పరివార్ ఆశ్రమంలో వారి కుటుంబ సభ్యులు అందరూ కలిసి అన్నదాన సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమాన్ని రామిల్ల రవీంద్ర కుమార్ తల్లిదండ్రులు రామిల్ల రాజలింగం %-%మంగళ దంపతులు, వారి సతీమణి శైలజ , వారి కుటుంబ సభ్యులు మహేంద్ర కుమార్-సుప్రియలు , బాబాయ్ గురుపాదం , మామయ్య మల్లేశం, వారి యొక్క కుటుంబ సభ్యులందరూ, అమ్మ పరివార్ ఆశ్రమ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

## రామగుండం, ఎన్టీపీసీ 23వ. డివిజన్ లో ముచ్చకుర్తి రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన మెడికవర్ హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరం....



రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 18.ఆదివారం స్థానిక ఎన్టిపిసి 23వ. డివిజన్లో ముచ్చకుర్తి రమేష్ ఆధ్వర్యంలో మెడికవర్ హాస్పిటల్ నిర్వహణలో ఉచిత వైద్య శిబిరం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సతీమణి మక్కాన్ సింగ్ సేవ సమితి చైర్మన్ మనాలి ఠాకూర్ హాజరై, వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో జన సాధారణానికి వివిధ రకాల వైద్య సేవలు అందించబడ్డాయి. ఆరోగ్యాన్ని ముఖ్యంగా పరిగణనలోకి తీసుకుంటూ, ప్రజల కోసం చేపట్టిన ఈ శిబిరం ఆరోగ్య రంగంలో ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మనాలి ఠాకూర్ మాట్లాడుతూ, సమాజం ఆరోగ్యంగా ఉండాలంటే ఇటువంటి ఆరోగ్య శిబిరాలు అత్యంత అవసరం, ప్రజల శ్రేయస్సు కోసం ఎల్లప్పుడూ మేము అందుబాటులో ఉంటాం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

జనం
రిపోర్టర్ తెలుగు దినపత్రిక



## వేంనరేందర్ రెడ్డిని ఘనంగా సన్మానించిన హసన్ పర్తి కాంగ్రెస్ నాయకులు



హసన్ పర్తి మండలం ( జనం రిపోర్టర్ ): ఈరోజు చింతగట్టు క్యాంపులో కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేంనరేందర్ రెడ్డికీ వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు ఆధ్వర్యంలో 66 డివిజన్ కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ వరంగల్ మార్కెట్ మాజీ డైరెక్టర్ వీసం సురేందర్ రెడ్డి, దేవస్థానం మాజీ చైర్మన్లు జన్ను రవీందర్, బల్సుకురి శ్రీనివాస్, ధర్మకర్తలు కనపర్తి రాజు, కొండమిడి సంతోష్,66వడివిజన్ యూత్ అధ్యక్షులు తాళ్ల మధు, చార్టెడ్ అకౌంటెంట్ తిప్పర్తి రాఘవరెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు పోలేపల్లి బుచ్చిరెడ్డి,జయగిరి గ్రామ అధ్యక్షులు రామంచ ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు వెలిశోజు సురేష్,మట్టెడ భారత్, తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ సింధూర్ తిరంగా ర్యాలీలో భారీ సంఖ్యలో పాల్గొన్న నియోజకవర్గం ప్రజలు



రాజవొమ్మంగి, రంపచోడవరం మే 18 జనం రిపోర్టర్: అల్లూరి జిల్లా రంపచోడవరంలో ఆపరేషన్ సింధూర్ విజయవంతం చేసిన భారత సైనిక దళాలకు సంఘీభావంగా ఎమ్మెల్యే శిరీష దేవి విజయభాస్కర్ లు ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు నిర్వహించిన తిరంగా ర్యాలీలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని అంబేద్కర్ సెంటర్ వద్ద మానవహారం నిర్వహించారు.యుద్ధంలో చనిపోయిన వీర జవాన్లు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సందర్భంగా ఎమ్మెల్యే శిరీష దేవి మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ ను విజయవంతం చేసిన భారత సైనికులు అందరికీ మనమందరం రుణపడి ఉన్నామని అన్నారు. మన రాష్ట్ర జవాన్ మృతి పట్ల వారికి సంఘీభావం తెలుపుతూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కులాలకు,మతాలకు రాజకీయాలకు అతీతంగా పాల్గొన్న ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఆర్మీ జవాన్ గోవిందరావు ని సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు చిన్నం బాబు రమేష్ ,జీసిసి డైరెక్టర్ గొర్లె సునీత,సురేష్ బాబు,అనంత మోహన్,అడబాల బాపిరాజు, నిరంజనీదేవి,రంపచోడవరం ముస్లిం మత పెద్దలు ఎమ్ డి గౌస్ మొహియుద్దీన్,సాయిబాబా గుడి అర్చకులు అద్దంకి వెంకటేశ్వరరావు, సిఎస్ఐ చర్చి పాస్టర్ జ్ఞానానందం, జమాల్ ఖాన్,చోటు,పోలీసు సిబ్బంది ప్రజల,అధికారులు,పలు మండలాల కూటమి పార్టీల శ్రేణులు ర్యాలీలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని, జాతీయ జెండాలతో సైనికులకు సంఘీభావం తెలిపారు.

## బండి ముత్యాలమ్మ కు ప్రత్యేక పూజలు

మొగల్తూరు మే 19 జనం రిపోర్టర్ :ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ ఆలయం కుఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జూన్ 8 తారీఖున అమ్మవారి జాతర పురస్కరించుకుని ఆలయం వద్ద భారీ పందిరలు, విద్యుత్ దీపాలంకరణ పనులు చేస్తుండడంతో భక్తుల మొక్కుబడులైన ధూపహారం, కుంభాహారాలను నివేదించేందుకు అనుమతించడం లేదు. దీంతో అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు. ఆలయం వద్ద భక్తులకు అవసరమైన సదుపాయాలను ఈవో మోకా అరుణ్ కుమార్, ఆలయ చైర్మన్ కదలి మాణిక్యాలరావు, పాలకవర్గ సభ్యులు, ఆలయ సిబ్బంది కల్పించారు.

## అన్నవరంలో జరిగే మినీ మహానాడు ను విజయవంతం చేయండి

### పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చిన ఎమ్మెల్యే సత్యప్రభ రాజా



ఏలేశ్వరం, జనం రిపోర్టర్: కాకినాడ జిల్లా, ప్రతిపాడు నియోజకవర్గ,సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుండి అన్నవరంలో హరిహర రిస్టార్స్ అండ్ కన్వెన్షన్ కళ్యాణ మండపంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే తెలుగుదేశం పార్టీ " మహానాడు "కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జాతీయ కార్యదర్శి నారా లోకేష్ ఆదేశాల మేరకు మహానాడు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ప్రత్తిపాడు పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయికు ఎదిగిన తెలుగుదేశం పార్టీ తెలుగు ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకుందని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.నా భర్త స్వర్గీయ వరుపుల రాజా మహానాడు లాంటి కార్యక్రమాలని నిర్వహించి విజయవంతం చేయడంలో పెట్టింది పేరని,అదే ఒరవడిలో నేను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత జరిగే మొట్ట మొదటి మహానాడుని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు.అలాగే ఈనెల 22న కాకినాడలో జరగబోయే జిల్లా మహానాడుని,స్వర్గీయ ఎన్టీఆర్ జయంతి సందర్భంగా కడప జిల్లాలో ఈనెల 27,28,29 వ తేదీల్లో నిర్వహించబోయే రాష్ట్ర మహానాడుకి నియోజకవర్గం నుండి భారీ సంఖ్యలో తరలి వెళ్దామని పార్టీ శ్రేణులకు సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిఎన్టియుసి ఉపాధ్యక్షులు వెన్నా శివ,సిబిఎన్ ఆర్మీ కో ఆర్డినేటర్ యాళ్ల జగదీష్,మండల పార్టీ అధ్యక్షులు అమరాది వెంకటరావు,మూది నారాయణ స్వామి,సూతి బూరయ్య,బద్ది రామారావు,తమరాల



సత్యనారాయణ,ఎంపీపీలు గొల్లపల్లి బుజ్జి,గంటిమల్ల రాజ్యలక్ష్మి,నాయకులు బొదిరెడ్డి గోపి,జ్యోతుల పెదబాబు,పర్వత సురేష్, పైలా సాంబశివ రావు బస్వా ప్రసాద్,బుద్ధ సూర్యప్రకాష్,బుద్ధ ఈశ్వరరావు, పంచాది వీరబాబు,యిటంశెట్టి సూర్యభాస్కర్, పల్లా గోపి,ముమ్మిడి సత్యనారాయణ,మెరపాల నర్సయ్య,కీర్తి సుభాష్,పలివెల శ్రీనివాస్,జిగాటాపు సూరిబాబు, దాకరపు కృష్ణ,రాజాల చిట్టిబాబు, పలివెల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# విగ్రహ ప్రతిష్టకు ముస్తాబైన శ్రీస్వయంభు పాంబండ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం..

22న హనుమాన్ జయంతిని పురస్కరించుకొని స్వామివారి కళ్యాణం... ఈనెల 23న విగ్రహ ప్రతిష్ట... కోటి 50లక్షల రూపాయలతో అన్ని హంగులతో ఆలయ నిర్మాణం...

మరో కొండగట్టుగా దిన దిన అభివృద్ధి చెందుతున్న శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం... శ్రీగురూజీ ఉమేష్ స్వామీజీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు..






చిగురుమామిడి(జనం రిపోర్టర్ ):కోరిన కోరికలు తీరుస్తూ భక్తుల కొంగుబంగారంగా వెలుగొందుతున్నటువంటి కరీంనగర్ జిల్లా చిగురుమామిడి గ్రామ శివారులోని శ్రీ స్వయంభు పాంబండ పంచముఖ ఆంజనేయ స్వామి వారి దివ్య క్షేత్రం ఆలయ ప్రతిష్టకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు శ్రీ శ్రీ శ్రీ గురుజీ హుమేష్ స్వామీజీ తెలిపారు.ఆదివారం గురూజీ ఉమేష్ స్వామి మాట్లాడుతూ ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా చాలా అరుదైన నాగసర్ప పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఈనెల 23న ప్రతిష్టించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.దాదాపు కోటి 50లక్షల రూపాయలతో రాతి శిలలతో అన్ని హంగులతో భక్తులు మెచ్చే విధంగా అందంగా నిర్మించారు.2015వ సంవత్సరంలో చిగురుమామిడి,సుందరగిరి గ్రామాల శివారు మధ్యలో గల పాంబండపై ఈ పంచముఖ ఆంజనేయస్వామి స్వయంభుగా వెలిసినట్లు చెప్పారు.10సంవత్సరాల కాలంలో లక్షలాది మంది భక్తుల నమ్మకాన్ని నిలబెడుతూ మరో కొండగట్టుల దినదిన అభివృద్ధి చెందుతుందని స్వామీజీ వివరించారు.ఈనెల 20న ఉత్సవమూర్తుల గ్రామ ఊరేగింపు,21న గోపూజ, పుణ్య వాచనము,దీక్ష స్వీకరణ, అగ్ని ప్రతిష్ట, హెూమాలు,సాయంత్రం జలదివాసం,22న గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆలయం వద్ద 11గంటలకు శ్రీ సువర్చల సహిత ఆంజనేయస్వామి కళ్యాణ మహెూత్సవం ఉంటుందని తెలిపారు. ఈనెల 23న శుక్రవారం ఉదయం యాగశాలలో నిత్య ఆరాధనలు మహా పూర్ణహుతి, ఆలయ ప్రతిష్ట లో విగ్రహ ప్రతిష్ట, శ్రీ సీతారామచంద్రస్వామి శాంతి కళ్యాణ మహెూత్సవంను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.ఆలయంలో మరికొన్ని దేవుళ్ళ విగ్రహాలను ప్రతిష్టిచ్చేందుకు ఏర్పాటు చేశామని తెలిపారు.స్వామి వారి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.ప్రతిరోజు అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.ప్రతినెల ఆలయంలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి షష్టిలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారని స్వామి వారు గుర్తు చేశారు.ఆలయ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలనుకునే భక్తులు ధన రూపేనా,వస్తు రూపేనా అందజేసి ఆలయ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు.

## వరుపుల రాజా మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే సత్యప్రభ రాజా



ఏలేశ్వరం, మే 18, ( జనం రిపోర్టర్ )కాకినాడ జిల్లా...ప్రత్తిపాడు నియోజకవర్గం.ఏలేశ్వరం జూనియర్ కళాశాల మైదానంలో దివంగత నేత స్వర్గీయ వరుపుల జోగిరాజు(రాజా) జ్ఞాపకార్థం బొదిరెడ్డి గోపి యువసేన ఆద్వర్యంలో నిర్వహిస్తున్న రాజా మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ రాజా మాట్లాడుతూ దివంగత నేత రాజా పేరు మీద ఈ టోర్నమెంట్ నిర్వహించడం ఆయన జ్ఞాపకాలు గుర్తు చేయడం చాలా ఆనందదాయకంగా ఉందని ఆమె అన్నారు.రాజా క్రీడల్లో ఎక్కువగా పాల్గొనేవారని అందులో క్రికెట్ అంటే ఎక్కువగా మక్కువ చూపించే వారన్నారు.అదేవిధం గా యువకులు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనాలని ఆమె కోరారు. మొదటి బహుమతి రూ 50 వేలు(షీల్డ్),ద్వితీయ బహుమతి రూ 30 వేలు(షీల్డ్), తృతీయ బహుమతి రూ 15 వేలు(షీల్డ్).ప్రకటించిన కమిటీ.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బోదిరెడ్డి గోపి,మూది నారాయణ స్వామీ,ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, మేడిశెట్టి సూర్యకిరణ్,జ్యోతుల పెదబాబు,ఎండగుండి నాగబాబు, అనంతరపు రాజు,వాగు రాజేష్ తదితర పాల్గొన్నారు.

## అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు. ఎస్ఐ ఇ నరసింహ మూర్తి



రాజవొమ్మంగి, మే 18 జనం రిపోర్టర్: అల్లూరి జిల్లా రంపచోడవరం డివిజన్ రాజవొమ్మంగి మండల పరిధిలోని కిమ్మలగెడ్డ రాజవొమ్మంగి గ్రామాల్లో ముందస్తు సమాచారం మేరకు ఆదివారం అక్రమంగా మద్యం బాటిల్స్ విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఇ నరసింహ మూర్తి మీడియాకు వెల్లడించారు వారి వద్ద నుంచి మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు ఈ కార్యక్రమంలో ఆయన వెంట సిబ్బంది ఉన్నారు. చట్టవిరుద్ధంగా మద్యం అమ్మకాలు జరిపితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## నూతన వధూవరును ఆశీర్వదించిన ముఖ్యమంత్రి సలహాదారు, ఎమ్మెల్యే లు



హసన్ పర్తి మండలంజనం రిపోర్టర్: భూపాలపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మార్క విజయ్ కుమార్ కుమార్తె వివాహ వేడుక భీమారం ఎర్రగట్టుగుట్ట సమీపంలోని కేఎల్ఎన్ కన్వెన్షన్ హాల్ లో నూతన వధూవరులను ఆశీర్వదించిన ముఖ్యమంత్రి సలహాదారు వెం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రెడ్డి, వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజుఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ – రాజేశ్వర్ రావు, మరియు ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## చిగురుమామిడిలో ఆకట్టుకున్న చిరుతల రామాయణం... పలు పాత్రలకు జీవంపోసిన కళాకారులు... ప్రాచీన కళలను ప్రోత్సహించాలని పలువురు పిలుపు...



చిగురుమామిడి(జనం రిపోర్టర్ ): కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలోని మాహాత్మ గాంధీ విగ్రహం వద్ద మూడు రోజులపాటు కళాకారులు వేసిన చిరుతల రామాయణం నాటక ప్రదర్శన గ్రామస్తులను ఎంతగానో ఆకట్టుకుని ఆలోచింపజేసింది. చిరుతల రామాయణం నిర్వహణ పర్యవేక్షణ కమిటీ పెనుకుల తిరుపతి,చిరుతల రామాయణం ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చెరుకు సంజీవ్ ల ఆధ్వర్యంలో దాదాపు 15మంది కళాకారులు తమ తమ పాత్రల్లో జీవించారు.చిరుతల రామాయణంలో జనక మహారాజు,రాముడు,లక్ష్మణ,భరత శతృఘ్నుడు,సీత,ఆంజనేయుడు రావణబ్రహ్మ, తదితర పాత్రలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి.కళాకారులను ప్రభుత్వ అన్ని రకాలుగా ఆదుకోవాలని మండలంలోని పలువురు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్ల కొమురవెల్లి,మాజీ జెడ్పిటిసి అందే స్వామి,పడాల శ్రీనివాస్ గౌడ్,సత్యనారాయణ రెడ్డి,మల్లం నరసయ్య,మల్లం బాలయ్య, మల్లము స్వామి,మల్లం శ్రీను, నిలిగొండ కిషన్,నిలిగొండ సదానందం,వద్దూరి నరేష్,చెరుకు మొండయ్య,చెరుకు రాజు, సత్తయ్య,తదితరులు వివిధ రకాల వేషధారణలకు జీవం పోశారు.

## ప్రభుత్వ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు జొన్నల రవీందర్ కు,2025 గోదావరి కళా రత్న పురస్కార్ అవార్డు....



రామగుండం:జనంరిపోర్టర్: రామగుండం: మే 18. అంతర్గాం మండలం గోలీ వాడ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల లో ప్రధాన ఉపాధ్యాయులుగా విధులు, నిర్వహిస్తున్న పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కల్చరల్ అకాడమీ ప్రధాన కార్యదర్శి జొన్నల రవీందర్ ముదిరాజ్ కు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక విభాగం , గోదావరి కళా సంఘాల సమైక్య సంయుక్తంగా నిర్వహించిన కళోత్సవాలలో, 2025వ. సంవత్సరానికి గాను ప్రతిష్టాత్మకమైన, గోదావరి కళా రత్న పురస్కార్ అవార్డును అందజేశారు. గోదావరిఖని పట్టణంలోని ఆర్ సి ఓ ఏ క్లబ్లో గోదావరి కళా సంఘాల సమైక్య ఆధ్వర్యంలో 37వ. వార్షికోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు, ఈ సందర్భంగా సామాజిక కళా రంగాలలో కృషి చేస్తున్న కొంతమంది సామాజిక సేవకులకు రామగుండం శాసనసభ్యులు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, కళా సంస్థ అధ్యక్షులు కనకం రమణయ్య, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, తెలంగాణ రాష్ట్ర అసిస్టెంట్ సెక్రటరీ, ఈర్ల జాన్, సామెల్ తార ఆర్ట్ అకాడమీ, వ్యవస్థాపక అధ్యక్షులు, సంకె రాజేష్,,చేతుల మీదుగా సంస్థ పురస్కారాలు అందజేసింది, ప్రభుత్వ ఉపాధ్యాయునిగా కొనసాగుతూనే స్కౌట్ మాస్టర్ గా 30 సంవత్సరాలుగా అనేక సామాజిక సేవలు కళా రంగంలో సేవలు అందిస్తున్నారు. అంతేకాకుండా, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కల్చరల్,అకాడమీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు, జొన్నల రవీందర్ కు ప్రతిష్టాత్మకంగా గోదావరి కళా రత్న పురస్కార్ అవార్డు అందుకోవడం పట్ల, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కల్చరల్ అకాడమీ జాతీయ గౌరవ అధ్యక్షులు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్, సీనియర్ జర్నలిస్టు జాతీయ అధ్యక్షులు బొంకూరి మధు, ముఖ్య సలహాదారులు సూర్యదేవర వెంకటేశ్వరరావు, సూర్యదేవర జ్యోతి శుభాకాంక్షలు తెలిపారు.




## 10బిఆర్ఎస్ ప్రభుత్వంలో నిరుద్యోగులకు ఒరగబెట్టిందేమీ లేదు.....మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్.

చిగురుమామిడి మే 18,05,2025( జనంరిపోర్టర్ ): గత పది ఏళ్లు అధికారంలో ఉండి బిఆర్ఎస్ పార్టీ నిరుద్యోగులను నిర్వీర్యం చేసిందని, అధికారం కోల్పోయాక బిఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీష్ రావులు నిరుద్యోగుల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని మాజీ జెడ్పి ఫ్లోర్ లీడర్ రవీందర్ ఎద్దేవా చేశారు. చిగురుమామిడి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చిటుమల్ల రవీందర్, జిల్లా అధికార ప్రతినిధి ఐరెడ్డి సత్యనారాయణ రెడ్డిలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవి ఉన్నన్నాళ్ళు ఏనాడు కూడా ఉద్యోగ నోటిఫికేషన్ వేసిన పాపాన పోలేదని రాష్ట్రంలోని నిరుద్యోగ యువకులు, ఉద్యోగస్తులు ఏకమై కేసీఆర్ కుటుంబానికి ఉన్న ఉద్యోగాలను పీకేసారని సంగతిని బిఆర్ఎస్ నాయకులు మరిచిపోరాదన్నారు.పదేళ్ల కాలంలో నిరుద్యోగుల ఆశలపై నీళ్లు జల్లి వారి భవిష్యత్తును నిర్వీర్యం చేసి ఇప్పుడు నిరుద్యోగుల పట్ల కపట ప్రేమ చూపించడం దయ్యాలు వేదాలు వల్లించినట్లేనని వారు అన్నారు. 317 జీవో తీసుకొచ్చి కనీసం స్పవుస్ నియమకాలు కూడా చేపట్టకుండా ఉద్యోగులందరినీ ఆగమాగం చేశారన్నారు. పదేళ్ల కాలంలో ప్రజా వ్యతిరేక ఉద్యమాలపై ఉక్కు పాదం మోపేందుకు ఒక్క పోలీస్ శాఖలో మాత్రమే ఉద్యోగాలు భర్తీ చేశారన్నారు. తెలంగాణ ఏర్పడితే కాంట్రాక్ట్ పద్ధతి, అవుట్సోర్సింగ్ విధానం పూర్తిగా రద్దు చేసి ఉద్యోగస్తులందరినీ పర్మినెంట్ చేస్తామని ఇచ్చిన హామీని తుంగలో తొక్కారన్నారు. ఉద్యోగస్తులకు పిఆర్సి ఇవ్వకుండా ఐదు శాతం ఐ ఆర్ ప్రకటిస్తూ రెండున్నర శాతం డి.ఏ పెండింగ్లో పెట్టి ఉద్యోగస్తులు ఆగ్రహానికి గురైంది విషయం మర్చిపోయారా అన్నారు. ఉద్యోగస్తులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాల్సి వస్తుందని అడగకుండానే 55 సంవత్సరాల వయపరిమితిని 61 సంవత్సరాలకు పెంచినది నిజం కాదా అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం గత ఐదువేల డీఎస్సీ ఉద్యోగాలను రెట్టింపు చేసి 11 వేలకు నోటిఫికేషన్ ఇచ్చి టీచర్ ఉద్యోగాలు భర్తీ చేశారు అన్నారు. ఇప్పటికే 18 నెలల కాలంలో దాదాపుగా 50వేల పైసలు ఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వంది అన్నారు. ఉద్యోగస్తులు కోరిన కోర్కెల్లో 48 అంశాలలో ఆర్థిక పరమైన అంశాలు దఫాల వారీగా, ఆర్తి కేతర అంశాలన్నింటినీ పూర్తిస్థాయిలో పరిష్కారం చేస్తామని దానికి రేవంత్ రెడ్డి కమిటీని కూడా వేశారన్న విషయాన్ని గుర్తు చేశారు. నిరుద్యోగులకు నోటిఫికేషన్ ఇవ్వడంలో గాని ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కారం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో ప్రజా సంక్షేమాలతో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకత తీసుకురావాలన్న టిఆర్ఎస్ నాయకుల దుర్మార్గమైన ఆలోచనను ప్రజలే తిప్పికొడతారన్నారు.ఈ సమావేశములో సుందరగిరి దేవస్థానం డైరెక్టర్ పూల లచ్చిరెడ్డి, దూల్మిట్ట నరసింహ రెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు పొన్నం సంపత్, దొడ్ల రమణ రెడ్డి,బోయిని వంశీకృష్ణ, బెజ్జంకి అంజయ్య, జెల్ల రమేష్, పెసరు శ్రీనివాస్, శివ ఆంజేయులు, పోలు శ్రీనివాస్, కవ్వంపెల్లి సంజీవ్ కుమార్ బోయిని హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## సైనికులకు బాసటగా నిలుద్దాం టిడిపి జిల్లా నాయకులు ఆలం వెంకట నరసానాయుడు



నార్పల:జనంరిపోర్టర్:దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో ప్రాణాలను పణంగా పెట్టిన సైనికులకు అందరం బాసటగా నిలుద్దామని ఆపరేషన్ సిందూర్ విజయోత్సవాలను పురస్కరించుకొని నార్పల మండల కేంద్రంలో ఆదివారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో పోరాడి మురళి నాయక్ ప్రాణాలు పోగొట్టుకున్నాడని, దేశ రక్షణ కోసం చేసినటువంటి త్యాగాలకు మనమంతా బాసటగా నిలవాలని, దేశంలో అందరూ ఒకే తాటిపైకి వచ్చి సైనికులకు అండగా నిలవాలని జిల్లా తెలుగుదేశం నాయకులు ఆల వెంకట నరసనాయుడు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఎర్రి నాగప్ప, తెలుగు యువత చంద్రబాబు, క్లస్టర్ ఇంచార్జ్ పి.ఎల్. లక్ష్మీనారాయణ, నరసాపురం సత్తి, నడిమి దొడ్డి నాగార్జున, నడిమింటి రాము, నల్లపురెడ్డిపల్లి చక్రవర్తి, హరీష్, మహేష్, షామీర్, వడ్డే మహేష్, రంగా నాయుడు, బాబావలి, గూగూడు నాగార్జున ,తలారి మహేష్, వంశీ పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో మరో అగ్నిప్రమాదం.. భవనంలో చిక్కుకున్న 53 మంది!



**హైదరాబాద్, :** హైదరాబాద్‌లోని మైలార్ దేవ్ పల్లెలో మరో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది.. మూడంతస్తుల భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. భవనంలో 53 మంది చిక్కుకున్నారు. భవనం నుంచి బయటికి వెళ్లేందుకు ఉన్న మెట్ల దగ్గరే భారీ అగ్నిప్రమాదం జరిగింది. భవనంలోని వాళ్లంతా.. టెర్రస్ పైకి వెళ్లి ఆహాకారాలు చేశారు. సంఘటన స్థలానికి మూడు ఫైర్ ఇంజన్లు చేరుకున్నాయి. లాడర్స్ ద్వారా టెర్రస్ పైన ఉన్న వాళ్ళని కిందికి దించారు. రెండవ అంతస్తు లో ఉన్న వాళ్ళందరిని మెట్ల ద్వారా కిందికి తీసుకొచ్చారు. ఫైర్ సిబ్బంది మొత్తం 53 మందిని రక్షించారు. అందులో 20 మంది చిన్న పిల్లలు ఉన్నారు. సకాలంలో భవనం వద్ద చేరి మంటలార్పడంతో 53 మంది ప్రాణాలతో బయటపడ్డారు. కాగా.. హైదరాబాద్‌లోని పాతబస్తీ మీర్‌చౌక్‌లో ఈరోజు ఘోర అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో 17 మంది దుర్మరణం చెందారు. గుల్జార్‌హౌస్ సమీపంలోని ఒక భవనంలో ఆదివారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో మొత్తం నాలుగు కుంటుంబాల సభ్యులు మంటల్లో చిక్కుకున్నారు. భవనంలో మొత్తం 30 మంది సభ్యులు ఉండగా.. అందులో రెస్క్యూ సిబ్బంది 10 మందిని కాపాడారు. మంటలు వేగంగా వ్యాప్తి చెందడంతో 10 మంది స్పృహ తప్పి అక్కడే పడిపోయారు.ు

# ఓల్డ్ సిటీలో అగ్ని ప్రమాదం.. బీఆర్ఎస్ నేతలకు కేటీఆర్ కీలక ఆదేశం..



**హైదరాబాద్, :** హైదరాబాద్ అగ్ని ప్రమాదంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఓల్డ్ సిటీలోని గుల్జార్ హౌస్ వద్ద జరిగిన అగ్నిప్రమాద ఘటన వివరాలు తెలిసి అత్యంత షాక్‌కు, బాధకు గురయ్యానన్నారు. ఈ విషాద ఘటన హృదయవిదారకంగా ఉందని.. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు నా హృదయపూర్వక సంతాపం తెలియజేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసిన ఆయన.. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరారు. ఈ అగ్నిప్రమాదం త్వరగా అదుపులోకి రావాలని ఆశిస్తూ, ప్రార్థిస్తున్నానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత తీసుకొని క్షతగాత్రులకు మెరుగైన ఉచిత చికిత్స అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ అగ్నిప్రమాదం నేపథ్యంలో బీఆర్ఎస్ నేతలకు కేటీఆర్ కీలక ఆదేశాలిచ్చారు. పార్టీ శ్రేణులు ఈ సంక్షోభ సమయంలో అవసరమైన ఏ సహాయానికైనా అందుబాటులో ఉంటారన్నారు.. ఈ ఘటనలో బాధితులకు తక్షణ సహాయం అందించేందుకు బీఆర్ఎస్ పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు అధికారులతో కలిసి పనిచేస్తారని చెప్పారు. స్థానిక బీఆర్ఎస్ నేతలకు ప్రమాద స్థలం వద్ద సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. ప్రభుత్వం ఈ అగ్నిప్రమాదానికి కారణాలను లోతుగా విచారించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబాలకు తగిన నష్టపరిహారం ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఓల్డ్ సిటీతో పాటు హైదరాబాద్ నగరంలో అగ్ని భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని, అగ్నిమాపక శాఖ సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. ఈ విషాద సమయంలో హైదరాబాద్ ప్రజలందరూ ఐక్యంగా నిలిచి, బాధితులకు అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

# పవన్ రిక్వెస్ట్ కు సై- ఆ బెడదకు చెక్



**అమరావతి,:** ఏపీకి కర్ణాటక ప్రభుత్వం ఆరు కుంకీ ఏనుగులను బహూకరించనుంది. ఈ నెల 21వ తేదీన బెంగళూరులోని వాటిని ఏపీకి అప్పగించనుంది కర్ణాటక. దీనికోసం బెంగళూరులోని విధానసౌధ వద్ద ఓ భారీ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. దీనికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే హాజరుకానున్నారు. ఏపీ తరపున అటవీ మంత్రిత్వ శాఖను పర్యవేక్షిస్తోన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇందులో పాల్గొననున్నారు. ఆయన సమక్షంలో కర్ణాటక ప్రభుత్వం ఈ ఆరు ఏనుగులను అప్పగించనుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తయినట్లు మంత్రి ఈశ్వర్ ఖండ్రే వెల్లడించారు. రంజన్, దేవా, మాస్తి, కరుణ, కృష్ణ, అభిమన్యు అనే ఏనుగులు కర్ణాటక నుంచి ఏపీకి రానున్నాయి. రంజన్, దేవా, మాస్తి, కరుణ ఏనుగులను కొడగు జిల్లాలోని దుబారె ఎలిఫెంట్ క్యాంప్ నుంచి తరలించనున్నారు. కృష్ణ, అభిమన్యును శివమొగ్గ జిల్లాలోని సక్రెబైలు నుంచి తీసుకొస్తారు. తొలుత వాటిని చిత్తూరుకు తరలిస్తారు. ఇవన్నీ కూడా కుంకీ ఏనుగులు. అంటే- ఇతర ఏనుగుల గుంపును ఇవి నియంత్రించగలుగుతాయి. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అటవీ ఏనుగులు తరచూ జనావాసాల్లోకి రావడం పంట పొలాలను ధ్వంసం చేస్తోన్న నేపథ్యంలో.. వాటిని నియంత్రించడానికి ఈ కుంకీ ఏనుగులను ఏపీ ప్రభుత్వం తీసుకుని రానుంది. ఈ ఏనుగులతో పాటు వాటి మావటులు ఏపీకి వస్తారు. కొద్దిరోజుల పాటు ఇక్కడే ఉంటారు. ఇక్కడి వాతావరణానికి అలవాటు పడటం, ఆ ఏనుగుల గురించి అటవీ సిబ్బంది, ఉద్యోగులకు శిక్షణ ఇచ్చిన తరువాత వాళ్లు మళ్లీ స్వరాష్ట్రానికి తిరిగి వెళ్తారని తెలుస్తోంది. ఏనుగుల గుంపు జనావాసాలకు తరలిరావడం కర్ణాటకలో కూడా సర్వ సాధారణమే. చామరాజనగర, కొడగు, హసన్, మైసూరు, చిక్ మగళూరు వంటి జిల్లాల్లో అవి తరచూ గ్రామాలు, పంటపొలాలపై దండెత్తుతుంటాయి. అలాంటి సమస్య ఇక్కడా ఉన్నప్పటికీ- కర్ణాటక ప్రభుత్వం కుంకీ ఏనుగులను ఏపీకి తరలించడం పట్ల విమర్శలు తలెత్తుతున్నాయి. గత ఏడాది ఆగస్టు 8వ తేదీన పవన్ కళ్యాణ్.. బెంగళూరులో సిద్ధరామయ్య, మంత్రి ఈశ్వర్ ఖండ్రేలను కలిసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలోని అటవీ సిబ్బందికి, ఏనుగులను నియంత్రించే కార్యకలాపాల్లో శిక్షణ ఇవ్వాలని అప్పట్లో కోరారు. సెప్టెంబర్ 27వ తేదీన ఈశ్వర్ ఖండ్రే కూడా విజయవాడలో పవన్ తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏనుగుల అప్పగింతకు సంబంధించి ఈ రెండు రాష్ట్రాల మధ్య అవగాహన ఒప్పందం కుదరింది.

# పవర్ ఉంటేనే ప్రపంచం శాంతి భాష వింటుంది



**న్యూఢిల్లీ,:** భారతదేశం ప్రపంచ సామరస్యానికి, సంక్షేమానికి దృఢంగా కట్టుబడి ఉన్న సమయంలో, ప్రస్తుతం ప్రపంచం భారతదేశ పవర్‌ని చూసిందని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. అధికారంలో ఉన్న వ్యక్తి నుంచి మాత్రమే "ప్రేమ భాష" అర్థమవుతుందని ఆయన అన్నారు. పవర్ ఉంటేనే ప్రపంచం శాంతిని వింటుందని అన్నారు. జైపూర్‌లోని హర్మారాలోని రవినాథ్ ఆశ్రమంలో జరిగిన కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ ప్రసంగిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పాకిస్తాన్‌పై ఇటీవల భారత్ నిర్వహించిన "ఆపరేషన్ సిందూర్" గురించి మాట్లాడుతూ.. భారత్ ఎవరిని ద్వేషించదు, కానీ మీకు అధికారం ఉన్నప్పుడు మాత్రమే ప్రపంచ ప్రేమ, సంక్షేమం యొక్క భాషను వింటుంది అమని, ఈ స్వభావాన్ని మార్చలేని అన్నారు. ఇది ప్రపంచ స్వభావము, కాబట్టి ప్రపంచ సంక్షేమం కోసం, మనం శక్తివంతంగా ఉండాలి, ప్రపంచం మన బలాన్ని చూసింది అని అన్నారు. "ప్రపంచ సంక్షేమమే మన మతం. ఇది ముఖ్యంగా హిందూ మతం యొక్క దృఢమైన విధి" అని భగవత్ అన్నారు. భారతదేశ పాత్ర అన్నయ్య పాత్ర అని, ప్రపంచంలో శాంతి, సామరస్యం కోసం పనిచేస్తుందని చెప్పారు. శ్రీలంక, నేపాల్, మాల్దీవులు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నప్పుడు భారత్ సహాయం చేసిందని చెప్పారు.

# భారత్, అఫ్గాన్ స్నేహ గీతం

**అఫ్ఘాన్ విదేశాంగ మంత్రితో మాట్లాడిన భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్**

**పహల్గాం ఉగ్రవాద దాడిని ఖండించినందుకు కృతజ్ఞతలు**

**పాకిస్తాన్‌ను ఏకాకిని చేసే దిశగా భారత్ వ్యూహరచన**

**ప్రాంతీయ ప్రయోజనాల కోసం అఫ్గాన్‌కు స్నేహహస్తం**

**రెండు దేశాల మధ్య మరింత బలపడనున్న సంబంధాలు**



శత్రువుకు శత్రువు మిత్రుడు అన్నట్లుగా భారత్, అఫ్గానిస్తాన్ దేశాలు స్నేహగీతం పాడుకుంటున్నాయి. శతాబ్దాల క్రితం అఖండ భారత్‌లో భాగమైన రెండు దేశాల మధ్య మళ్లీ సంబంధాలు బలపడే సూచనలు కనిపిస్తున్నాయి. భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ తాజాగా అఫ్గానిస్తాన్ విదేశాంగ మంత్రితో మాట్లాడారు. పహల్గాం ఉగ్రవాద దాడిని ఖండించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. 2021 ఆగస్టులో తాలిబన్లు అఫ్గానిస్తాన్‌ను మరోసారి ఆక్రమించిన తర్వాత అక్కడి మంత్రితో అధికారికంగా మాట్లాడడం ఇదే మొదటిసారి కావడం విశేషం. భవిష్యత్తులో రెండు దేశాల మధ్య సంబంధాలు బలపడడం ఖాయమని చెప్పడానికి ఇదొక నిదర్శనమని నిపుణులు పేర్కొంటున్నారు. అఫ్గాన్‌లోని తాలిబన్ ప్రభుత్వం పట్ల భారత్ ఇటీవల సానుకూల వైఖరి ప్రదర్శిస్తోంది. ఇది మున్ముందు పూర్తిస్థాయి వ్యూహాత్మక ద్వైపాక్షిక బంధంగా మారిన ఆశ్చర్యం లేదు. 1999లో ఉగ్రవాదులు భారత విమానాన్ని హైజాక్ చేసి, అఫ్గానిస్తాన్‌లోని కాందహార్‌లో దించిన సంగతి తెలిసిందే. ప్రయాణికులను రక్షించడానికి సైనిక ఆపరేషన్ చేపట్టేందుకు భారత్ సిద్ధపడగా, అప్పటి తాలిబన్ ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. దాంతో ఇరుదేశాల మధ్య సంబంధాలు చాలావరకు తెగిపోయాయి. తదనంతర పరిణామాల నేపథ్యంలో రెండు దేశాలు మళ్లీ ఒక్కటవుతున్నాయి.

తాలిబన్ల రాకతో దెబ్బతిన్న సంబంధాలు

శతాబ్దాల పాటు అఖండ భారత్‌లో అంతర్భాగంగా కొనసాగిన అఫ్గనిస్తాన్ 18వ శతాబ్దంలో ప్రత్యేక దేశంగా విడిపోయిందని చరిత్రకారులు చెబుతుంటారు. అమెరికా, రష్యా మధ్య ఆధిపత్య పోరుకు అఫ్గాన్ ఒక వేదికగా మారింది. చాలా ఏళ్లపాటు ఈ పోరాటం కొనసాగింది. 1973లో అఫ్గాన్ రిపబ్లిక్ దేశంగా అవతరించింది. అఫ్గాన్‌ను భారత్ అధికారికంగా గుర్తించింది. తమ మిత్రదేశంగా ప్రకటించింది. 1996 దాకా ఇరుదేశాల మధ్య ఎలాంటి విభేదాలు తలెత్తలేదు. సాధ్యమైనంత వరకు పరస్పరం సహకరించుకున్నాయి. 1996లో తాలిబన్ల ప్రాబల్యం మొదలైంది. పాకిస్తాన్ అండతో తాలిబన్లు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అఫ్గాన్‌లో తాలిబన్ సర్కార్‌ను గుర్తించేందుకు భారత్ నిరాకరించింది. విమానం హైజాక్ ఘటన తర్వాత పరిస్థితి దిగజారింది. భారత్-అఫ్గాన్ సంబంధాలు పూర్తిగా చెడిపోయాయి. ఆ తర్వాత అమెరికాలో ప్రపంచ వాణిజ్య కేంద్రంపై అల్‌ఖైదా ఉగ్రవాదుల దాడి, అఫ్గాన్‌పై అమెరికా యుద్ధం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. అమెరికా మద్దతుతో అఫ్గాన్‌లో ప్రజా ప్రభుత్వం ఏర్పడింది. 2021లో అమెరికా తన సేనలను అఫ్గాన్ నుంచి ఉపసంహరించుకోవడంతో తాలిబన్లు గద్దెనెక్కారు.

## ఇన్నాళ్లూ రహస్యంగా చర్చలు!

మళ్లీ అధికారంలోకి వచ్చిన తాలిబన్లతో భారత ప్రభుత్వం తొలుత అంటీముట్టనట్లుగానే వ్యవహరించింది. వేచి చూసే ధోరణి అవలంబించింది. భారత్%-%అఫ్గాన్ మధ్య సంబంధాలు మానవతా సాయం, సాంస్కృతిక, క్రీడల రంగానికే పరిమితం అయ్యాయి. అఫ్గాన్ క్రికెటర్లు ఇండియాలో పోటీల్లో పాల్గొన్నారు. ఇరుదేశాల మధ్య చాలాసార్లు రహస్యంగా చర్చలు జరిగినట్లు వార్తలు వచ్చాయి. కానీ, భారత్ వాటిని ఖండించింది. మరోవైపు సంబంధాలు మెరుగవుతున్న సూచనలు స్పష్టంగా కనిపించాయి. ఈ ఏడాది జనవరి 8వ తేదీన భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రం మిస్రీ అఫ్గాన్ విదేశాంగ మంత్రితో సమావేశమయ్యారు. పహల్గాం ఉగ్రవాద దాడి నేపథ్యంలో భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ సైతం అఫ్గాన్ విదేశాంగ మంత్రితో మాట్లాడారు. ప్రాంతీయ ప్రయోజనాల కోణంలో అఫ్గాన్‌ను సన్నిహిత దేశంగా మార్చుకోవాలని భారత్ భావిస్తున్నట్లు సమాచారం.

పాకిస్తాన్‌కు ఇక ముసళ్ల పండుగే

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో గత నెల 22వ తేదీన ఉగ్రవాదులు 26 మంది పర్యాటకులను పొట్టనపెట్టుకున్నారు. ఈ దాడికి పాకిస్తాన్ నుంచే కుట్ర జరిగినట్లు భారత్ గుర్తించింది. ఉగ్రవాదులను, వారి మద్దతుదారులను అంతం చేయాలన్న లక్ష్యంతో ఆపరేషన్ సిందూర్ ప్రారంభించింది. పాకిస్తాన్‌లోని ఉగ్రవాద శిబిరాలను, వైమానిక స్థావరాలను నేలమట్టం చేసింది. ఉగ్రవాదం పీడను శాశ్వతంగా వదిలించుకోవడంతోపాటు దక్షిణాసియాలో తనకు తలనొప్పిగా మారిన పాకిస్తాన్‌ను ఏకాకిని చేసే దిశగా భారత్ అడుగులు వేస్తోంది. వ్యూహాలకు పదును పెడుతోంది. అందులో భాగంగానే అఫ్గానిస్తాన్‌కు స్నేహహస్తం అందిస్తోంది. రాబోయే రోజుల్లో భారత్, అఫ్గాన్ మరింత సన్నిహితంగా మారితే పాకిస్తాన్‌కు ఇక్కట్లు తప్పవని నిపుణులు అంటున్నారు. ఆర్థిక, వాణిజ్య సంబంధాలను బలోపేతం చేసుకోవాలని భారత్, అఫ్గాన్ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

## పాక్-అఫ్గాన్ మధ్య రగులుతున్న విభేదాలు

తాలిబన్లకు తండ్రి లాంటి పాకిస్తాన్, తాలిబన్ల పాలనలో ఉన్న అఫ్గానిస్తాన్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థాయిలో విభేదాలు రగులుతున్నాయి. ఇరుదేశాల మధ్య సరిహద్దు గొడవలు ముదురుతున్నాయి. తాలిబన్లు తమ చెప్పుచేతల్లో ఉండకుండా స్వతంత్రంగా వ్యవహరిస్తుండడం పాకిస్తాన్ జీర్ణించుకోలేకపోతోంది. ఇస్లామాబాద్, కాబూల్ నడుమ సంబంధాలు వేగంగా పతనమవుతున్నాయి. తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్తాన్(టీటీపీ) అనే సంస్థ పాకిస్తాన్‌లోని ఖైబర్ పఖ్తూంక్వా, బలూచిస్తాన్ ప్రావిన్స్‌ల్లో ఇటీవల దాడులకు పాల్పడింది. టీటీపీకి తాలిబన్ సర్కారు అండదండలు ఉన్నాయని పాక్ ఆరోపిస్తోంది. అఫ్గాన్ గడ్డపైనుంచే టీటీపీ కార్యకలాపాలు సాగిస్తోందని మండిపడుతోంది. టీటీపీ దాడులకు ప్రతీకారంగా గత ఏడాది డిసెంబర్‌లో పాక్ సైన్యం అఫ్గాన్‌లోని పాక్తీకా ప్రావిన్స్‌లో వైమానిక దాడులు నిర్వహించింది. ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేశామని పాక్ ప్రకటించింది. ఈ దాడుల పట్ల తాలిబన్లు తీవ్రంగా స్పందించారు. పాకిస్తాన్‌కు తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. మరోవైపు సరిహ ద్దుల్లో కంచె వేసేందుకు పాక్ ప్రయత్నిస్తుండగా, తాలిబన్లు అడ్డుకుంటున్నారు. బ్రిటిష్ పాలకులు నిర్ధారించిన డురాండ్ లైన్‌ను సరిహద్దు రేఖగా ఇస్లామాబాద్ గుర్తిస్తుండగా, అఫ్గాన్ అందుకు ఒప్పుకోవడం లేదు. మరోవైపు 2023లో వేలాది మంది అఫ్గాన్ శరణార్థులను పాక్ ప్రభుత్వం బలవంతంగా బ యటకు వెళ్లగొట్టింది. ఈ వ్యవహారంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి.

# ట్రంప్ మరో పిడుగు.. 5 శాతం రెమిటెన్స్ పన్ను

**గ్రీన్‌కార్డుదారులకు కూడా వర్తింపు**

**జూలై 4 నుంచి అమలయ్యే అవకాశం**

**ఏటా రూ.3 లక్షల కోట్లు పంపే ఎన్నారైలు**

**వాటిపై ఆధారపడే కుటుంబాలకు కష్టకాలమే**

**యూఎస్‌కు మాత్రం రూ.15 వేల కోట్ల ఆదాయం**



మీరు అమెరికాలో ఉంటున్నారా? భారత్‌లోని మీ కుటుంబానికి ప్రతి నెలా డబ్బులు పంపుతున్నారా? అయితే ఇకపై మరో పన్ను బాదుడుకు సిద్ధంగా ఉండండి. అలా పంపే ప్రతి లక్ష రూపాయలకూ రూ.5 వేల చొప్పున ట్రంప్ ముక్కు పిండి మరీ వసూలు చేయనున్నారు. రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ భారత అమెరికన్ల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తున్న అధ్యక్షుడు ఈ మేరకు ప్రతిపాదనను తాజాగా తెరపైకి తెచ్చారు. దాని ప్రకారం అమెరికాలోని వలసదారులు తమ మాతృదేశాలకు పంపే మొత్తాలపై 5 శాతం పన్ను విధించనున్నారు. అమెరికా పౌరులు కానివారందరికీ ఇది వర్తిస్తుంది. గ్రీన్‌కార్డుదారులతో పాటు హెచ్-1బీ, ఎఫ్-1 లేదా జే-1 తదితర వీసాలపై అక్కడ ఉంటున్న భారతీయులంతా ఈ నిర్ణయంతో తీవ్రంగా ప్రభావితులవుతారు. ట్రంప్ దీనికి 'వన్ బిగ్, బ్యూటిఫుల్ బిల్' అని పేరు పెట్టుకుని మురిసిపోతున్నారు. ఈ బిల్లుకు అధికార రిపబ్లికన్లు మద్దతిస్తుండగా ఎన్నారైల మద్దుతుదారుగా పేరున్న విపక్ష డెమొక్రటిక్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. బిల్లు ప్రస్తుతం ప్రతినిధుల సభ పరిశీలనలో ఉంది. అక్కడ, అనంతరం సెనేట్‌లో ఆమోదముద్ర పడితే జూలై 4 నుంచి అమల్లోకి వస్తుంది.

## మనోళ్లకు పెద్ద దెబ్బ

అమెరికాలో ఉంటున్న భారతీయుల సంఖ్య 45 లక్షల పై చిలుకే. వారిలో చాలామంది ఉన్నత స్థాయి ఉద్యోగులు, వ్యాపారవేత్తలు తదితరులే. వాళ్లు భారత్‌కు ఏటా భారీ మొత్తాలు పంపుతుంటారు. మామూలు ఉద్యోగులు చేసేవాళ్లు కూడా భారత్‌లోని తమ కుటుంబాల పోషణ, తల్లిదండ్రుల వైద్య ఖర్చులు తదితరాల నిమిత్తం ప్రతి నెలా టంచనుగా డబ్బులు పంపుతుంటారు. ఇక్కడ రియల్ ఎస్టేట్లో పెట్టుబడులు పెడుతుంటారు. రెమిటెన్స్ పన్ను దెబ్బకు ఇకపై మనవాళ్లు పంపే మొత్తాలు భారీగా తగ్గడం ఖాయమని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఫలితంగా మన విదేశీ మారకద్రవ్య నిల్వలపైనా ప్రతికూల ప్రభావం పడవచ్చంటున్నారు. "భారత్ తిరిగొచ్చి ఇక్కడే స్థిరపడాలని భావించే అమెరికా ఎన్నారైలు సంపాదించే ప్రతి డాలర్‌పైనా 5 శాతం కోత పడ్డట్టే లెక్క. భారీ మొత్తాలు పంపే ఆలోచనలో ఉన్నవాళ్లు జూలైకి ముందే ముగించుకోవడం మేలు" అని సూచిస్తున్నారు.

## జీవనాధారంపై దెబ్బ

రెమిటెన్సుల పన్ను వర్తింపు విషయమై ప్రతిపాదనలో ఎలాంటి మినహాయింపులూ ప్రతిపాదించలేదు. కనుక ఎంత తక్కువ మొత్తం పంపినా బాదుడు ఖాయమే. దాంతో వాటిపైనే ఆధారపడే ఎన్నో భారత కుటుంబాలను ఇది తీవ్రంగా ప్రభావితం చేయనుంది. "పిల్లల్ని అమెరికా పంపిన తల్లిదండ్రుల్లో చాలామంది వారిపైనే ఆధారపడి ఉంటారు. ఇంటి అద్దె, లేదా ఈఎంఐలు మొదలుకుని వైద్య ఖర్చుల దాకా పిల్లలు నెల నెలా పంపే డబ్బులే ఆధారం. రెమిటెన్సులంటే కేవలం ఆర్థిక కార్యకలాపాలు కావు. లక్షలాది మందికి జీవనాధారాలు. దీన్ని ఆ మానవీయ కోణం నుంచి చూడాలి. కానీ ట్రంప్ పక్కా వ్యాపార ధోరణితో వ్యవహరిస్తున్నారు" అంటూ ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నారై రెమిటెన్సులపై బాగా ఆధారపడే మన రియల్ ఎస్టేట్, బ్యాంకింగ్ తదితర రంగాలపై ప్రతికూల ప్రభావం ఖాయమని చెబుతున్నారు.

రెమిటెన్సుల్లో భారతే టాప్

ప్రపంచం మొత్తంలో విదేశాల నుంచి అత్యధికంగా రెమిటెన్సులు వచ్చేది భారత్‌కే. 2024లో వాటి మొత్తం ఏకంగా 130 బిలియన్ డాలర్లు! అంటే దాదాపు రూ.10.7 లక్షల కోట్లు. అందులో 28 శాతం, అంటే రూ.3 లక్షల కోట్ల (32 బిలియన్ డాలర్ల) మేరకు వాటా భారత అమెరికన్లదే. ఆ లెక్కన 5 శాతం రెమిటెన్సు పన్ను రూపేణా అమెరికాకు ఏటా ఒక్క ఎన్నారైల మీదే అప్పనంగా రూ.15 వేల కోట్ల ఆదాయం సమకూరనుంది!

## అక్రమ పన్నే!

రెమిటెన్స్ పన్ను విధింపు చట్టారీత్యా చూసినా సరికాదన్నది ఆర్థిక నిపుణుల వాదన. "ఇది చాలా అన్యాయమైన ప్రతిపాదన. వేలాది మైళ్లు వలస వెళ్లి అనేక కష్టాలకోర్చి తమవారికి అండగా నిలుస్తున్నందుకు, స్వదేశాల్లో పెట్టుబడులు పెడుతున్నందుకు శిక్షిస్తున్నట్టుగా ఉంది. పైగా అమెరికాకు అన్ని రకాల కేంద్ర, రాష్ట్ర పన్నులు చెల్లించిన మీదట మిగుల్చుకున్న మొత్తంపై దీన్ని చెల్లించాల్సి ఉంటుంది. ఇది కచ్చితంగా అక్రమమే. ఇందులో రాజకీయ ఉద్దేశాలు కొట్టొచ్చినట్టు కన్పిస్తున్నాయి" అని వారంటున్నారు. ఈ ప్రతిపాదనపై డెమొక్రాట్ సభ్యులు కాంగ్రెస్‌లో తీవ్ర అభ్యంతరాలు వెలిబుచ్చారు. వలస సమాజాలను, ముఖ్యంగా అల్పాదాయ కుటుంబాలను ఈ పన్ను అన్యాయంగా పీల్చి పిప్పి చేస్తుందని వాదించారు. మితవాద రిపబ్లికన్లు కూడా వారితో గొంతు కలుపుతున్నారు.

# ఏటీఎంలకు డిజిటల్ గ్రహణం!




దేశంలో డిజిటల్ లావాదేవీల విప్లవం ఆటోమేటెడ్ టెల్లర్ మెషీన్ (ఏటీఎం)లకు గండి కొడుతోంది. ఒకపక్క బ్యాంకింగ్ వ్యవస్థలో నగదు చెలామణీ అంతకంతకూ ఎగబాకుతూ ఆల్‌టైమ్ గరిష్టాల్లో కొనసాగుతోంది. మరోపక్క ఏటీఎంలు మాత్రం తగ్గుముఖం పడుతున్నాయి. బ్యాంకులు కొత్తగా తెరుస్తున్న ఏటీఎంల కంటే మూసేస్తున్నవే ఎక్కువ కావడం విశేషం! కొత్తిమీర కట్ట నుంచి బైకులో పెట్రోలు దాకా దేనికైనా డిజిటల్ చెల్లింపులే నడుస్తున్నాయిప్పుడు! మన దైనందిన ఆర్థిక లావాదేవీల్లో యూపీఐ పేమెంట్స్ అంతలా పెనవేసుకుపోయాయి మరి. దీంతో ఏటీఎంల నుంచి నగదు విత్‌డ్రాలు కూడా తగ్గుతున్నాయి. ఇదిలా ఉంటే, ఒకప్పుడు మెయిన్ రోడ్లపైనే కాకుండా సందుల్లో కూడా ఎడాపెడా ఏటీఎంలను తెరిచిన బ్యాంకులు.. ఇప్పుడు చడీచప్పుడు లేకుండా వాటికి తాళాలేస్తున్నాయి. ఆర్‌బీఐ నిబంధనల మేరకు ఏటీఎం ఉచిత లావాదేవీలపై పరిమితులు విధించడం, ఏటీఎం ఇంటర్-ఆపరబిలిటీ, వేరే బ్యాంకుల కస్టమర్లు ఏటీఎంలను ఉపయోగించుకునేటప్పుడు విధించే ఇంటర్‌చేంజ్ ఫీజు పెరుగుదల పెద్దగా లేకపోవడంతో బ్యాంకులు ఏటీఎంల నిర్వహణ బిజినెస్ పట్ల పెద్దగా ఆసక్తి చూపడం లేదు. కొత్త ఏటీఎంల ఏర్పాటుకు ముఖం చాటేస్తున్నాయి. బ్యాంకింగ్ రంగంలో దేశవ్యాప్తంగా 2023 డిసెంబర్ నాటికి 2,19,882 ఏటీఎంలు ఉండగా, 2024 డిసెంబర్ నాటికి వీటి సంఖ్య 2,14,398కి తగ్గిపోయింది. అంటే దాదాపు ఏడాది వ్యవధిలో 5,484 ఏటీఎంలను ఎత్తేశాయన్నమాట! ముఖ్యంగా ఆఫ్‌సైట్ (బ్యాంకు బ్రాంచ్‌లలో కాకుండా ఇతర లొకేషన్లలో ఉన్నవి) ఏటీఎంల విషయంలో ఈ కోత భారీగా ఉంది. 2022 సెప్టెంబర్లో గరిష్టంగా 97,072 ఆఫ్‌సైట్ ఏటీఎంలు ఉండగా.. 2024 డిసెంబర్ నాటికి ఇవి 85,913కి తగ్గిపోవడం గమనార్హం.

డిజిటల్ రయ్...

బ్యాంకింగ్ వ్యవస్థలో నగదు చెలామణీ ప్రస్తుతం ఆల్‌టైమ్ గరిష్ట స్థాయిలో రూ.34.7 లక్షల కోట్లకు పైగానే ఉంది. పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్) నుంచి చూస్తే రెట్టింపైంది. మన స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో ఇది 12 శాతం కింద లెక్క. ఇంతలా నగదు వ్యవస్థలో ఉన్నప్పటికీ, ఏటీఎంల సంఖ్య పెరక్కపోగా.. అంతకంతకూ తగ్గుతుండటం విశేషం. ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం ప్రస్తుతం దేశంలో ప్రతి లక్ష మంది జనాభాకు 15 ఏటీఎంలు మాత్రమే ఉన్నాయి. కాగా, 2024 పూర్తి ఏడాదికి చూస్తే, 17,200 కోట్ల యూపీఐ లావాదేవీలు జరిగాయి. 2023తో పోలిస్తే (11,760 కోట్లు) 46 శాతం దూసుకెళ్లాయి. మరోపక్క, ఆర్‌బీఐ అనుమతితో ఈ నెల 1 నుంచి ఏటీఎం చార్జీలను బ్యాంకులు పెంచేశాయి. దీంతో ఉచిత లావాదేవీల పరిమితి దాటితే, ప్రతి లావాదేవీకి ఇప్పు డున్న రూ.21 చార్జీ రూ.23కు పెరిగింది. నెలకు సొంత బ్యాంకుల ఏటీఎంలలో 5, ఇతర బ్యాంకుల ఏటీఎంల విషయాని కొస్తే మెట్రోల్లో అయితే 3, నాన్ మెట్రోల్లో 5 లావాదేవీలు ఉచితం. క్యాష్ విత్‌డ్రాతో పాటు బ్యాలెన్స్ ఎంక్వయిరీ వంటివన్నీ లావాదేవీగానే పరిగణిస్తున్నారు.

ఎనీటైమ్ సమస్యలు...!

కొన్ని బ్యాంకులు బ్రాంచ్‌ల వద్ద ఏటీఎంలను బాగానే నిర్వహిస్తున్నప్పటికీ,ఆఫ్‌సైట్‌ఏటీఎంల విషయంలో అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎప్పుడు చూసినా సాంకేతిక సమస్యలు, లేదంటే క్యాష్ లేకపోవడం వంటివి కస్టమర్లకు నిత్యకృత్యంగా మారుతున్నాయి. దీంతో అత్యవసరంగా క్యాష్ విత్‌డ్రా చేసుకోవాలంటే రెండు మూడు ఏటీఎంలకు తిరగాల్సి వస్తోందనేది అధిక శాతం మంది ఖాతాదారుల ఫిర్యాదు. 'దేశంలో ప్రస్తుత ఏటీఎంల ట్రెండ్‌ను పరిశీలిస్తే, బ్యాంకింగ్ రంగంలో టెక్నాలజీ, ముఖ్యంగా డిజిటల్ మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మరోపక్క, బ్యాంకింగ్ సేవలు తక్కువగా ఉన్న మారుమూల ప్రాంతాలపై బ్యాంకులు దృష్టి పెట్టడం కూడా మొత్తంమీద ఏటీఎంలు తగ్గుముఖం పట్టడానికి కారణం' అని ఆన్‌లైన్ పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్ ఏజీఎస్ ట్రాన్సాక్ట్ టెక్నాలజీస్ చైర్మన్ రవి బి. గోయల్ అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనాల నేపథ్యంలో నెట్‌వర్క్ స్థిరీకరణ జరిగినట్లు ఆయన పేర్కొన్నారు.

34.7 లక్షల కోట్లు: బ్యాంకింగ్ వ్యవస్థలో చెలామణీలో ఉన్న నగదు (జీడీపీలో ఇది 12 శాతం). 2,14,398: 2024 డిసెంబర్ నాటికి దేశంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకుల మొత్తం ఏటీఎంల సంఖ్య (స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు, పేమెంట్ బ్యాంకులు సహా). ఇందులో 1,28,485 ఆన్‌సైట్, 85,913 ఆఫ్‌సైట్ ఏటీఎంలు ఉన్నాయి. 36,000: దేశంలో వైట్ లేబుల్ ఏటీఎంల సంఖ్య దాదాపుగా. ప్రస్తుతం ఈపీఎస్, ఇండియా1 పేమెంట్స్, హిటాచి పేమెంట్ సర్వీసెస్, టాటా కమ్యూనికేషన్స్ పేమెంట్ సొల్యూషన్స్, వక్రంగి.. ఈ ఐదు ప్రైవేటు కంపెనీలు వైట్ లేబుల్ ఏటీఎం ఆపరేటర్లుగా ఉన్నాయి. 17,200 కోట్లు : 2024లో యూపీఐ లావాదేవీల సంఖ్య (రోజువారీగా సగటు విలువ రూ. 74,990 కోట్లు)

జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

సంపాదకీయం

# మిగిలిన ప్రశ్నలు ముగిసిన యుద్ధం,

'మన తోబుట్టువుల, కుమార్తెల సిందూరాన్ని తుడిచివేసిన పర్యవసానమేమిటో నేడు ప్రతి ఉగ్రవాదికి, ప్రతి ఉగ్రవాద సంస్థకు తెలిసివచ్చింది. ఆపరేషన్ సిందూర్ కేవలం ఒక పేరు కాదు, కోట్లాది భారతీయుల మనోభావాలకు ప్రతిబింబం'... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం రాత్రి జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలోని మాటలవి. భారత్, పాకిస్థాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఆపరేషన్ సిందూర్‌లో ఒక విరామం మాత్రమేనని దేశ ప్రజలు విశ్వసించేలా చేసేందుకు ఆయన ప్రయత్నించారు. మోదీ స్వాభావిక వాక్చాతుర్యం, శ్రోతలను సమ్మోగ్ధం చేసే మాటకారితనం ఆ ప్రసంగంలో బాగా కనిపించాయి. ఉగ్రవాదులకు, వారికి మద్దతిస్తున్న పాకిస్థాన్‌కు భారీ నష్టాన్ని కలిగించడంలో ఆపరేషన్ సిందూర్ సఫలమయిందని మోదీ అన్నారు. తాత్కాలిక కాల్పుల విరమణ ప్రాతిపదికన కొత్త లక్ష్మణ రేఖలు నిర్దేశిస్తూ పాకిస్థాన్ ప్రభుత్వంతో చర్చలు ఉగ్రవాదం, ఆక్రమిత కశ్మీర్‌పైన మాత్రమే జరుగుతాయని ప్రధానమంత్రి ప్రకటించారు. ఇస్లామాబాద్ పాలకులు అణ్వస్త్రాల బూచిని చూపుతూ పాల్పడుతున్న బ్లాక్ మెయిల్‌కు భారత్ బెదరదు, జడవదు అని, మళ్లీ రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తే కఠినంగా ప్రతిస్పందించేందుకు భారత సైన్యం సదా యుద్ధ సన్నద్ధమై ఉందని నరేంద్రమోదీ హెచ్చరించారు. ఒకపక్క, ఇక్కడ, ఇలా, భారత రాజకీయాల శక్తిమంతుడు తాను పాకిస్థాన్‌ను కాళ్ళబేరానికి రప్పించాకనే కాల్పుల విరమణ జరిగిందంటూ టీవీలో ప్రసంగిస్తుండగానే అక్కడ వేలమైళ్ళ దూరంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈ కథనానికి వరుస తూట్లుపొడిచాడు. తాను, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో తీవ్ర ప్రయత్నాలు చేసి దక్షిణ ఆసియాలోని రెండు అణ్వస్త్ర రాజ్యాలను కాల్పుల విరమణకు ఒప్పించామని ట్రంప్ పేర్కొన్నారు.

ప్రపంచ మీడియా పతాక శీర్షికల్లో ఉండేందుకు మోదీ కంటే ఎక్కువగా ట్రంప్ ఆరాటపడడం గత కొద్ది రోజుల్లో ఇది మూడోసారి. కాల్పుల విరమణకు అంగీకరించినట్టు భారత్, పాకిస్థాన్ ప్రభుత్వాలు ప్రకటించకముందే ట్రంప్ ఆ విషయాన్ని తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో వెల్లడించారు. మరి కొద్ది గంటల్లోనే, భారత్, పాకిస్థాన్‌లకు నచ్చచెప్పేందుకు అమెరికా ప్రభుత్వం రాత్రికి రాత్రి చేసిన ప్రయత్నాల గురించి సవివరంగా ట్వీట్ చేశారు. కశ్మీర్ వివాదాన్ని పరిష్కరించేందుకు తాను మధ్యవర్తిత్వం నెరపుతానని కూడా ఆయన ప్రతిపాదించారు. మే 12న వైట్ హౌజ్‌లో మీడియా రోజువారీ గోష్ఠిలో ట్రంప్ ఆశువుగా చేసిన వ్యాఖ్యలు ఇంటా బయటా అసాధారణ వ్యక్తిలా వ్యవహరించే ప్రధాని మోదీని చిన్నబుచ్చేవిగా ఉన్నాయి. భారత్, పాకిస్థాన్‌లతో వాణిజ్య సంబంధాలను పూర్తిగా నిలిపివేస్తామని ఉభయ దేశాల ప్రధానమంత్రులకు గద్దించి చెప్పడం ద్వారా ఈ ఘర్షణ నుంచి విరమించుకునేలా చేశామని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇలా ట్రంప్ తనను వెంటాడడం కొనసాగుతుండడంతో సర్వత్రా తనకు ప్రచారాన్ని, ప్రాధాన్యాన్ని పొందడంలో అనితరసాధ్యుడైన మోదీ, ఇప్పుడు ఆ విషయంలో ఇబ్బందుల్లో పడ్డారు! భారత్ పాకిస్థాన్‌ల మధ్య సైనిక ఘర్షణలు తమ ప్రయత్నాల వల్లనే నిలిచిపోయాయని అమెరికా ఘనంగా చెప్పుకున్న అంశాన్ని, కశ్మీర్ వివాదాన్ని పరిష్కరించేందుకు తాను మధ్యవర్తిత్వం నెరపుతానన్న ట్రంప్ ప్రతిపాదనను ప్రధాని మోదీ తన ప్రసంగంలో మాట మాత్రంగానైనా స్పృశించకుండా యథావిధిగా తన ఉద్వేగపూరితమైన ప్రసంగంలో ప్రజలను ముంచెత్తారు. పాకిస్థాన్ నాయకులు తమ ప్రసంగాల్లో అమెరికా అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలుపగా, అమెరికా ఉనికిని భారత్ కనీసమాత్రంగానైనా అంగీకరించలేదు. భారతీయ ఆడపడుచుల నుదుటి 'సిందూరం'ను ఉగ్రవాదులు తుడిచేశారని మోదీ తన ప్రసంగంలో పదే పదే ప్రస్తావించడం ద్వారా ప్రజల్లో భావోద్వేగాలను పురిగొల్పారు.

అమెరికా వ్యాఖ్యలు, వాటిపై నరేంద్ర మోదీ మౌనం వహించడం ప్రతిపక్షాలకు ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించేందుకు వీలు కల్పించింది.

ప్రధానమంత్రిని 'విశ్వగురు'గా ఆరాధిస్తున్న భారతీయ జనతా పార్టీ శ్రేణులను ఈ పరిణామం కలవరపరుస్తోంది. మోదీ తన విదేశీ పర్యటనలలోను లేదా భారత్ పర్యటనకు వచ్చిన అంతర్జాతీయ నాయకులను ప్రేమపూర్వకంగా ఆలింగనం చేసుకోవడం లేదా అభినందనపూర్వకంగా వారి వెన్నుచరచడం పరిపాటి. అలాంటిది ఇప్పుడు ట్రంప్ ఆయన్ను, పాకిస్థాన్ ప్రధానమంత్రిని సమరీతిలో గౌరవించడం, ఇరువురినీ ఒకే నాణేనికి బొమ్మా బొరుసులాగా పేర్కొనడం ద్వారా మోదీని తీవ్ర ఇబ్బందికి లోను చేశారు. ట్రంప్ తీరుతో మోదీ ప్రతిష్ఠ దెబ్బతిన్నది. విధేయ మీడియా, సామాజిక మాధ్యమాల శ్రేణులు ఎంతగా ప్రయత్నించినప్పటికీ జరిగిన నష్టాన్ని భర్తీచేయడం అసాధ్యంగా ఉన్నది. ఆకస్మికంగా, అనూహ్యంగా అమలు జరిగిన కాల్పుల విరమణను యుద్ధోన్మాదులు హర్షించలేకపోయారు. యుద్ధం చుట్టూ బీజేపీ నిర్మిస్తూవచ్చిన దేశభక్తియుత, ఉద్వేగపూరిత వాతావరణాన్ని ఒక్కసారిగా ఛిద్రంచేసిన నిర్ణయమది. పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పే అవకాశం వ్యర్థమయిందని వారి బాధ. ఉభయ దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింతగా తీవ్రమయ్యేందుకు వారు ఎంతగా ప్రయత్నించినప్పటికీ అది సాధ్యం కాలేదు. పహల్గాం ఊచకోతలకు ప్రతీకారంగా భారత్, పాకిస్థాన్‌ల మధ్య రగుల్కొనే సైనిక ఘర్షణల గురించి ఈ యుద్ధోన్మాదులు అసాధారణ ఊహలు చేశారు. భారత సైనిక దళాలు పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకుంటాయని, బంగ్లాదేశ్‌ను విముక్తం చేసినట్లుగానే బలూచిస్థాన్‌ను పాకిస్థాన్ శృంఖలాల నుంచి విడిపిస్తాయని వారు ఆశించారు. కానీ, ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్‌కు భారీ నష్టాలు వాటిల్లాయని నిరూపించే గట్టి సాక్ష్యాధారాలు ఏవీ ప్రజల దృష్టికి రాలేదు. పైగా పాకిస్థాన్‌ను చావుదెబ్బకొట్టే అవకాశం వచ్చినా కూడా, అంతలోగానే అమెరికా ఒత్తిడికి మోదీ ప్రభుత్వం లొంగిపోయి కాల్పుల విరమణకు అంగీకరించిందనే అభిప్రాయం ప్రజలకు కలిగింది. ప్రధానమంత్రి వ్యవహరించిన తీరుపట్ల అసంతృప్తితో సామాజిక మాధ్యమాలలో ట్వీట్లు వెల్లువెత్తాయి. కాల్పుల విరమణను ప్రకటించిన విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి, ఆయన కుటుంబ సభ్యులకు వ్యతిరేకంగా కూడా పోకిరీ వ్యాఖ్యలు వెల్లువెత్తాయి. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా పవిత్ర యుద్ధాన్ని ప్రారంభించాలని సంఖ్యానేకులు డిమాండ్ చేశారు. ఈ ధోరణులకు వ్యతిరేకంగా మే 13 రాత్రి మోదీ చాలా కఠినంగా మాట్లాడినప్పటికీ, ఆయన మాటలు వారి ఆవేశాన్ని తగ్గించలేకపోవచ్చు.

కశ్మీర్‌పై పాకిస్థాన్‌తో ఘర్షించడంలో ముందుకు సాగడంపై తమ మద్దతుదారుల ఆకాంక్షలు, అంచనాలను సహేతుకంగా ఉండేలా చేయడంలో ప్రధానమంత్రి, పాలక బీజేపీ చాలా కృషి చేయవలసిన అవసరమున్నది. తీవ్ర జాతీయవాద ఉన్మాదం లేదా దేశీయ రాజకీయాలలో తన ప్రభావ ప్రాబల్యాలు నిర్దేశించే విధానాలను అనుసరించడం వల్ల ఎదురయ్యే ప్రమాదాల గురించి ప్రధాని మోదీకి కచ్చితంగా తెలుసు. పాకిస్థాన్ సమీప భవిష్యత్తులో ఉగ్రవాద, సైనిక దుస్సాహసాలకు పాల్పడే అవకాశం లేదు కనుక భారత్‌కు తక్షణ సవాళ్లు దౌత్య రంగంలోనే ఎదురవుతాయి. అణుయుద్ధం కొద్దిలో తప్పిపోయిందని చెప్పడం ద్వారా కశ్మీర్ వివాదాన్ని అంతర్జాతీయ సమస్యగా చేసేందుకు ఇస్లామాబాద్ ప్రయత్నించి, సఫలమయ్యే అవకాశమున్నది. మే 7 అనంతరం చోటుచేసుకున్న పరిణామాలు స్పష్టం చేస్తున్న ప్రధానాంశం ఒకటి ఉన్నది. అది: అమెరికా అధ్యక్షుడుగా డొనాల్డ్ ట్రంప్ ఉన్నందున పాత వ్యూహాత్మక నిశ్చితాలు ఏవీ ఇక చెల్లుబాటు కావు. అంతర్జాతీయ వ్యవహారాలలో తనను తాను ఒక స్వతంత్ర శక్తిగా పరిగణించుకుంటున్న ఇండియా తాత్కాలికంగా ప్రతికూలతలను ఎదుర్కోవలసి రావడం తప్పనిసరి. కశ్మీర్ వివాదంలో అంతర్జాతీయ మధ్యవర్తిత్వాన్ని పాకిస్థాన్ మొదటి నుంచీ అంగీకరిస్తున్న దృష్ట్యా భారత్ సంక్లిష్ట సవాళ్లను ఎదుర్కోవలిసి ఉంటుంది. ఈ వాస్తవాల దృష్ట్యా భారత్ దౌత్య వ్యూహాలు పటిష్ఠంగా ఉండాలి. అంతర్జాతీయ వేదికలపై పాకిస్థాన్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రధానమంత్రి స్వయంగా చొరవ తీసుకోవాలి.

## అదే పల్లవి... భారత్-పాక్ కాల్పుల విరమణపై

# మరోసారి ట్రంప్ వ్యాఖ్యలు

భారత్-పాక్ కాల్పుల విరమణపై ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు

తాను జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దానని వెల్లడి

భారత్ వాదనలను తోసిపుచ్చిన అమెరికా అధ్యక్షుడు

వాణిజ్య చర్చలతోనే సంధి కుదిరిందని వ్యాఖ్య

ట్రంప్ ప్రకటనలను ఖండించిన భారత ప్రభుత్వం

కశ్మీర్ అంశంలో మూడో వ్యక్తి జోక్యం వద్దని భారత్ స్పష్టీకరణ





ఢిల్లీ: భారత్, పాకిస్థాన్ మధ్య ఇటీవల కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంలో తనదే కీలక పాత్ర అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వ్యాఖ్యానించారు. అమెరికా మధ్యవర్తిత్వంతోనే ఇది సాధ్యమైందని ఆయన చెప్పుకొచ్చారు. అయితే, ఈ వాదనలను భారత ప్రభుత్వం ఇప్పటికే పలుమార్లు ఖండించినప్పటికీ, ట్రంప్ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. తాజాగా ఖతార్‌లోని అమెరికా సైనిక స్థావరంలో సైనికులను ఉద్దేశించి ఆయన చేసిన ప్రసంగంలో ఈ వ్యాఖ్యలు చేశారు. "గతవారం భారత్, పాకిస్థాన్ మధ్య మరింత ఉద్రిక్తంగా మారుతున్న సమస్యను పరిష్కరించడంలో నేను కచ్చితంగా సహాయం చేశాను. నేను చేశానని చెప్పడం కాదు కానీ... పరిస్థితి మరింత దిగజారి, వివిధ రకాల క్షిపణుల దాడులు జరిగే ప్రమాదం ఉండేది. మేం దాన్ని అదుపులోకి తెచ్చాం" అని ట్రంప్ అన్నారు. ఇరు దేశాలతో వాణిజ్యం గురించి మాట్లాడామని, "యుద్ధం వద్దు, వాణిజ్యం చేద్దాం" అని తాను సూచించానని, దీనికి పాకిస్థాన్, భారత్ రెండూ సంతోషంగా అంగీకరించాయని ట్రంప్ తెలిపారు. "వారు దాదాపు వెయ్యేళ్లుగా పోరాడుతున్నారు. నేను దాన్ని పరిష్కరించగలను అన్నాను. నేను దేన్నైనా పరిష్కరించగలను. నన్ను పరిష్కరించనివ్వండి అన్నాను, మేం దాన్ని పరిష్కరించాం. అందరూ చాలా సంతోషంగా ఉన్నారు" అని ట్రంప్ వివరించారు. అయితే, కాల్పుల విరమణ ఒప్పందానికి, అమెరికాతో వాణిజ్య చర్చలకు ఎలాంటి సంబంధం లేదని భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ ఇప్పటికే స్పష్టం చేశారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం చర్చల దశలోనే ఉందని, ఏదీ ఇంకా ఖరారు కాలేదని ఆయన గతంలో తెలిపారు. "చాలా అంశాలు ముడిపడి ఉన్నాయని, అన్నీ ఓ కొలిక్కి వచ్చే వరకు ఏదీ నిర్ణయించలేం" అని జైశంకర్ పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య శాంతిని నెలకొల్పిన ఘనతను దక్కించుకోవడానికి ట్రంప్ ప్రయత్నించడం ఇది నాలుగోసారి కావడం గమనార్హం. ట్రంప్ ఉప అధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా ఆయన వాదనలకు మద్దతు పలికారు. భారత్, పాక్‌ల మధ్య అణు యుద్ధం ముప్పును తాను నివారించానని ట్రంప్ పలుమార్లు చెప్పుకొచ్చారు. అయితే, అలాంటి అణు ఉద్రిక్తతలు ఏవీ లేవని భారత్ స్పష్టం చేసింది. అంతేకాకుండా, దీర్ఘకాలంగా ఉన్న కశ్మీర్ సమస్య పరిష్కారానికి మధ్యవర్తిత్వం చేస్తానన్న ట్రంప్ ప్రతిపాదనను కూడా భారత్ సున్నితంగా తిరస్కరించింది. కశ్మీర్ విషయంలో మూడో వ్యక్తి జోక్యం అవసరం లేదని భారత్ ఎప్పటినుంచో స్పష్టం చేస్తోంది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను ఖాళీ చేయాలన్నదే తమ ప్రధాన డిమాండ్ అని భారత్ తేల్చిచెప్పింది. ట్రంప్ వాదనలను భారత మాజీ దౌత్యవేత్త కేపీ ఫాబియన్ కూడా ప్రశ్నించారు. "అమెరికా మధ్యవర్తిత్వం వహించలేదు. వారు పాకిస్థాన్‌ను ఒప్పించి ఉండొచ్చు... కానీ మాతో మాట్లాడమని అమెరికా చెప్పలేదు" అని ఆయన ఓ వార్తా సంస్థతో అన్నారు. మే 10న ప్రకటించిన ఈ కాల్పుల విరమణ ఒప్పందం, భారత గగనతలంలోకి పాకిస్థాన్ చొరబాట్లకు ప్రతిగా పాక్ సైనిక స్థావరాలపై భారత దాడుల అనంతరం కుదిరింది. ఈ ఒప్పందం మే 18 ఆదివారం వరకు పొడిగించబడింది.

# ఏపీ లిక్కర్ స్కాంలో కీలక పరిణామం...

## ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి అరెస్ట్

మూడు రోజుల సిట్ విచారణ అనంతరం అరెస్టు చేసిన అధికారులు

ముందస్తు బెయిల్ పిటిషన్లను కొట్టివేసిన సుప్రీంకోర్టు

ఈ కేసులో ఏ31, ఏ32 నిందితులుగా ఉన్న ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి







అమరావతి: ఏపీ లిక్కర్ స్కాం కేసు దర్యాప్తులో నేడు కీలక పరిణామం చోటుచేసుకుంది. సుదీర్ఘ విచారణ అనంతరం, నాటి ముఖ్యమంత్రి కార్యదర్శిగా పనిచేసిన ధనుంజయ్‌రెడ్డితో పాటు, అప్పటి సీఎం ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డిని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మూడు రోజుల పాటు వీరిని విచారించిన సిట్ అధికారులు, మద్యం కుంభకోణంలో వీరి ప్రమేయంపై స్పష్టత వచ్చిన తర్వాత ఈ సాయంత్రం అరెస్టు చేసినట్లు వెల్లడించారు. దాదాపు తొమ్మిది గంటల పాటు వీరిద్దరినీ సిట్ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. ఈ కేసులో ధనుంజయ్‌రెడ్డి ఏ31 నిందితుడిగా, కృష్ణమోహన్‌రెడ్డి ఏ32 నిందితుడిగా ఉన్నారు. కాగా, ఇదే కేసులో వీరికి ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్లను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. పిటిషనర్లకు వ్యతిరేకంగా తగిన ఆధారాలు ఉన్నాయని, దర్యాప్తు కీలక దశలో ఉన్నందున ఈ సమయంలో ముందస్తు బెయిల్ ఇవ్వలేమని జస్టిస్ పార్థీవాలా నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే అది దర్యాప్తు అధికారి విచారణకు ఆటంకం కలిగించినట్లు అవుతుందని అభిప్రాయపడింది. అంతకుముందు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కూడా వీరి ముందస్తు బెయిల్ అభ్యర్థనను తిరస్కరించగా, ఆ తీర్పును సవాల్ చేస్తూ వీరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే, రెగ్యులర్ బెయిల్ కోసం నిబంధనలు, మెరిట్స్ ఆధారంగా హైకోర్టు లేదా ట్రయల్ కోర్టును ఆశ్రయించవచ్చని సుప్రీంకోర్టు సూచించింది. వేల కోట్ల రూపాయల మద్యం కుంభకోణంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ కేసులో, నాటి సీఎంవో కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డి, జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డితో పాటు భారతి సిమెంట్స్ పూర్తికాలపు డైరెక్టర్ గోవిందప్ప బాలాజీలను కూడా సిట్ ఇటీవల నిందితుల జాబితాలో చేర్చింది. ఈ కేసులో ఏ33 నిందితుడిగా ఉన్న గోవిందప్ప బాలాజీని సిట్ అధికారులు మంగళవారమే అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. గతంలో ఈ కేసుకు సంబంధించి మే 16 వరకు తదుపరి చర్యలు చేపట్టవద్దని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ, విచారణకు హాజరుకావాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే విజయవాడలోని సిట్ కార్యాలయంలో గత మూడు రోజులుగా వీరి విచారణ కొనసాగింది. తాజాగా సుప్రీంకోర్టు ముందస్తు బెయిల్ నిరాకరించడంతో వీరి అరెస్టుకు మార్గం సుగమమైంది.

# ఏఐ వ్యవస్థలను వాటి పాటికి వాటిని వదిలేస్తే ఏం జరుగుతుంది?

సొంతంగా సమాజాలు ఏర్పాటు చేసుకోగలవని తేలిన ఏఐ వ్యవస్థలు

పరస్పర చర్చలతో ప్రత్యేక భాషా నియమాలు, సంప్రదాయాల రూపకల్పన

మానవ సమూహాల మాదిరిగానే ఏఐలలోనూ సమష్టి ప్రవర్తన




లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ పరస్పర చర్యలపై శాస్త్రవేత్తల పరిశోధన ఏఐ భద్రత, మానవ విలువలకు అనుగుణంగా తీర్చిదిద్దడంలో ఈ ఫలితాలు కీలకం లామా, క్లాడ్ వంటి వివిధ ఏఐ మోడళ్లలోనూ ఇదే ప్రవర్తన నమోదు కృత్రిమ మేధస్సు (ఏఐ) సాంకేతికత శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత తరుణంలో, మరో ఆసక్తికరమైన విషయం వెలుగులోకి వచ్చింది. మనుషుల్లాగే ఏఐ వ్యవస్థలు కూడా తమకంటూ ప్రత్యేక సమాజాలను, భాషా నియమాలను, సంప్రదాయాలను ఏర్పాటు చేసుకోగలవని ఓ తాజా అధ్యయనం తేల్చింది. వాటిని వాటి మానాన వదిలేస్తే, అవి పరస్పరం సంప్రదింపులు జరుపుకుంటూ సొంత వ్యవస్థలను నిర్మించుకుంటాయని ఈ పరిశోధన స్పష్టం చేసింది. లండన్‌లోని సిటీ సెయింట్ జార్జ్ విశ్వవిద్యాలయం, కోపెన్‌హాగన్‌లోని ఐటీ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు సంయుక్తంగా ఈ పరిశోధన నిర్వహించారు. ఏఐ సాధనాలకు వెన్నెముకగా నిలుస్తున్న లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ ఒకదానితో ఒకటి ఎలా సంకర్షణ చెందుతాయో అర్థం చేసుకోవడమే ఈ అధ్యయనం ముఖ్య ఉద్దేశం. ఈ పరిశోధన వివరాలు 'సైన్స్ అడ్వాన్సెస్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. పరిశోధకులు ఈ ప్రయోగం కోసం ఒక 'నేమింగ్ గేమ్' (పేర్లు పెట్టే ఆట)ను ఉపయోగించారు. ఇందులో ఏఐ ఏజెంట్లు కొన్ని పేర్ల సముదాయం నుంచి పేర్లను ఎంచుకోవాల్సి ఉంటుంది. ఒకే పేరును ఎంచుకున్నందుకు వాటికి ప్రోత్సాహకాలు లభిస్తాయి. కాలక్రమేణా, ఎలాంటి స్పష్టమైన మార్గదర్శకత్వం లేకుండానే ఏఐ ఏజెంట్లు ఉమ్మడి సంప్రదాయాలను, పక్షపాతాలను అభివృద్ధి చేసుకున్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. మానవులు కూడా ఒకే రకమైన నిబంధనలకు కట్టుబడి ఉండే అలవాటును ఏఐ ఏజెంట్లు అనుకరించాయని పరిశోధకులు తెలిపారు. అంతేకాకుండా, ఓ చిన్న ఏఐ ఏజెంట్ల సమూహం, పెద్ద సమూహాన్ని ఒక నిర్దిష్ట సంప్రదాయం వైపు నడిపించడం కూడా సాధ్యమైందని, ఇలాంటి లక్షణం తరచుగా మానవ సమూహాల్లో కనిపిస్తుందని వారు పేర్కొన్నారు. "మా ఫలితాలు ఏఐ వ్యవస్థలు ఎలాంటి బాహ్య ప్రోగ్రామింగ్ లేకుండా స్వయంప్రతిపత్తితో సామాజిక సంప్రదాయాలను అభివృద్ధి చేసుకోగలవని చూపిస్తున్నాయి. మానవ విలువలు, సామాజిక లక్ష్యాలకు అనుగుణంగా ఏఐ వ్యవస్థలను రూపొందించడంలో ఈ ఫలితాలు ముఖ్యమైనవి" అని అధ్యయనం నొక్కి చెప్పింది. లామా-2-70బి-చాట్, లామా-3-70బి-ఇన్‌స్ట్రక్ట్, లామా-3.1-70బి-ఇన్‌స్ట్రక్ట్, క్లాడ్-3.5-సోనెట్ వంటి నాలుగు వేర్వేరు రకాల ఎల్‌ఎల్‌ఎంలను ఉపయోగించినప్పుడు కూడా ఫలితాలు స్థిరంగా ఉన్నాయని పరిశోధకులు తెలిపారు.

### నైతికపరమైన అంశాలు, భవిష్యత్తు

సమాజం నుంచి పొందిన పక్షపాతాలను వ్యాప్తి చేసే ఎల్‌ఎల్‌ఎం ఏఐల వల్ల తలెత్తే కొన్ని నైతిక ప్రమాదాలను ఎదుర్కోవడానికి తమ పరిశోధన ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఈ అధ్యయనం సీనియర్ రచయిత ఆండ్రియా బారోన్‌చెల్లి మాట్లాడుతూ, "ఈ అధ్యయనం ఏఐ భద్రతా పరిశోధనలకు కొత్త మార్గాలను తెరుస్తుంది. మనతో సంకర్షణ చెందడం ప్రారంభించిన ఈ కొత్త రకం ఏజెంట్ల ప్రభావం ఎంత లోతుగా ఉంటుందో ఇది చూపుతుంది. ఇవి మన భవిష్యత్తును కూడా ప్రభావితం చేస్తాయి" అని అన్నారు. "మనం ఏఐ కేవలం మాట్లాడటమే కాకుండా, మనలాగే చర్చలు జరిపే, సర్దుకుపోయే, కొన్నిసార్లు ఉమ్మడి ప్రవర్తనలపై విభేదించే ప్రపంచంలోకి ప్రవేశిస్తున్నాం" అని ఆయన జోడించారు.

## 'హరీష్ పై కేటీఆర్‌కు ఎందుకంత ప్రేమో..'



హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీలో ముసలం మొదలైందంటూ ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్ విమర్శించారు. కల్వకుంట్ల కుటుంబంలో విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయని స్పష్టం చేసిన రామచంద్రనాయక్.. ఎప్పుడూ లేని విధంగా హరీష్ రావు ఇంటికి కేటీఆర్ వెళ్లడమే ఉదాహరణగా చెప్పుకొచ్చారు. 'పార్టీ ప్లీనరీ సమయంలో హరీష్ రావు కు ప్రాధాన్యత ఇవ్వకుండా ఆయనకు అంత సీను లేదని చెప్పారు. రెండు గంటలకు పైగా హరీష్ రావుతో చర్చలు జరిపారు. గతంలో ఎప్పుడూ హరీష్ రావు ఇంటికి కేటీఆర్ వెళ్లలేదు.హరీష్ రావు ఇంట్లో గతంలో పంక్షన్ జరిగినా కేటీఆర్, ఆయన కుటుంబం దూరంగా ఉంటూ వచ్చింది. ఇప్పుడు సడన్‌గా హరీష్ రావు పైన కేటీఆర్‌కు ఎందుకంత ప్రేమ వచ్చిందో చెప్పాలి. హరీష్ రావు కొత్త పార్టీ పెడుతున్నాడని ప్రచారం జరుగుతోంది. కల్వకుంట్ల కవిత ఇప్పటికే పార్టీ కి వ్యతిరేకంగా బహిరంగంగా విమర్శలు చేస్తున్నాడు. తన మీద దుష్ప్రచారం జరుగుతోందని, దాని వెనుక ఎవరున్నారో తనకు తెలుసునని కవిత అంటోంది. మొత్తంగా కల్వకుంట్ల కుటుంబ సభ్యుల మధ్య ఆధిపత్యపోరు జరుగుతోంది. రాజకీయ ఆధిపత్యం కోసం కొట్లాడుకుంటున్నారు. హరీష్ రావు తో చర్చల మతలబు ఏమిటో ప్రజలకు కేటీఆర్ చెప్పాలి' అని డిమాండ్ చేశారు. హరీష్‌రావు నివాసానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెళ్లారు. సుమారు రెండు గంటల పాటు హరీష్‌తో భేటీ అయ్యారు. ఇటీవల అస్వస్థతకు గురైన హరీష్ రావు తండ్రి ఆరోగ్య వివరాలను కేటీఆర్ అడిగి తెలుసుకున్నారు. కోకాపేట హరీష్‌రావు నివాసంలో సమావేశమైన ఇరువురు నేతలు.. తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. హరీష్ రావు పార్టీ మారతారన్న ప్రచారంపై సైబర్ సెల్‌కు బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. తాను పార్టీ లైన్ దాటనని ఇటీవల హరీష్‌రావు ప్రకటించారు. కేసీఆర్ నాయకత్వంలో పనిచేస్తానని హరీష్‌రావు మరోసారి స్పష్టం చేశారు. కేటీఆర్‌కు పార్టీ పగ్గాలు అప్పగించిన కానీ.. పని చేస్తానని హరీష్‌రావు తెలిపారు. వరంగల్ సభ తర్వాత పార్టీలో హరీష్‌రావు ప్రాముఖ్యత తగ్గిందంటూ జరుగుతున్న తప్పుడు ప్రచారంపై బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం మండిపడుతోంది. దీంతో నేరుగా హరీష్ రావుతో మాట్లాడి సమస్యకు ఫుల్ స్టాప్ పెట్టాలనే ఉద్దేశ్యంతోనే కేటీఆర్ సమావేశమైనట్లు సమాచారం.

## 'సీఎంకు, డిప్యూటీ సీఎంకు మధ్య విబేధాలు'



హైదరాబాద్: రాష్ట్రం దివాలా తీసిందన్న సీఎం రేవంత్ వ్యాఖ్యలపై మంత్రి వర్గం అసంతృప్తిగా ఉందన్నారు బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి. శుక్రవారం మీడియాతో చిట్ చాట్ లో భాగంగా మాట్టాడుతూ..' సీఎం రేవంత్ కు, డిప్యూటీ సీఎంకు మధ్య విబేధాలు ఉన్నాయి. అందుకే సీఎం కామెంట్స్ ను మంత్రులు ఎవరూ సమర్థించలేదు. తెలంగాణ రాష్ట్ర కేబినెట్ రెండుగా చీలిపోయింది. రేవంత్ వ్యాఖ్యలతో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రాదని ఒరిజినల్ కాంగ్రెస్ మంత్రులు బాధపడుతున్నారు. మంత్రి వర్గ విస్తరణను సీఎం రేవంత్ అడ్డుకుంటున్నారు. కొత్తగా వచ్చేవారు సైతం వ్యతిరేకంగా ఉంటారని సీఎం రేవంత్ భావన. అందుకే గందరగోళ నివేదికలు హైకమాండ్ కి పంపి అడ్డుకుంటున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తే ఎక్కడ బీసీలకు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాల్సి వస్తుందోనని జగన్నాటకం ఆడుతున్నారు. రేవంత్ లోపాలు, తప్పిదాలు అన్ని హైకమాండ్ దగ్గర ఉన్నాయి. లోకల్ బాడీ ఎన్నికలు జరిగితే సీఎంను మార్చాలని హైకమాండ్ ఎదురుచూస్తోంది' అని మహేశ్వర్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## 'హైదరాబాద్‌లో డేటా సిటీ ఏర్పాటు చేయబోతున్నాం'

### విద్యుత్ శాఖపై సీఎం రేవంత్ సమీక్ష



హైదరాబాద్: వచ్చే మూడేళ్లలో ప్రభుత్వం తీసుకువచ్చే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల వల్ల విద్యుత్ డిమాండ్ పెరుగుతుందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. వచ్చే మూడేళ్ల విద్యుత్ అవసరాల కోసం ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. శుక్రవారం విద్యుత్ శాఖపై సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. దీనిలో భాగంగా ఈ ఏడాది అత్యధికంగా 17, 162 మెగా వాట్లకు విద్యుత్ డిమాండ్ చేరుకుందని సీఎం రేవంత్ కు అధికారులు వివరించారు. గత ఏడాదితో పోలిస్తే విద్యుత్ డిమాండ్ 9.8 శాతం పెరిగిందన్నారు. 2025-26 లో 18,138 మెగావాట్లకు డిమాండ్ పెరుగుతుందని, 2034..35 నాటికి 31,808 మెగావాట్ల కు విద్యుత్ డిమాండ్ చేరుకుంటుందన్నారు. ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ ను అందిస్తున్నట్లు సీఎం రేవంత్ కు అధికారులు వివరించారు. ఈ మేరకు సీఎం రేవంత్ మాట్లాడుతూ.. 'వచ్చే మూడేళ్లలో ప్రభుత్వం తీసుకువచ్చే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల వల్ల విద్యుత్ డిమాండ్ పెరుగుతుంది. వచ్చే మూడేళ్ల విద్యుత్ అవసరాల కోసం ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. రాష్ట్రంలో నిర్మించే నీటిపారుదల ప్రాజెక్టుల విద్యుత్ అవసరాలను దృష్టి లో ఉంచుకోవాలి. రైల్వే లైన్లు, మెట్రో , ఇతర మాస్ ట్రాన్స్ పోర్ట్ ల విద్యుత్ అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలి. గ్రేటర్ హైదరాబాద్ తో పాటు ఇతర కార్పొరేషన్ల విద్యుత్ అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలి. కొత్త గా ఏర్పాటు చేయబోయే డేటా సెంటర్లు, పారిశ్రామిక వాడలకు కావాల్సిన విద్యుత్ అవసరాలను దృష్టి లో ఉంచుకోవాలి. భవిష్యత్తులో హైదరాబాద్ డేటా సెంటర్ల హబ్‌గా మారబోతోంది. హైదరాబాద్ లో డేటా సిటీ ఏర్పాటు చేయబోతున్నాం. రీజనల్ రింగ్ రోడ్డు పరిధి లో నిర్మించే రేడియల్ రోడ్లు, శాటిలైట్ టౌన్ షిప్ లకు కావాల్సిన విద్యుత్ అవసరాలపైన హెచ్ఎండీఏ తో సమన్వయం చేసుకోవాలి. క్షేత్రస్థాయిలో విద్యుత్ డిమాండ్ కు అనుగుణంగా సబ్ స్టేషన్లను అప్ గ్రేడ్ చేసుకోవాలి. విద్యుత్ లైన్ల ఆధునీకరణ పైన దృష్టి సారించాలి. ఫ్యూచర్ సిటీ లో పూర్తి భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలి. ఫ్యూచర్ సిటీలో విద్యుత్ టవర్లు, పోల్స్, లైన్స్ బహిరంగంగా కనిపించడానికి వీలులేదు.. హై టెన్షన్ లైన్ల ను కూడా అక్కడి నుంచి తరలించాల్సి ఉంటుంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో స్మార్ట్ పోల్స్ ను ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేయాలి. సెక్రటేరియట్, నెక్లెస్ రోడ్, కేబీఆర్ పార్కు వంటి ప్రాంతాల్లో స్మార్ట్ పోల్స్ ను తీసుకురావాలి. 160 కిలో మీటర్ల అవుటర్ రింగ్ రోడ్ లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి కోసం కావాల్సిన ప్రణాళికలను సిద్ధం చేయాలి. జీహెచ్ఎంసీ పరిధిలోని ఫుట్ పాత్ లు, నాలాల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఉన్న అవకాశాలను పరిశీలించాలి' అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

## గూగుల్ కొత్త ఫీచర్.. కొట్టేసిన ఫోన్ పనిచేయదు!



ఫోన్ల చోరీకి చెక్ పెట్టేందుకు గూగుల్ కొత్త ఫీచర్‌ను తీసుకురాబోతోంది. చోరీకి గురైన ఫోన్లను దాదాపు నిరుపయోగంగా మార్చే లక్ష్యంతో గూగుల్ ఆండ్రాయిడ్ 16తో ముఖ్యమైన యాంటీ-థెఫ్ట్ ఫీచర్‌ను ప్రవేశపెట్టబోతోంది. ఈ అప్‌డేట్‌లో మెరుగైన భద్రతా సాధనాలు ఉంటాయి. ఇవి "ఓనర్ అనుమతి లేకుండా రీసెట్ చేసిన ఫోన్‌లు పనిచేయకుండా అవుతాయి" అని ఆండ్రాయిడ్ పరికరాల సమాచారాన్ని తెలిపే 'ఆండ్రాయిడ్ పోలీస్' అనే వెబ్‌సైట్ నివేదిక తెలిపింది. గూగుల్ ఇటీవల 'ది ఆండ్రాయిడ్ షో: ఐ/ఓ ఎడిషన్' సందర్భంగా ఈ కొత్త ఫీచర్‌ను ఆవిష్కరించింది. ఇది ప్రాథమికంగా ఫ్యాక్టరీ రీసెట్ ప్రొటెక్షన్ (ఎఫ్ఆర్‌పీ) ను పెంచుతుంది. ఇది చోరీకి గురైన ఫోన్లను నిరుపయోగంగా చేయడానికి రూపొందించిన భద్రతా ఫీచర్. గూగుల్ ఆండ్రాయిడ్ 15 లో ఎఫ్ఆర్‌పీకి అనేక మెరుగుదలలు చేసింది. తదుపరి ఆండ్రాయిడ్ అప్డేట్ దీనిని మరింత బలోపేతం చేస్తుంది. ఈ కొత్త ఫీచర్ గురించి గూగుల్ అధికారికంగా ఏమీ చెప్పనప్పటికీ, గూగుల్ ప్రణాళికలను తెలియజేసే ఒక స్క్రీన్ షాట్ ను ఆండ్రాయిడ్ పోలీస్ పబ్లిష్ చేసింది. ఈ స్క్రీన్ షాట్ ఫోన్ స్క్రీన్ పై ఫ్యాక్టరీ రీసెట్ వార్నింగ్ ఫ్లాషింగ్ ను చూపిస్తోంది. ఫోన్‌ను దొంగిలించినవారు ఒకవేళ సెటప్ విజార్డ్ ను చేయకపోతే రీసెట్ చేయకుండా ముందుకెళ్లలేరు. అంటే యూజర్ ఫోన్‌ను రీసెట్ చేసి మునుపటి లాక్ స్క్రీన్ లాక్ లేదా గూగుల్ ఖాతా క్రెడెన్షియల్స్‌ను నమోదు చేసే వరకు ఫోన్ పనిచేయదు. ఆండ్రాయిడ్ పోలీస్ ప్రకారం.. కొత్త ఫీచర్ ఈ సంవత్సరం చివరలో విడుదలయ్యే అవకాశం ఉంది.

## ముక్తిదాయకం.. పుష్కర స్నానం



కాళేశ్వర క్షేత్రానికి ఎంతో విశిష్టత ఉంది. ఇక్కడ గోదావరి, ప్రాణహిత నదులు సంగమిస్తాయి. ఈ సంగమ స్థానంలోనే అంతర్వాహినిగా సరస్వతీ నది కూడా కలుస్తుందని నమ్ముతారు. అందుకే కాళేశ్వరాన్ని దక్షిణ కాశిగా పిలుస్తారు. ఇక్కడ శివలింగంతోపాటు యమలింగం కూడా ఉండటం విశేషం. పూర్వం యముడు మనుషుల పాపాలను తొలగించి వారికి ముక్తిని ప్రసాదించమని శివుడిని ప్రార్థించగా, శివుడు ఆ కోరికను మన్నించాడు. అందువల్ల ఇక్కడ ఒకే పానవట్టంపై రెండు లింగాలు కొలువై ఉన్నాయి. కాళేశ్వరంలో సరస్వతీ నది గుప్త కామినిగా ప్రవహిస్తుందని చెబుతారు. ఆలయంలో శివలింగంపై పోసిన నీరు, ఆ లింగంలోని నాసికా రంధ్రాల ద్వారా భూమార్గంలో ప్రవహించి గోదావరి, ప్రాణహిత నదులతో కలుస్తుంది. అందుకే ఇక్కడ సరస్వతీ పుష్కరాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. కాళేశ్వరం పెద్దల పిండ ప్రదానానికి కూడా ముఖ్యమైన క్షేత్రం. కాశికి వెళ్లలేనివారు ఇక్కడ గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల త్రివేణి సంగమంలో వైదిక కార్యక్రమాలు నిర్వహించుకుంటారు. ఇది కాశిలో జరిపినంత పుణ్యప్రదమని విశ్వసిస్తారు. అలాగే, కాళేశ్వరంలో దక్షిణ భారతదేశంలోనే అరుదైన సరస్వతీ దేవి ఆలయాలలో ఒకటి ఉంది. మరొక అరుదైన సూర్యదేవాలయం కూడా ఇక్కడే కొలువై ఉండటం విశేషం. 'మేషే గంగా వృషే రేవా మిథునేతు సరస్వతీ కర్కటే యమునా ప్రోక్తా సింహే గోదావరీ స్మృతా కన్యాయాం కృష్ణవేణీచ కావేరీ ధటకే స్మృతా వృశ్చికే తామ్రపర్ణీచ చాపే పుష్కర వాహినీ మకరే తుంగభద్రాచ కుంభే సింధునదీ స్మృతా మీనే ప్రణీతా నదీచ గురోస్సంక్రమణే స్మృతా పుష్కరాఖ్యో మునీనాంహి బుధై స్మృతా' దేవగురువగు బృహస్పతి మేష రాశిలో ఉన్నప్పుడు గంగానదికి, వృషభరాశిలో ఉన్నప్పుడు నర్మదా నదికి, మిథున రాశిలో ఉన్నప్పుడు సరస్వతీ నదికి, కర్కాటక రాశిలో ఉన్నప్పుడు యమునా నదికి, సింహరాశిలో ఉన్నప్పుడు గోదావరి నదికి, కన్యారాశిలో ఉన్నప్పుడు కృష్ణా నదికి, తులారాశిలో ఉన్నప్పుడు కావేరి నదికి, వృశ్చిక రాశిలో ఉన్నప్పుడు తామ్రపర్ణి నదికి, ధనూరాశిలో ఉన్నప్పుడు బ్రహ్మపుత్రకు, మకర రాశిలో ఉన్నప్పుడు తుంగభద్రా నదికి, కుంభరాశిలో ఉన్నప్పుడు సింధునదికి, మీనరాశిలో ఉన్నప్పుడు ప్రణీతా నదికి పుష్కరాలు చెప్పబడ్డాయి. పుష్కరం అనగా జలస్వరూపం జలాది దేవతగా సమస్త తీర్థములకు నెలవై ఉండి తీర్థరాజు అను పేరుతో లోకకళ్యాణ కారకు డైనట్లు శాస్త్రములు తెలుపుతున్నాయి. పూర్వం తుందిలుడనే బ్రహ్మణోత్తముడు మహేశ్వరుని గూర్చి తపస్సు చేసి తన అష్ట-మూర్తులతో ఒకటైన జల స్వరూపంతో పుష్కరుడు అను నామముతో పరమ శివుని ఐక్యమై ఉండుటకు వరం పొంది, పరమేశ్వరుని సాయుజ్యం పొంది ఉండగా బ్రహ్మదేవుడు సృష్టిని శక్తివంతం చేయుటకై శివుని వరంతో ఆ పుష్కరుని స్వీకరించి, తన కమండలంలో ఉంచుకొని సృష్టికార్యం నిర్వహిస్తుండగా, బృహస్పతి బ్రహ్మను వేడుకొని ఆ పుష్కరుని తన వెంట ఉండుటకై వరమును కోరెను. గ్రహధి పత్యమును, ముక్కోటి దేవతలకు గురువుగాను ఆ పుష్కరుని సన్నిధిని శక్తివంతుడై యుండునట్లు కోరుకొనగా పుష్కరుడు బ్రహ్మను వీడి రాకకు సమ్మతించక పోగా బ్రహ్మదేవుడు, ఆ పుష్కరుని కోరికపై ముక్కోటి దేవతలతో మూడున్నర కోట్ల తీర్థములతో, మహర్షులతో, ఆ పుష్కరుని వెంట ఉండి, బృహస్పతి, ఆయా రాసులలో (మేషాది రాసులలో) చరించుచున్నప్పుడు ఆయా నదులకు (మేషేచ -గంగా) అను సూత్రానుసారం పుష్కరాలు నిర్వహిస్తారు. ప్రతి నదికి ప్రతి పన్నెండు సంవత్సరాలకు ఒకసారి పన్నెండు రోజులపాటు పుష్కరాలను ఎంతో వైభవంగా నిర్వహించే కార్యక్రమాలలో భాగంగా 2025 మే 15 నుంచి మే 26 వరకు సరస్వతీ నది పుష్కరాలు నిర్వహిస్తారు. సరస్వతీ నది హిందూ పురాణాలలో ఒక ముఖ్యమైన నది. ఋగ్వేదంలో ఈ నదిని ఎంతో పవిత్రంగా కీర్తించారు. తూర్పున యమునా నది, పశ్చిమాన శతద్రూ నది దీనికి సరిహద్దులుగా ఉండేవి. అయితే, మహాభారత కాలానికి ఈ నది ఎండిపోయినట్లు చెబుతారు. ప్రస్తుతం సరస్వతి పేరుతో ఒక చిన్న నది ఘగ్గర్ నదికి ఉపనదిగా ప్రవహిస్తోంది. చాలా మంది పండితులు ప్రాచీన సరస్వతీ నది ఇదే అయి ఉండవచ్చని భావిస్తున్నారు. సరస్వతీ దేవి తొలుత నదీ దేవతగా ఆరాధింపబడి, తరువాత విద్య, జ్ఞాన, సంగీత, కళల అధిదేవతగా గుర్తింపు పొందింది. హిందువులు సరస్వతీ నదిని అంతర్వాహినిగా భావిస్తారు. గంగా, యమునా నదుల సంగమమైన త్రివేణి సంగమంలో సరస్వతి కూడా కలిసి ఉంటుందని విశ్వసిస్తారు. సరస్వతీ పుష్కరాల సమయంలో భక్తులు అనేక పవిత్ర కార్యకలాపాలలో పాల్గొంటారు. ధ్యానం చేయడం, సాంప్రదాయ ఆచారాలను పాటించడం, ప్రార్థనలు చేయడం, పవిత్ర స్నానాలు ఆచరించడం వంటివి ముఖ్యమైనవి. ఈ సమయంలో నదిలో స్నానం చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని, పాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్ముతారు. 2025లో జరగబోయే సరస్వతీ పుష్కరాలు బద్రీనాథ్ సమీపంలోని మానా గ్రామంలో ముఖ్యంగా జరగనున్నాయి. ఇక్కడ ఈ నది అలకనంద నదిలో కలుస్తుంది. అలాగే ప్రయాగరాజ్‌లో కూడా త్రివేణీ సంగమంలో పుష్కరాలు నిర్వహిస్తారు. అయితే, తెలంగాణ రాష్ట్రంలో కూడా సరస్వతీ పుష్కరాలను నిర్వహించడానికి నిర్ణయం తీసుకున్నారు. కరీంనగర్ జిల్లాలోని కాళేశ్వరంలో ఈ పుష్కరాలు జరగనున్నాయి. కాళేశ్వర క్షేత్రానికి ఎంతో విశిష్టత ఉంది. ఇక్కడ గోదావరి, ప్రాణహిత నదులు సంగమిస్తాయి. ఈ సంగమ స్థానంలోనే అంతర్వాహినిగా సరస్వతీ నది కూడా కలుస్తుందని నమ్ముతారు. అందుకే కాళేశ్వరాన్ని దక్షిణ కాశిగా పిలుస్తారు. ఇక్కడ శివలింగంతోపాటు యమలింగం కూడా ఉండటం విశేషం. పూర్వం యముడు మనుషుల పాపాలను తొలగించి వారికి ముక్తిని ప్రసాదించమని శివుడిని ప్రార్థించగా, శివుడు ఆ కోరికను మన్నించాడు. అందువల్ల ఇక్కడ ఒకే పానవట్టంపై రెండు లింగాలు కొలువై ఉన్నాయి. కాళేశ్వరంలో సరస్వతీ నది గుప్త కామినిగా ప్రవహిస్తుందని చెబుతారు. ఆలయంలో శివలింగంపై పోసిన నీరు, ఆ లింగంలోని నాసికా రంధ్రాల ద్వారా భూమార్గంలో ప్రవహించి గోదావరి, ప్రాణహిత నదులతో కలుస్తుంది. అందుకే ఇక్కడ సరస్వతీ పుష్కరాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. కాళేశ్వరం పెద్దల పిండ ప్రదానానికి కూడా ముఖ్యమైన క్షేత్రం. కాశికి వెళ్లలేనివారు ఇక్కడ గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల త్రివేణి సంగమంలో వైదిక కార్యక్రమాలు నిర్వహించుకుంటారు. ఇది కాశిలో జరిపినంత పుణ్యప్రదమని విశ్వసిస్తారు. అలాగే, కాళేశ్వరంలో దక్షిణ భారతదేశంలోనే అరుదైన సరస్వతీ దేవి ఆలయాలలో ఒకటి ఉంది. మరొక అరుదైన సూర్యదేవాలయం కూడా ఇక్కడే కొలువై ఉండటం విశేషం. పచ్చని ప్రకృతి మధ్య నెలకొని ఉన్న ఈ క్షేత్రం భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుంది. మొత్తం మీద, సరస్వతీ నదీ పుష్కరాలు ఒక పవిత్రమైన సందర్భం. ఇది నదీమాతకు కృతజ్ఞతలు తెలుపుకునే సమయం, ఆధ్యాత్మిక చింతనకు, పవిత్ర స్నానాలకు ప్రాధాన్యతనిచ్చే సమయం. కాళేశ్వరం వంటి క్షేత్రాలలో ఈ పుష్కరాలను నిర్వహించడం ఆ ప్రాంతానికి మరింత పవిత్రతను చేకూరుస్తుంది. భక్తులు ఈ సమయంలో పాల్గొని పుణ్యం పొందాలని ఆశిస్తారు. సరస్వతీ నది కేవలం ఒక నీటి ప్రవాహం కాదు. అది జ్ఞానానికి, వివేకానికి, పవిత్రతకు చిహ్నం. ఈ పుష్కరాల సమయంలో ఆ నదిలో స్నానం చేయడం ద్వారా భక్తులు తమ ఆంతరంగిక శుద్ధిని పొందుతారని విశ్వసిస్తారు. ఈ పవిత్రమైన కార్యక్రమంలో పాల్గొనడానికి భక్తులు దేశంలోని వివిధ ప్రాంతాల నుండి తరలివస్తారు. సరస్వతీ నదీ పుష్కరాలు ముక్తిని ప్రసాదించే ఒక గొప్ప అవకాశం.

## ట్రంప్ ఎవరికీ అర్థంకారు



డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్ష పదవి అంతర్జాతీయ సంబంధాల్లో వివాదాస్పద ప్రవర్తనలో ఇమిడి ఉంది. ట్రంప్ దౌత్య అతిక్రమణలు, అవమానకరమైన భాష, భారత్‌పాకిస్తాన్ వివాదంలో అనవసర జోక్యం, ధనిక దేశంగా లేదా సైనికశక్తి బలంగా ఉన్న దేశానికి ప్రపంచ పోలీసుగా వ్యవహరించే హక్కు ఉంటుందా? అనే ప్రశ్నలను లేవనెత్తుతుంది. ట్రంప్ బహిరంగ వ్యాఖ్యలు తరచుగా అసభ్యత, అవమానం దిశగా దిగజారుతుంటాయి. స్నేహితులు, శత్రువులు అనే విచక్షణ లేకుండా నిర్లక్ష్యంగా మాటలు మీరుతుంటారు. వాణిజ్య చర్చల్లో కెనడా, మెక్సికోలను అమెరికాను వాడుకునే దేశాలుగా పేర్కొన్నారు. సుంకాలతో బెదిరించి సన్నిహిత స్నేహ దేశాలతో సంబంధాలను దెబ్బతీశారు. యూరోపియన్ మిత్రదేశాలను అమెరికా సైనిక రక్షణపై ఆధారపడే ఉచిత సవారీదారులు అంటూ ఎగతాళి చేసి, నాటో దేశాలలో విశ్వాసాన్ని క్షీణింప జేశారు. ఆసియాలో ఉత్తర కొరియా నాయకుడు కిమ్ జోంగ్- ఉన్‌ను లిటిల్ రాకెట్ మాన్ అని హేళన చేసి, తర్వాత పొగడ్తలకు దిగడం దక్షిణ కొరియా, జపాన్‌ను గందరగోళానికి గురిచేసింది. ఇటువంటి పరుషమైన భాష వారి సహకారాన్ని పెంపొందించకపోగా మిత్రదేశాలను దూరం చేసింది. ట్రంప్ వ్యక్తి గత అహంకారం అమెరికా నైతిక ప్రతిష్టను గౌరవాన్ని తగ్గిస్తుంది. ఎక్స్‌లోని పోస్టులు ట్రంప్‌ను హిందీ సినిమాలో విలన్‌తో పోల్చాయి. ఆయన భాష ప్రపంచ నాయకుడి హోదాకి తగని విధంగా ఉందని అనేక దేశాల విజ్ఞులు విమర్శించారు. ఒక్క మాటలో చెప్పాలంటే 'అమెరికా గొప్పతనం' ట్రంప్ (పిచ్చోడి చేతిలో రాయిలా) తయారయింది. ఆయన నిలకడలేని మాటలు, ప్రవర్తన విదూషకుడిని తలపిస్తాయి. కశ్మీర్ విషయంలో ట్రంప్ అసంబద్ధ దౌత్యం స్పష్టంగా కనిపిస్తుంది. మొన్న ఆయన కశ్మీర్ వివాదంలో మధ్యవర్తిత్వం చేయగలనని, భారత ప్రధాని నరేంద్ర మోడీ తన సహాయం కోరారని పేర్కొన్నారు. భారత్ ప్రభుత్వం ఈ వాదనను ఖండించింది. ఇటీవల 2025 మేలో భారత్ ఆపరేషన్ సిందూర్, పాకిస్తాన్ ప్రతిస్పందనలతో ఉద్రిక్తతలు పెరిగినప్పుడు, ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' లో రెండు దేశాలు తన జోక్యంతో కాల్పుల విరమణకు అంగీకరించాయని ప్రకటించారు. ఈ వాదన ఆయన పాత్రను అతిశయోక్తిగా ప్రజలు అనుకుంటున్నారు. ఆయన మాటలు ద్వైపాక్షిక చర్చల గతిశీలతను పట్టించుకోలేదు. కశ్మీర్ భారత్‌లో అంతర్భాగం అనే విషయం మరచి అసందర్భంగా మాట్లాడటం హద్దు మీరటమే. మూడోపక్ష మధ్యవర్తిత్వాన్ని తిరస్కరిస్తున్నట్లు భారత్ స్థిరంగా ఏనాడో చెప్పింది. ఇప్పటికీ చెబుతోంది. ట్రంప్ కశ్మీర్ సమస్యను పరిష్కరిస్తాను అనే అనవసర ప్రతిపాదన భారత్ సార్వభౌమాధికారాన్ని అగౌరవ పరిచినట్టే. ఆయన మాటలు పాకిస్తాన్‌కు ఊతం ఇచ్చినట్లు అవుతుంది. 'ఎక్స్'లో నెటిజన్లు ట్రంప్ అతిగా జోక్యం చేసుకోవడాన్ని ఘాటుగా దుయ్యబట్టారు. కశ్మీర్ చరిత్రను సరిగ్గా అర్థం చేసుకోకుండా ఏదిపడితే అది మాట్లాడటం వదురుబోతు లక్షణంగా విమర్శించారు. ట్రంప్ జోక్యం అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించటమే. భారత సార్వభౌమాధికారాన్ని ధిక్కరించటమే అవుతుంది. అమెరికా ఆర్థికంగా బలమైన దేశం కావచ్చు. అలాగే సైనికశక్తి కూడా గొప్పగా ఉండవచ్చు. అంతమాత్రం చేత ఇతర దేశాల అంతర్గత లేదా ద్వైపాక్షిక వ్యవహారాల్లో జోక్యం చేసుకునే హక్కు, అధికారం ఆయనకు లేదు. అమెరికాకు ధనం, ఆయుధాలు, అణుబాంబులు ఉన్నంత మాత్రాన ట్రంప్‌కు ప్రపంచపై పోలీసు అధికారాన్ని ఇవ్వవు. ఐక్యరాజ్యసమితి చార్టర్‌లో సార్వభౌమాధికారం గల దేశాల స్వయం పరిపాలనను గౌరవించమని చెబుతుంది. అన్ని సార్వభౌమత్వం గల దేశాలు సమానమే. చిన్నదేశం అయినా, పెద్దదేశం అయినా సమానం హోదాను కలిగి ఉంటాయి. కాల్పుల విరమణకు ఒప్పుకోకపోతే భారత్, పాకిస్తాన్‌తో వాణిజ్యాన్ని నిలిపివేస్తానని ట్రంప్ బెదిరించటం చెల్లదు. అమెరికా బలవంతపు వ్యూహాలు, చర్యలు ఉద్రిక్తతలను పరిష్కరించకపోగా మరింత పెంచుతాయి. దేశాల మధ్య గల స్నేహ, సహకార సంబంధాలను దూరం చేస్తాయి. అమెరికా పెద్దన్న నాయకత్వ హోదాపై విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. ట్రంప్ సుంకాల విధానాలు దౌత్య నిబంధనలను లెక్కచేయని వైఖరిని చూపిస్తాయి. భారత్, చైనా, యూరోపియన్ యూనియన్‌లపై సుంకాలు విధించడం లేదా బెదిరించడం ద్వారా ప్రపంచ వాణిజ్య యుద్ధ భయాలను రేకెత్తించారు. ఇతర దేశాలు అమెరికా మార్కెట్‌ను దోపిడీ చేస్తున్నాయని ఆయన అర్థం లేని ఆరోపణలు వర్తక, వాణిజ్యం పరస్పర ప్రయోజనాలను విస్మరిస్తుంది. మిత్ర దేశాలను శత్రువులుగా చిత్రీకరిస్తుంది. ఇది ఆర్థిక స్థిరత్వాన్ని భంగం చేస్తుంది, అమెరికా నమ్మకమైన భాగస్వామిగా ఉన్న ఖ్యాతిని దెబ్బతీస్తుంది. ట్రంప్ అమెరికా ఫస్ట్ విధానం అమెరికా యువతకు ఆకర్షణీయ నినాదంగా ఉన్నప్పటికీ, ఇతర దేశాలను అమెరికాకు దూరం చేస్తుంది. పర్యావరణం సమతుల్యత, భద్రత వంటి అంశాల్లో నిధులు రద్దు చేసి, సభ్యత్వం, సహకారాన్ని అందించని ఆయన నిర్ణయాలు ప్రపంచ దేశాలను ఇబ్బందిపెడుతున్నాయి. అమెరికాను మళ్లీ గొప్పగా చేస్తానని ట్రంప్ చెప్పడం మంచిదే. గొప్ప ఆదర్శమే అందరూ ఆ లక్ష్యాన్ని గౌరవిస్తారు. అయితే అందుకు అనుసరించే పద్ధతులు కూడా ఆదర్శంగా ఉండాలి. అంతేగానీ విధ్వంసంగా ఉండకూడదు. ఆయన చర్యలు మిత్ర దేశాలను దూరం చేసుకొనే విధంగా ఉన్నాయి. ఆయన ప్రవర్తనతో అమెరికా కు శత్రువులను పెంచుతుంది. మిత్రదేశాలు మధ్య విభజన జరుగుతుంది. ట్రంప్ దౌత్యవైఫల్యాలు ఆయన ఆక్షేపణీయ మాటల నుండి వస్తున్నాయి. భారత్- పాకిస్తాన్ ద్వైపాక్షిక వివాదాల్లో అనవసర జోక్యం తగదు. ప్రపంచ నాయకత్వంపట్ల లోతైన అవగాహనను ఆయన పెంచుకోవాలి. కశ్మీర్ విషయంలో పూర్వచరిత్ర తెలియని ఆయన మాటలు అర్థం లేనివి. అమెరికా ఆర్థికశక్తి, ఆయుధ శక్తితోనే పెద్దరికం రాదు. ఆయన మాటలు అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు అనుగుణంగా లేవు. ఆయన బలప్రదర్శన, ఒత్తిళ్లు సమర్థనీయం కావు. ఆయన మాటలు దేశాల సార్వభౌమాధికారాన్ని అగౌరవపరిచాయి. సున్నితమైన భౌగోళిక సమస్యలను సంక్లిష్టం చేశాయి. ప్రపంచాన్ని శాసించే అధికారం కేవలం ధనం లేదా ఆయుధాలతో రాదు, పరస్పర గౌరవం, సహకారం, మర్యాద ద్వారా లభిస్తుంది. ట్రంప్ నిరంతరం ఈ లక్ష్యాలను, విలువలను దెబ్బ తీశారు. అమెరికా తన గౌరవాన్ని పునరుద్ధరించాలి అంటే, విభజన, ఆధిపత్య వైఖరిని వదిలి, పరస్పర గౌరవం, సమన్వయంతో కూడిన దౌత్యాన్ని అనుసరించాలి.

## 'కుట్రతోనే లిక్కర్ స్కామ్ అంటూ అక్రమ కేసు'



కాకినాడ: తమ ప్రభుత్వ హయాంలో పూర్తి పారదర్శకంగా అమలు చేసిన మద్యం విధానంపై, ఇప్పుడు టీడీపీ కూటమి ప్రభుత్వం కుట్రలు, కుతంత్రాలు చేస్తూ,వైఎస్సార్‌సీపీని ఇబ్బంది పెట్టే లక్ష్యంతో పని చేస్తోందని శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. తమ ప్రభుత్వ హయాంలో మద్యం అమ్మకాల్లో నిజంగా తప్పు జరిగి ఉంటే, నిష్పాక్షికంగా జరిపే ఎలాంటి విచారణనైనా స్వాగతిస్తామని ఆయన వెల్లడించారు. కానీ రాజకీయ దురుద్దేశాలతో తప్పుడు విచారణల పేరుతో వేధింపులకు పాల్పడితే సహించేది లేదని, ప్రభుత్వ తీరును ప్రజల్లో ఎండ గడతామని కాకినాడలో మీడియాతో మాట్లాడిన బొత్స సత్యనారాయణ తేల్చి చెప్పారు.

### బొత్స ఇంకా ఏం మాట్లాడారంటే..

కూటమి ప్రభుత్వం దారుణ వ్యవహారం

కూటమి ఏడాది పాలనలో పార్టీల హనీమూన్ ముగిసింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం పూర్తిగా తుంగలో తొక్కింది. కూటమి పాలనలో అవినీతి, దోపిడీ తప్ప ప్రజా సంక్షేమం, అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదు. రాజకీయ కక్ష సాధింపులకే మొత్తం సమయాన్ని వెచ్చిస్తున్నారు. ఎన్నికల ముందు ఆర్భాటంగా ప్రచారం చేసిన సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చకుండా తప్పించుకుంటున్నారు. మహిళలకు ఉచిత బస్సు, రైతులకు పెట్టుబడి సాయం, ప్రతి కుటుంబానికి ఏటా మూడు ఉచిత సిలిండర్లు, ఏటా 4 లక్షల ఉద్యోగాలు లేదా ప్రతి నెలా ఒక్కో నిరుద్యోగికి రూ.3 వేల భృతి, ఆడబిడ్డ నిధి కింద ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామన్నారు. కానీ, ఏడాది గడుస్తున్నా వాటిలో ఏదీ అమలు చేయడం లేదు. మరోవైపు ఎక్కడికక్కడ విచ్చలవిడిగా అంతులేని అవినీతి. దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా కేవలం 99 పైసలకే దాదాపు 3 వేల కోట్ల విలువైన భూముల అప్పగింత. ఇంకా కాకినాడలో బియ్యం అక్రమ రవాణా చేస్తున్నారంటూ.. 'సీజ్ ది షిప్' అని డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ నానా హంగామా చేశారు. ఒక్క బియ్యం గింజ కూడా అక్రమంగా రవాణా చేయడానికి వీలులేదని అన్నారు. కానీ ఒక్క దానిపైనా చర్యలు లేవు. పోలీసుల జులుంతో ప్రభుత్వాన్ని నడిపించాలని చూస్తున్నారు. అందుకే ప్రశ్నించే గొంతులను నొక్కేయాలని ప్రయత్నిస్తున్నారు.

### తెచ్చిన అప్పులు దేనికి ఖర్చు చేశారు?

ఏడాది పాలనలోనే ఏకంగా రూ.1.59 లక్షల కోట్లు అప్పులు చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇంతలా ఏడాదిలో అప్పులు చేయలేదు. ఇంత అప్పులు తెచ్చి ఏ ప్రజా సంక్షేమ కార్యక్రమానికి ఖర్చు చేశారు? మా హయాంలో అప్పులు చేసినా, వివిధ పథకాల కింద రూ.2.73 లక్షల కోట్లు ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) రూపంలో లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశాం. మరి కూటమి ప్రభుత్వం చేసిన అప్పులు దేనికి వినియోగించారో చెప్పాలి. సంపద సృష్టిస్తాను. అది తనకు బాగా తెలుసు అని ప్రచారం చేసిన చంద్రబాబు, మరి ఇన్ని అప్పులు, ఇంత తక్కువ సమయంలో ఎందుకు చేశారు? అప్పు చేయడం. ప్రచార ఆర్భాటాలకు ఖర్చు చేయడం చంద్రబాబుకు బాగా అలవాటు. అదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కొంత అప్పు చేసినా, ఆ ఖర్చులకు ఒక అర్థం ఉంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, తీర ప్రాంతాల్లో పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, భోగాపురం ఎయిర్‌పోర్ట్.. ఇలా ఉత్పాదకతకు దోహదం చేసే వాటికి ఖర్చు చేశాం. మాట ఇస్తే, దాన్ని తప్పకుండా నెరవేర్చాలనేది జగన్‌గారి విధానం. అందుకే ఎన్నికల ముందు, టీడీపీ కూటమి మాదిరిగా, అడ్డగోలు హామీలు ఇవ్వలేదు.

### పార్టీ కార్యాచరణ. నిర్ణయాలు

వైఎస్సార్‌సీపీ అయిదు జిల్లాల ముఖ్య నేతలతో ఈరోజు (శుక్రవారం) సమావేశం నిర్వహించాం. భవిష్యత్తులో అన్ని జిల్లాల్లో సంస్థాగతంగా క్షేత్రస్థాయి నుంచి పార్టీ కమిటీల ఏర్పాటు, ప్రతి జిల్లాలో పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహణపై నిర్ణయం తీసుకున్నాం. అలాగే గోదావరి జిల్లాల్లో ధాన్యం సేకరణపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రశ్నించడంతో పాటు, తీర ప్రాంతాల్లోని ఆక్వా రైతుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని నిర్ణయించడం జరిగింది. పశ్చిమ గోదావరి జిల్లా మెట్ట ప్రాంతంలో పొగాకు రైతులు మద్దతు ధర లేక ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోనూ పొగాకు రైతులు ఇదే సమస్యలపై ఇబ్బంది పడుతున్నారు. దీనిపై పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్, పొగాకు రైతులను కలిసి నేరుగా వారితో మాట్లాడనున్నారు. తదుపరి పొగాకు కొనుగోళ్ళపై ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు పార్టీ పరంగా కార్యాచరణను ఖరారు చేయడం జరుగుతుంది. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో పొగాకు మద్దతు ధర లభించని సందర్భంగా మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నాం. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం దీనికి భిన్నంగా రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఆ మొద్దునిద్ర నుంచి ప్రభుత్వాన్ని మేల్కొలిపేందుకు రైతుల పక్షాన పోరాడతామని బొత్య సత్యనారాయణ హెచ్చరించారు.

## ఈ ఆకు రోజూ పిడికెడు తింటే చాలు.. అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు..! తెలిస్తే..



మన చుట్టూ ఉండే పరిసరాల్లో ఎన్నో ఔషధ గుణాలతో కూడిన మొక్కలు, చెట్లు అనేకం ఉన్నాయి. అయితే వాటి ఆరోగ్య ప్రయోజనాలు మాత్రం చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. అలాంటి ఔషధ గుణాలు కలిగిన మొక్కలలో మునగ చెట్టు ఒకటి. మునగ కాయలతో పాటు మునగ ఆకులు కూడా ఎన్నో రకాల ఆరోగ్య ప్రయోజనాలు కలిగి ఉందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. వీటిలో ఉన్న యాంటీ



ఆక్సిడెంట్లు, విటమిన్లు, మినరల్స్ 300 రకాల రోగాలను నయం చేసే అవకాశం ఉందని చెబుతున్నారు. మునగాకులో ఫైబర్, ప్రొటిన్లు సమృద్ధిగా లభిస్తాయి. మునగాకులలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడి, వాపులను తగ్గిస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఇది గుండె జబ్బులను నిరోధించి గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. మునగాకులలో ఫైబర్, ప్రొటీన్లు సమృద్ధిగా ఉండటంతో జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తాయి. అయితే వీటిని పొడిలా తయారు చేసి, పచ్చడి, పప్పు లేదా సాంబార్, రసం వంటివి చేసుకుని తినవచ్చు. మునగాకులను తినడం వల్ల రక్తంలో షుగర్ స్థాయిలు తగ్గిపోతాయి. డయాబెటిస్ ఉన్నవారికి ఇవి ఒక వరం లాంటి ఆహారంగా మారతాయి. రోజువారీ ఆహారంలో మునగాకులు ఎంతో మేలు చేస్తాయి. మునగాకులను తినడం వల్ల అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలు అందుతాయి. మునగాకులలో ఉండే సమ్మేళనాలు శరీరంలో వాపులు, నొప్పులను తగ్గిస్తాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్‌తో బాధపడేవారికి ఇది ఎంతో మేలు చేస్తుంది. 100 గ్రాముల మునగాకుల్లో విటమిన్ సి - 18 మిల్లీగ్రాములు, విటమిన్ ఎ - 9100, క్యాల్షియం - 130 మిల్లీగ్రాములు, ప్రోటీన్ 4 గ్రాములు ఉంటాయి. మునగాకులలో విటమిన్ సి, విటమిన్ ఎ కొల్లాజెన్ ఉత్పత్తి చేయడానికి సాయపడతాయి. ఈ కారణంగా చర్మం కాంతివంతంగా కనిపిస్తుంది. ముఖంపై ముడతలు తగ్గి యవ్వనంగా ఉండేలా చేస్తుంది. ఇవి శరీర శక్తి స్థాయిలను పెంచి, అలసట, నీరసం నుంచి ఉపశమనం ఇస్తాయి. ఉదయం మునగాకులు తింటే రోజంతా చురుకుగా ఉండేలా చేస్తాయి.

# రక్తంలో ప్లేట్ లెట్లను పెంచే సహజమైన ఫుడ్ ఇదే!

### డెంగ్యూ వంటి విష జ్వరాలు, పోషకాహార లేమితో రక్తంలో తగ్గిపోయే ప్లేట్ లెట్లు
### గాయాలు మానడానికి, రక్తం గడ్డకట్టడానికి ప్లేట్ లెట్లు తప్పనిసరి
### వాటి సంఖ్యను సహజంగానే పెంచేందుకు కొన్ని రకాల ఆహారం తోడ్పడుతుందని చెబుతున్న నిపుణులు

ఇటీవలి కాలంలో డెంగ్యూ వంటి విష జ్వరాలు పంజా విసురుతున్నాయి. దానితో రక్తంలో ప్లేట్ లెట్ల సంఖ్య తగ్గిపోయి ఆరోగ్యంపై ప్రభావం పడుతోంది. పోషకాహార లేమి కూడా ఈ సమస్యను మరింతగా పెంచుతోంది. శరీరంలో గాయాలు మానడానికి, రక్తం గడ్డకట్టడానికి ప్లేట్ లెట్లు తప్పనిసరి. తగిన సంఖ్యలో ప్లేట్ లెట్లు లేకుంటే... ప్రాణాలకే ప్రమాదం కూడా.



అలాంటి ప్లేట్ లెట్ల సంఖ్యను సహజంగానే పెంచేందుకు కొన్ని రకాల ఆహారం తోడ్పడుతుందని నిపుణులు చెబుతున్నారు. రోజువారీ ఆహారంలో వాటిని చేర్చుకుంటే మంచి ప్రయోజనం ఉంటుందని వివరిస్తున్నారు.

బొప్పాయి పళ్లు, ఆకులు...

గతంలో డెంగ్యూ వ్యాధి తీవ్ర స్థాయిలో పంజా విసిరినప్పుడు... బొప్పాయి ఆకులు, బొప్పాయి పళ్లతో ఉన్న ప్రయోజనంపై వార్తలు వెలువడ్డాయి. చాలా మందిలో ఇవి మంచి ఫలితాన్ని కూడా ఇచ్చాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. బొప్పాయిలో



అధికంగా ఉండే విటమిన్ సి, కొన్ని రకాల ఎంజైమ్ లు రక్తంలో ప్లేట్ లెట్ల సంఖ్య పెరగడానికి తోడ్పడతాయని వివరిస్తున్నారు.

దానిమ్మ పళ్లు...



ఒక రకంగా చెప్పాలంటే దానిమ్మ పండు వరప్రదాయిని అని నిపుణులు చెబుతున్నారు. ఇందులో అధిక స్థాయిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజ లవణాలు శరీరంలో వ్యాధి నిరోధక శక్తి (ఇమ్యూనిటీ)ని బలోపేతం చేస్తాయని వివరిస్తున్నారు. ముఖ్యంగా రక్తంలో ప్లేట్ లెట్ల సంఖ్య పెరగడానికి తోడ్పడతాయని పేర్కొంటున్నారు.

ఆకుకూరలు, ఆకుపచ్చని కూరగాయలు...

పాలకూర, కేల్, బ్రొకొలి వంటి ఆకుకూరలు, కూరగాయల్లో విటమిన్ కె ఎక్కువగా ఉంటుందని... మన శరీరంలో రక్తం గడ్డకట్టేందుకు ఇది కీలకమైనదని నిపుణులు చెబుతున్నారు. వీటిని ఏదో ఒక రకంగా తరచూ ఆహారంలో భాగం చేసుకుంటే మంచి ప్రయోజనం ఉంటుందని వివరిస్తున్నారు.

గోధుమ గడ్డి...

గోధుమ గడ్డి జ్యూస్ ను తరచూ తీసుకుంటుంటే... శరీరంలో హిమోగ్లోబిన్ వృద్ధి చెందుతుందని, ప్లేట్ లెట్ల సంఖ్య పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు.

నువ్వుల నూనె...

మన శరీరానికి అత్యంత అవసరమైన ఫ్యాటీ యాసిడ్లు, పోషకాలు నువ్వులలో ఉంటాయని... అవి రక్తంలో ప్లేట్ లెట్ల సంఖ్య పెరిగేందుకు దోహదం చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. నువ్వుల నూనెతో వంట చేసుకున్నా... రోజూ ఒక స్పూన్ నేరుగా తీసుకున్నా మంచి ప్రయోజనం ఉంటుందని వివరిస్తున్నారు.

గుమ్మడి పండు...



గుమ్మడి పండ్లలో అధికంగా ఉండే విటమిన్ ఏ, కొన్ని ఎంజైములు మన శరీరంలో ప్లేట్ లెట్ల ఉత్పత్తికి తోడ్పడతాయని నిపుణులు చెబుతున్నారు. అదే సమయంలో ఇమ్యూనిటీని పెంచుతాయని... డెంగ్యూ వంటి వ్యాధులను ఎదుర్కోవడంలో తోడ్పడతాయని వివరిస్తున్నారు.

బీట్ రూట్...

దీనిలో ఐరన్, ఫోలేట్ అధికంగా ఉంటాయని... ఇవి ఎర్ర రక్తకణాలు, ప్లేట్ లెట్ల ఉత్పత్తికి తోడ్పడతాయని నిపుణులు చెబుతున్నారు. జ్యూస్ గా గానీ, సలాడ్ల రూపంలో గానీ బీట్ రూట్ తీసుకుంటే మంచిదని సూచిస్తున్నారు.

క్యారెట్లు...

వీటిలో అధికంగా ఉండే విటమిన్ ఏ, బీటా కెరోటిన్ వంటివి ప్లేట్ లెట్ల ఉత్పత్తికి, ఇమ్యూనిటీ పెరుగుదలకు తోడ్పడతాయని నిపుణులు చెబుతున్నారు. వీటిని కూరల్లో భాగంగా, పచ్చిగా, జ్యూస్ గా... ఇలా ఎలా తీసుకున్నా ప్రయోజనం ఉంటుందని వివరిస్తున్నారు.

సిట్రస్ పళ్లు...

నారింజ, నిమ్మ వంటి సిట్రస్ జాతి పళ్లలో విటమిన్ సి ఎక్కువని... ఇది ఇమ్యూనిటీకి, ప్లేట్ లెట్ల సంఖ్య పెరగడానికి దోహదం చేస్తుందని నిపుణులు వివరిస్తున్నారు.

# లివర్ ను సహజంగా క్లీన్ చేసే ఆహారం ఇదే!

### మారిన జీవన శైలితో కాలేయంపై పెరుగుతున్న ఒత్తిడి
### దాని పనితీరు దెబ్బతింటే ఎన్నో ఆరోగ్య సమస్యలు
### కొన్ని రకాల ఆహారంతో లివర్ పునరుత్తేజం చెందుతుందంటున్న ఆరోగ్య నిపుణులు



మన శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవాల్లో కాలేయం (లివర్) ఒకటి. రక్తంలోని విష పదార్థాలు, వ్యర్థాలను తొలగించడంతోపాటు... మనం తినే ఆహారం సరిగా జీర్ణం కావడానికి కాలేయమే కీలకం. కానీ మన ఆహార అలవాట్లలో మార్పులు, ఆల్కహాల్ వినియోగం, జీవన శైలిలో మార్పుల వల్ల కాలేయంపై ఒత్తిడి పెరుగుతోంది. ఫ్యాటీ లివర్ వంటి సమస్యలు వస్తున్నాయి. అయితే కాలేయానికి తనంతట తాను మరమ్మతు చేసుకునే శక్తి ఉంటుందని... ఇందుకోసం కొన్ని రకాల ఆహార పదార్థాలు తోడ్పడుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఆ ఆహారాన్ని మన రోజువారీ డైట్ లో చేర్చుకుంటే మంచి ఫలితం ఉంటుందని వివరిస్తున్నారు. ఆరోగ్య నిపుణులు చెబుతున్న ఆ ఆహార పదార్థాలు ఏవంటే...

వెల్లుల్లి...

దీనిలో సల్ఫర్ ఆధారిత రసాయన సమ్మేళనాలు అధికంగా ఉంటాయి. శరీరంలోని విష పదార్థాలను బయటికి పంపేందుకు కాలేయం ఉత్పత్తి చేసే ఎంజైముల తయారీలో ఆ రసాయన సమ్మేళనాలు తోడ్పడుతాయి. ఇక వెల్లుల్లిలోని అల్లిసిన్, సెలీనియం రెండూ కూడా కాలేయాన్ని రక్షిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

బీట్ రూట్...

వీటిలోని బెటాలైన్స్ గా పిలిచే రసాయన సమ్మేళనాలు కాలేయం ఇన్ ఫ్లమేషన్ ను తగ్గిస్తాయని... విష పదార్థాలను బయటికి పంపడంలో తోడుగా నిలుస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. తరచూ బీట్ రూట్ రసం తీసుకోవడం వల్ల కాలేయం పనితీరు మెరుగుపడుతుందని వివరిస్తున్నారు.

గ్రీన్ టీ...



గ్రీన్ టీలో కెటచిన్స్ గా పిలిచే రసాయన సమ్మేళనాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ. అవి కాలేయం పనితీరును మెరుగుపర్చి, వ్యాధులు రాకుండా చూస్తాయి. తరచూ గ్రీన్ టీ తీసుకుంటే... లివర్ ఎంజైమ్ ను నియంత్రించి ఆరోగ్యాన్ని ఇస్తుంది.

ఆకుకూరలు, కూరగాయలు...

ముదురు ఆకుపచ్చ రంగులో ఉండే ఆకుకూరలు, కూరగాయల్లో అధికంగా ఉండే క్లోరోఫిల్... లివర్ పనితీరును మెరుగుపరుస్తుంది. రక్తంలోని భార ఖనిజాలు, రసాయనాలు, పురుగు మందుల అవశేషాలను తొలగించడంలో లివర్ కు సాయపడుతుంది.

ఆలివ్ ఆయిల్...

ఆలివ్ ఆయిల్ లో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వు పదార్థాలు... శరీరంలో కొన్నిరకాల విష పదార్థాలను శోషించుకుంటాయి. తద్వారా కాలేయంపై ఒత్తిడిని తగ్గిస్తాయి. ముఖ్యంగా ఎక్స్ ట్రా వర్జిన్ ఆలివ్ ఆయిల్ ఉపయోగించడం వల్ల లాభం ఉంటుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

వాల్ నట్స్..

వీటిలో అర్జినైన్ అనే అమైనో ఆమ్లం అధికంగా ఉంటుంది. అది శరీరంలో ఉత్పన్నమయ్యే అమ్మోనియాను తొలగించడంలో కాలేయానికి సాయపడుతుంది. ఇక వాల్ నట్స్ లోని ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు, గ్లుటాథియాన్ వంటివి కాలేయం పనితీరును మెరుగుపర్చి వ్యాధులు రాకుండా చూస్తాయి. ఇక పసుపులోని కర్క్యుమిన్ అద్భుతమైన యాంటీ ఆక్సిడెంట్ గా పనిచేస్తూ.. కాలేయం దెబ్బతినకుండా కాపాడుతుంది. నారింజ, నిమ్మ వంటి సిట్రస్ పండ్లలో అధికంగా ఉండే 'విటమిన్ సీ' తోనూ శరీరంలో విష పదార్థాలు తొలగిపోయి... కాలేయం ఆరోగ్యానికి తోడ్పడుతుంది. యాపిల్స్ లో ఉండే పెక్టిన్ అనే ఫైబర్ శరీరంలో విష పదార్థాలను తొలగించి, కాలేయానికి తోడ్పడుతుంది.

## రోజూ పొద్దున్నే నెయ్యిని ఇలా తీసుకుంటే ఊహించని లాభాలు.. వెంటనే అలవాటు చేసుకోండి..





నెయ్యిలోని ఔషధ గుణాలు శరీరానికి చాలా మేలు చేస్తాయి. మన ఆరోగ్యానికి అవసరమైన విటమిన్ ఎ, విటమిన్ ఇ, విటమిన్ కె వంటి ప్రొటీన్స్, కొవ్వుని కరిగించే విటమిన్స్ పుష్కలంగా ఉన్నాయి. నెయ్యి వల్ల శరీరానికి ఎన్నో లాభాలు ఉన్నాయి. అయితే, నెయ్యి కలిపిన నీళ్లను రోజూ ఉదయం తీసుకోవడం వల్ల జీర్ణశక్తి మెరుగు పడటమే కాకుండా కడుపుబ్బరం, గ్యాస్, మలబద్ధకం వంటి సమస్యలు దూరం అవుతాయి. మరిన్ని లాభాలు ఇక్కడ తెలుసుకుందాం.. ఉదయం ఖాళీ కడుపుతో గోరువెచ్చని నీటిలో 2 టేబుల్ స్పూన్ల నెయ్యి కలిపి తాగడం వల్ల శరీరంలోని రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంతోపాటు అనేక రకాల ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ లభిస్తుంది. గోరువెచ్చని నీటిలో నెయ్యి కలిపి తాగడం వల్ల శరీరంలోని టాక్సిన్స్



తొలగిపోతాయి. ఎముకలు ధృడంగా తయారవుతాయి. నెయ్యిలో బ్యూటిరిక్ ఆమ్లము ఉంటుంది. దీని కారణంగా రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అందుకే రోజు ఉదయం నెయ్యి కలిపిన నీళ్లను తీసుకోవడం మంచిది. మెరిసే చర్మం కావాలని ప్రతీ ఒక్కరికి ఉంటుంది. చర్మం పొడిబారకుండా ఎల్లప్పుడూ తేమగా ఉండాలంటే నెయ్యి కలిపిన నీళ్లను తీసుకోవాలి. దీనివల్ల శరీరంలోని చెడు పదార్థాలు బయటకు పోయి చర్మానికి కావలసిన మెరుపు వస్తుంది. నెయ్యిని తీసుకుంటే ఎముకల బలం పెరుగుతుంది. దృష్టి సమస్యలు దూరమవుతాయి. ఇమ్యూనిటీ పవర్ పెరుగుతుంది. జీవక్రియ ప్రక్రియ పెరుగుతుంది. నెయ్యిలో బ్యాట్రిక్ యాసిడ్ కూడా ఉంటుంది. ఇది శరీరంలో మంటను తగ్గిస్తుంది. ఇది జీర్ణ వ్యవస్థని ఆరోగ్యంగా ఉంచుతుంది. ప్రేగు వాపుని తగ్గిస్తుంది. ఎముకల కీళ్ళకు బలాన్ని అందించడంలో నెయ్యి బాగా సాయపడుతుంది. గోరువెచ్చని నీటిలో నెయ్యి కలుపుకుని తాగడం వల్ల ఎముకలు ధృఢంగా ఉండి అనవసర నొప్పులు తగ్గిపోతాయి.

## వెయిట్ లాస్ చేసే హెల్దీ బ్రేక్ ఫాస్ట్.. టేస్ట్ అదుర్స్ అంతే!



ప్రస్తుత కాలంలో ఎంతో మంది ఇబ్బంది పడే సమస్యల్లో అధిక బరువు, ఊబకాయం కూడా ఒకటి. వీటి కారణంగా ఇతర అనారోగ్య సమస్యలు కూడా వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. బరువును తగ్గించుకునేందుకు డైట్ కూడా మెయిన్ టైన్ చేస్తూ ఉండాలి. రోజూ తినే వాటిని తినీ తినీ బోర్ కొడుతుంది. టేస్టీగా, వెరైటీగా తినాలని మనసు చెబుతూ ఉంటుంది. అలాంటి వారు ఈ హెల్దీ బ్రేక్ ఫాస్ట్ ఖచ్చితంగా ట్రై చేయవచ్చు. ఇది రుచిగా ఉండటమే కాకుండా.. కొద్దిగా తిన్నా కడుపును నిండుగా ఉంచుతుంది. కాబట్టి ఎక్కువగా కూడా తీసుకోలేరు. ఆరోగ్యానికి మంచి చేసే పదార్థాలే ఎక్కువ. అది కూడా చియా సీడ్స్‌తో.. ఇవి హెల్త్‌కి చేసే మేలు అంతా ఇంతా కాదు. ఇది చాలా సింపుల్‌గా కూడా అయిపోతుంది. పెద్దగా హైరానా పడాల్సిన పని లేదు. మరి చియా సీడ్స్‌తో హెల్దీ బ్రేక్ ఫాస్ట్ ఎలా తయారు చేస్తారు? ఇందుకు కావాల్సిన పదార్థాలు ఏంటో ఇప్పుడు చూద్దాం.

చియాసీడ్స్‌తో హెల్దీ బ్రేక్ ఫాస్ట్: చియా సీడ్స్, బాదం పాలు లేదా పాటు, కొద్దిగా వెన్నిలా క్రీమ్, తేనె, బనానా లేదా స్ట్రాబెర్రీలు, యాపిల్, దానిమ్మ ఇలా ఏదైనా తీసుకోవచ్చు.

చియాసీడ్స్‌తో హెల్దీ బ్రేక్ ఫాస్ట్: ముందుగా చియా సీడ్స్‌ని ఓ పది నిమిషాల పాటు నీటిలో నానబెట్టాలి. ఇప్పుడు వీటిని ఒక గాజు గ్లాస్ లేదా గాజు గిన్నెలోకి తీసుకోవాలి. ఇందులో బాదం మిల్క్ లేదంటే సాధారణ కాచిన పాలను అయినా తీసనుకోవచ్చు. ఆ తర్వాత ఫ్లేవర్ కోసం వెన్నిలా క్రీమ్ యాడ్ చేస్తారు. ఇందులో మీకు నచ్చిన ఫ్లేవర్ యాడ్ చేసుకోవచ్చు. అలాగే తేనె కూడా ఒక స్పూన్ కలపాలి. ఇది కూడా ఆప్షనల్. కావాలంటే వేసుకోవచ్చు. ఇప్పుడు ఇవన్నీ బాగా మిక్స్ చేసుకోవాలి. ఉదయాన్నే చేసుకుంటే ఓ అరగంట పాటు ఫ్రిజ్‌లో ఉంచండి. రాత్రి పూట రెడీ చేసుకుంటే.. ఉదయాన్నే తినేయవచ్చు. ఇక మీరు తినే ముందు బనానా లేదా స్ట్రాబెర్రీలు, యాపిల్, దానిమ్మ ఇలా ఏదైనా మీకు నచ్చి పండ్ల ముక్కలను కట్ చేసి వేసుకోవచ్చు. మీకు కావాలంటే నానబెట్టిన డ్రై నట్స్ పై నుంచి వేసి గార్నిష్ చేసుకోవచ్చు. అంతే ఎంతో రుచిగా ఉండే హెల్దీ బ్రేక్ ఫాస్ట్ సిద్ధం. దీన్ని మీరు డిన్నర్ లేదా స్నాక్‌లా కూడా తీసుకోవచ్చు. మంచి పోషకాలు అన్నీ శరీరానికి అందుతాయి.

# రోజూ పొద్దునే కాసిన్ని తులసి ఆకులు తింటే ఏమవుతుందో తెలుసా?

### మనం ఎంతో పవిత్రంగా భావించే మొక్క తులసి
### అందులో ఎన్నో రకాల ఔషధ గుణాలు ఉన్నాయని చెబుతున్న నిపుణులు
### నేరుగా నమిలిగానీ, టీ రూపంలోగానీ తీసుకుంటే మేలని సూచనలు

భారత సమాజంలో తులసి మొక్కలకు ఎంతో ప్రాధాన్యముంది. మనం ఎంతో పవిత్రంగా భావించి, ఇళ్ల ముందు పెంచే తులసి మొక్కల్లో ఎన్నో అద్భుత ఔషధ గుణాలు ఉన్నాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. తులసిలో ఉండే పదార్థాలు మనకు మంచి ఆరోగ్యాన్ని ఇవ్వడంతోపాటు వ్యాధులను దూరం పెడతాయని స్పష్టం చేస్తున్నారు. తులసి ఆకులను నేరుగా నమిలి తినడంగానీ, ఎండబెట్టి పొడి చేసి టీ రూపంలో తీసుకోవడంగానీ చేయవచ్చని చెబుతున్నారు. రోజూ పొద్దున్నే కొన్ని తులసి ఆకులు తీసుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని వివరిస్తున్నారు.

### రోగ నిరోధక వ్యవస్థను మెరుగుపరుస్తుంది

రోజూ పొద్దున్నే కొన్ని తులసి ఆకులను తీసుకోవడం వల్ల అందులోని యాంటీ ఆక్సిడెంట్లు, ఎసెన్షియల్ ఆయిల్స్ శరీరానికి అందుతాయి. అవి శరీరంలో రోగ నిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. బ్యాక్టీరియా, వైరస్ లతో పోరాడే శక్తిని ఇస్తాయి.

### కాలేయాన్ని శుభ్రపరుస్తుంది

తులసిలో ఉండే కొన్ని రసాయన పదార్థాలు శరీరం నుంచి విష పదార్థాలు, వ్యర్థాలు బయటికి వెళ్లిపోయేందుకు తోడ్పడుతాయి. ముఖ్యంగా కాలేయాన్ని శుభ్రం చేస్తాయి. రోజూ పరగడపున తులసి



ఆకులు తీసుకుంటే.. కాలేయం పనితీరు అద్భుతంగా మెరుగుపడుతుంది.

### ఒత్తిడి, యాంగ్జైటీని తగ్గిస్తుంది..

తులసిలోని 'అడాప్టోజెనిక్ కాంపౌండ్స్'గా పిలిచే రసాయన సమ్మేళనాలు ఉంటాయి. అవి శరీరంలో ఒత్తిడిని తగ్గించి, యాంగ్జైటీని దూరం చేస్తాయి. పొద్దున్నే తులసిని తీసుకోవడం వల్ల మనలో మానసిక ఒత్తిడికి కారణమయ్యే కార్టిసాల్ హార్మోన్ ఉత్పత్తి తగ్గిపోతుంది. ప్రశాంతంగా ఉన్న భావన వస్తుంది.

### జీర్ణ వ్యవస్థకు ఎంతో మేలు

తులసి మన శరీరంలో జీర్ణక్రియకు తోడ్పడే ఎంజైముల విడుదలను ప్రేరేపిస్తుంది. దీనిద్వారా ఆహారం బాగా జీర్ణమై, పోషకాలు శరీరానికి అందుతాయి. గ్యాస్, ఎసిడిటీ వంటి సమస్యలు తగ్గుతాయి.

### శ్వాస వ్యవస్థను మెరుగుపరుస్తుంది

తులసిలోని యాంటీ ఇన్ ఫ్లమేటరీ లక్షణాలు శ్వాస వ్యవస్థలో సమస్యలను దూరం చేస్తుంది. దగ్గు, ఆస్తమా, సైనస్, జలుబు వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది.

### రక్తంలో షుగర్ లెవల్స్ నియంత్రిస్తుంది



రోజూ ఉదయమే తులసి ఆకులను తీసుకోవడం వల్ల శరీరంలో ఇన్సూలిన్ సెన్సిటివిటీ పెరుగుతుంది. దీనితో రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. మధుమేహం ఉన్నవారికి దీనివల్ల మరింత ఎక్కువ ప్రయోజనం ఉంటుంది.

### గుండె ఆరోగ్యానికి ఎంతో మంచిది

శరీరంలో కొలెస్ట్రాల్, షుగర్ స్థాయిలను నియంత్రించడం, రక్తపోటు తగ్గేందుకు తోడ్పడటం ద్వారా తులసి మన గుండె ఆరోగ్యానికి ఎంతో తోడ్పడుతుంది.

EDITOR, PRINTER, PUBLISHER AND OWNED BY SIRASALA SURESH KUMAR, Printed at M/S MARPU PUBLICATION,# /639-1-7-15, NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPATRI-515 411, Ananthapuramu Dist., (A.P.), PUBLISHED AT # 1/639-1-7-15, NANDYAL ROAD,CPI COLONY, 4TH ROAD,TADIPATRI-515 411,Ananthapuramu Dist.,(A.P.). Cell:9398156948,REG.RNI: APTEL/2023/86845, E-Mail:janamnews19@gmail.com